మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

శుక్రవారం FRIDAY 9.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 65 ‖ వెల (Price) రూ.6.50 | గరుడ పంచమి

శుక్రవారం, సూర్యోదయం: 5-58, సూర్యాస్తమయం: 6-45. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం శుక్ల పక్షం తిథి: పంచమి రాత్రి 3-15 వరకు. నక్షత్రం: హస్త రాత్రి 2-45 వరకు. వర్జ్యం: ఉదయం 9-05 నుంచి ఉదయం 10-54 వరకు. రాహుకాలం: ఉదయం 10-45 నుంచి పగలు 12-21 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-31 నుంచి ఉదయం 9-22 వరకు, పునర్ దుర్ముహూర్తం పగలు 12-46 నుంచి పగలు 1-38 వరకు. అమృతకాలం: రాత్రి 7-56 నుంచి రాత్రి 9-45 వరకు.

వినేశ్ వీడ్కోలు



రిటైర్మెంట్ ప్రకటించిన స్టార్ రెజ్లర్

'కుస్తీ గెలిచింది నేను ఓడిపోయాను' అంటూ భావోద్వేగ ట్వీట్ › 11

ఫొగాట్ కేసుపై నేడు సీఏఎస్ విచారణ

చక్ దే ఇండియా



పారిస్‌లో భారత్ హాకీ కాంస్య కాంతులు › 11

స్పెయిన్‌పై చిరస్మరణీయ గెలుపు

కెరీర్‌కు గోల్‌కీపర్ శ్రీజేశ్ వీడ్కోలు

భట్టి అబద్ధం

సుంకిశాల వైఫల్యాన్ని బీఆర్ఎస్‌పైకి నెట్టేసే యత్నం



సుంకిశాల ప్రాజెక్టుకు సంబంధించి 11.6.2021న బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒప్పందం జరిగింది. 2022లో పనులు మొదలుపెట్టారు. జూలై 2, 2023 నాడు ఆ వాల్ నిర్మాణం జరిగింది. కట్టించింది బీఆర్ఎస్ ప్రభుత్వమే. సాగర్‌లోకి నీళ్లొచ్చాయట.. కూలిందట! సాగర్‌లోకి నీళ్లు రాకుంటే ఏమొస్తయ్!.. సాగర్ కట్టిందే నీళ్ల కోసం! ఆ నీళ్ల నుంచే కదా పంపుహౌస్ ద్వారా నీళ్లు తెచ్చుకుందామని కట్టుకున్నది. అవన్నీ దృష్టిలో పెట్టుకొనే కదా కట్టాల్సింది. డిజైన్లు ఎంత లోపభూయిష్టంగా ఉన్నాయో దీనిద్వారా అర్థమవుతున్నది. మీ పాలన, మీ పర్యవేక్షణ ఎలా ఉన్నాయో తెలుస్తున్నది. - ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



నీరు పల్లం.. నిజం తేటతెల్లం

సకల పాపాలకు కారణం అతడే అన్నట్టుగా ఉన్నది బీఆర్ఎస్ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి. ఏదైనా తప్పు జరిగిందా... అది బీఆర్ఎస్ పదేండ్ల పాలన పాపం! పదేండ్లలో ఏదైనా మంచి జరిగిందా.. అది పదేండ్ల కిందున్న కాంగ్రెస్ లేదా చంద్రబాబు ప్రభుత్వాల గొప్పతనం లేదా ఇప్పటి రేవంత్ సర్కార్ ఘనత.

పైనుంచి లెక్కలు అందుబాటులో ఉన్నా, కృష్ణానదిలో ప్రవాహాన్ని ఊహించలేక, సాగర్‌లో వరదను అంచనా వేయలేక, గేటుకు టైబీమ్ ఏర్పాటు పనులు పూర్తయ్యాయో లేదో చూసుకునే పర్యవేక్షణ లేక, పట్టించుకునే నాథుడులేక, సొరంగాన్ని ఎప్పుడు తెరవాలన్న తెలివిలేక, తప్పు మీద తప్పు చేసి, ఆ తప్పు ఎక్కడ అసెంబ్లీ దృష్టికి వస్తుందో అని వారంరోజులు దాచేసి, మసిబూసి మారేడుకాయ చేసిన రేవంత్ ప్రభుత్వం.. అసలు విషయాన్ని 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తేగానే తత్తరపడి, బిత్తరపోయి ఇదంతా బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకం వల్లే అనే పాతపాట అందుకున్నది.

సుంకిశాల కూలిపోవడం బీఆర్ఎస్ సర్కారు పాపమే అయితే వారం రోజులపాటు ఈ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టలేదు? సుంకిశాల తప్పుడు డిజైనే అయితే 8 నెలలుగా పరిపాలన చేసినవారు, దానిమీద సమీక్ష జరిపి పనులెందుకు ఆపలేదు? సుంకిశాల పనులు నాసిరకమే అయితే గత సీజన్‌లో వచ్చిన సాగర్ వరదకు ఎందుకు కొట్టుకుపోలేదు? సుంకిశాల కూలిపోవడం బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకమే అయితే కాళేశ్వరానికి తీసుకుపోయినట్టు వారానికో మీడియా బృందాన్ని ఎందుకు తీసుకుపోలేదు? హెలికాప్టర్‌లో రాహుల్ గాంధీని ఎందుకు రప్పించలేదు? ఇవన్నీ చేయకుండా ఆ వీడియో ఎవరుతీశారు? ఎవరు నమస్తే తెలంగాణకు ఇచ్చారని బెదిరింపులకు ఎందుకు దిగుతున్నట్టు? **వీటన్నిటిని బట్టి చూస్తే అర్థమవుతున్నది ఏమిటి? సుంకిశాల పాపం కచ్చితంగా కాంగ్రెస్ సర్కారుదే.**

జలమండలి చెప్పిన అసలు నిజం

- మిడిల్ టన్నెల్ గేటును పదిరోజుల క్రితమే బిగించాం
- టైబీమ్ నిర్మాణం జరుగుతుండగానే సొరంగం తెరిచివేత
- సాగర్‌కు వరద ఆలస్యంగా వస్తుందని అనుకున్నాం
- ఇంత ప్రవాహాన్ని ఊహించకపోవడం వల్లే ప్రమాదం
- సుంకిశాలపై విచారణ కమిటీ.. వాటర్‌బోర్డు వివరణ

- సైడ్‌వాల్ పునఃనిర్మాణానికి 20 కోట్ల రూపాయల ఖర్చు
- ఖర్చు నిర్మాణ సంస్థదే..
- పనులు రెండు నెలలు ఆలస్యమవుతాయి

వచ్చే వేసవిలోగా నీరు అందించాలనే ఉద్దేశంతో మిడిల్ టన్నెల్ పూర్తి చేయడానికి ఏజెన్సీ నిర్ణయం తీసుకున్నది. దీని ప్రకారం వారు సంప్ వైపు టన్నెల్‌పై గేటును ఏర్పాటు చేశారు. **(అంటే గేటు ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్నది స్పష్టం)** రిజర్వాయర్ వైపు ఉన్న మట్టిని తొలగించారు. **(అంటే గోడ కూలడానికి అసలు కారణం ఇదే. నాసిరకం నిర్మాణం కాదు).** అదే సమయంలో సివిల్ వర్క్స్ బృందాలే సైడ్‌వాల్స్ మధ్య.. టై బీమ్ కనెక్టివిటీని కాస్టింగ్ చేసే పనిలో ఉన్నాయి. **(అంటే ఈ పని పూర్తి కాకముందే సొరంగం ఓపెన్ చేశారు. దీంతో గేటుకు సపోర్ట్ సరిగా లేక కొట్టుకుపోయిందన్నమాట).**

రిజర్వాయర్‌కు వరద ఆలస్యంగా వస్తుందని, ఈ ఏడాది ఆగస్టు చివరి నాటికి మధ్య టన్నెల్ స్థాయికి లెవల్ పెరుగుతుందని ఏజెన్సీ భావించింది **(అంటే వరద భారీగా వస్తున్నదని లెక్కలు సూచిస్తున్నా, లేటుగా వస్తుందని ఎలా అనుకున్నారు? అంటే తప్పుడు అంచనాయే ప్రమాదానికి కారణం).** ఆగస్టు చివరినాటికి అవసరమైన టై బీమ్‌లను పూర్తిచేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. అదే సమయంలో మిడిల్ టన్నెల్ కోసం గేట్ ఫిక్సింగ్ పనులు చేపట్టారు.

జూలై 29, 30, 31 తేదీల్లో గేటు బిగింపు పనులు జరిగాయి. ఇదే సమయంలో నాగార్జునసాగర్‌కు ఒక్కసారిగా భారీ ప్రవాహం పెరిగింది. దాదాపు 3.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో నాగార్జునసాగర్ రిజర్వాయర్ వద్ద అకస్మాత్తుగా బ్యాక్ క్లోజ్ వేవ్ యాక్షన్ పెరిగి నీళ్లు టన్నెల్‌లోకి వచ్చాయి. దీంతో టన్నెల్ గేటు ధ్వంసమై.. దానికి అనుసంధానంగా ఉన్న సైడ్‌వాల్ కూలిపోయింది. **(అంటే టై బీమ్ పూర్తి కాకముందే సొరంగం ఓపెన్ చేయడమే అసలు ప్రమాదానికి కారణం అన్నమాట).** ఇదంతా ఐదు నిమిషాల స్వల్ప వ్యవధిలోనే జరిగింది. రిజర్వాయర్ సంపు పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండిపోయింది. - సుంకిశాల ప్రమాదంపై జలమండలి ప్రకటన

అసలేం జరిగిందంటే..

- కాంగ్రెస్ హయాంలోనే పదిరోజుల క్రితమే గేటు ఏర్పాటు
- టైబీమ్ కాకముందే, జూలైలోనే మిడిల్ టన్నెల్ తెరిచే ప్లాన్
- కర్నూల్ నుంచి యంత్రాన్ని తెప్పించి హడావుడిగా పనులు
- కృష్ణాకు భారీ వరద వస్తున్నట్టు లెక్కలున్నా రాదనుకున్నారట!
- సీనియర్ ఇంజినీర్లు వద్దన్నా వినిపించుకోని జలమండలి
- కరువైన ఉన్నతాధికారుల పర్యవేక్షణ.. ప్రమాదానికి కారణాలివే

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): కొందరు సీనియర్ ఇంజినీర్లు వద్దని వారించినప్పటికీ జలమండలి ఇంజినీర్లు వినకుండా హడావుడిగా టన్నెల్ ఓపెన్ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. సొరంగంలో తవ్వని భాగాన్ని తొలగించేందుకు యంత్రం లేకున్నా హడావుడిగా కర్నూల్ నుంచి తెప్పించి మరీ ఓపెన్ చేసినట్టు తెలిసింది. దీంతో నాగార్జునసాగర్‌లోకి వచ్చే భారీ › 2వ పేజీలో

షాద్‌నగర్‌లో దళిత మహిళపై పోలీస్ స్టేషన్‌లో ఖాకీల దౌర్జన్యం ఘటన అసెంబ్లీ సమావేశాలు నడుస్తున్నప్పుడే జరిగింది. కానీ వారం రోజులపాటు ప్రభుత్వం బయటపెట్టలేదు. దాని గురించి మాట మాట్లాడలేదు. సుంకిశాల ప్రమాదం కూడా ఆగస్టు 1నే జరిగింది. దీన్నీ ప్రభుత్వం వెల్లడించలేదు. అంటే సభలో తమకు ఇబ్బంది కలుగుతుందని అనుకున్న అంశాలను దాచేయడానికి ప్రయత్నించింది. తర్వాత అవి బయటపడటంతో ఉక్కిరిబిక్కిరై సాకులు వెతికే పనిలో పడింది.

దాచెయ్.. దబాయించెయ్!

- 'సుంకిశాల'పై ఇరకాటంలో కాంగ్రెస్.. బీఆర్ఎస్ సర్కార్‌పై నెట్టేసే కుట్ర
- వేళ్లన్నీ రేవంత్ ప్రభుత్వం వైపే.. వైఫల్యాన్ని దాచి గత పాలనపై నిందలు
- నాడు మేడిగడ్డ ఘటనపై గంటల్లోనే స్పందించిన కేసీఆర్ ప్రభుత్వం › 2
- సుంకిశాల ఘటనను వారం రోజులపాటు దాచిన కాంగ్రెస్ సర్కార్

తమ్ముడి కంపెనీతో ఒప్పందం తప్పెట్లయితది?

అధికారిక మీటింగ్‌లో రేవంత్ అన్న తిరుపతిరెడ్డి బరాబర్ కూర్చుంటడు

ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ › 5



› 10

సర్కారుకు 'స్వచ్ఛ' సెగ!

పెట్టుబడులపై అనుమానాలు.. ప్రభుత్వం ఆపసోపాలు

ఐఏఎస్ అధికారులతో వివరణ ఇప్పిస్తున్న రేవంత్ సర్కార్

'తమ్ముడి పెట్టుబడి'పై నెట్టింట్లో నమస్తే కథనం వైరల్ › 5



బీర్ల ధరలు భారీగా పెంపు? › 6

15-20 శాతం పెరిగే అవకాశం!

పెంపుపై ఎక్సైజ్ కమిటీ తర్జన భర్జన

నిమజ్జనం రోజు నుంచే కొత్త రేట్లు?

మాకెందుకు మాఫీ కాలే..?

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లిని నిలదీసిన రైతులు

బ్యాంకర్లు, అధికారులు పట్టించుకుంటలేరని ఆవేదన › 3

వక్ఫ్ ఆస్తుల్లో కేంద్రం జోక్యం! › 7

బోర్డుల్లో ముస్లిమేతరులకు చోటు

భూములపై కలెక్టర్‌దే నిర్ణయం

వక్ఫ్ చట్ట సవరణకు ప్రతిపాదనలు

విపక్షాల ఒత్తిడి.. బిల్లు జేపీసీకి!

అవసరాలు, సామర్థ్యాల మేరకే ఎక్స్‌టెన్షన్లు

- ఇరిగేషన్‌శాఖ వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): డిపార్ట్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ అవసరాలు, విరమణ పొందిన ఉద్యోగుల సామర్థ్యాల మేరకే వారి సర్వీస్‌ను కొనసాగించడం, రద్దు చేయడం జరుగుతుందని ఇరిగేషన్‌శాఖ వెల్లడించింది. ఈ మేరకు సాగునీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగ విరమణ చేసిన తరువాత ఎక్స్‌టెన్షన్ పొందిన వారు వివిధ హోదాల్లో సుమారు 72మంది ఉన్నారు. సదరు ఉద్యోగుల జాబితాను ఇరిగేషన్ ఈఎన్సీ అనిల్‌కుమార్ గతంలోనే ప్రభుత్వానికి నివేదించారు. ఆ జాబితాలోని ఒక్కో ఉద్యోగి వారీగా పరిశీలించినట్టు రాహుల్‌బొజ్జా వెల్లడించారు. సదరు ఉద్యోగుల నైపుణ్య సామర్థ్యాలు, డిపార్ట్‌మెంట్ అవసరాల నేపథ్యంలో కొందరిని యథావిధిగా కొనసాగిస్తున్నామని, మరి కొందరిని తొలగిస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే పలువురు ఉద్యోగులు స్వతహాగా రాజీనామా చేయగా, కొందరి పదవీకాలం ముగిసింది. ప్రస్తుతం మొత్తంగా శాఖలో 37మందిని కొనసాగిస్తున్నట్టు తెలిపారు. వారిలో ఎక్కువగా ఏఈఈలు, టెక్నికల్ ఆఫీసర్లు మాత్రమే ఉండగా, వారు కూడా టీజీపీఎస్సీ ద్వారా రెగ్యులర్ ఉద్యోగులు వచ్చే వరకు మాత్రమే ఉంటారని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

విద్యుత్తు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించండి

- డిప్యూటీ సీఎం భట్టికి ఆ సంఘం నేతల వినతి

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని విద్యుత్తు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు విద్యుత్తు ఉద్యోగ సంఘాల నాయకులు విన్నవించారు. గురువారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన భట్టి.. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని విద్యుత్తుశాఖ సీఎండీలను ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్తు ఉద్యోగ సంఘాల నాయకులు రత్నాకర్‌రావు, శ్రీధర్, బీసీ రెడ్డి, వరప్రసాద్, వేణుగోపాల్, సదానందం, వేణు, వెంకటనారాయణరెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణరాజు, పీవీ రావు, ప్రశాంత్, కిశోర్, వెంకటేశ్, సుజిత్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

రాష్ట్రంలో పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూటీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వతరెడ్డి, సదానందంగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. జూలై 2022 నుంచి రావాల్సిన నాలుగు విడతల(14.56 శాతం)డీఏ మంజూరు చేయాల్సి ఉండగా, నేటికీ ఉత్తర్వులు ఇవ్వకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంటనే రాష్ట్రంలో కూడా డీఏ ప్రకటించేలా శాశ్వత విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు కత్తి నరసింహారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యుడు దాసరి శ్రీధర్ పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతుల అప్పీళ్లను పరిష్కరించాలి: టీఎస్‌యూటీఎఫ్

రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగిసి 40 రోజులు గడుస్తున్నా అప్పీళ్లను పరిష్కరించకపోవడం తగదని టీఎస్‌యూటీఎఫ్ ఆక్షేపించింది. వెబ్ కౌన్సెలింగ్‌లో ప్రక్రియ జరిగినప్పటికీ కొన్ని సాంకేతిక కారణాలు, అధికారుల తప్పిదాల కారణంగా నష్టపోయిన ఉపాధ్యాయులకు విద్యాశాఖ అప్పీళ్లకు వారంపాటు గడువు ఇచ్చిందని, అప్పీళ్ల పరిష్కారం కాకపోవడంతో వారు నిత్యం డైరెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారని పేర్కొంది. అప్పీళ్లను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తిచేశారు.

పదోన్నతులు కల్పించండి

తమకు పదోన్నతులు కల్పించాలని సచివాలయ సెక్షన్ ఆఫీసర్లు(ఎస్‌వో), అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు (ఏఎస్‌వో)ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఎస్‌వోలు, ఏఎస్‌వోలు గురువారం సచివాలయంలో జీఏడీ కార్యదర్శి రఘునందన్‌రావును కలిసి విన్నవించారు. ప్రభుత్వం అన్ని స్థాయిల్లో పదోన్నతులు కల్పించినట్టే తమకు కల్పించాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని రఘునందన్‌రావు వారికి హామీ ఇచ్చారు.

'జాతీయ స్థాయి' దవాఖానలో వైద్యుల్లేరు!

- బదిలీపై వెళ్లిన కౌటాల పీహెచ్‌సీ సిబ్బంది



కౌటాల, ఆగస్టు 8: జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రస్తుతం వైద్యుల్లేరు. కాంగ్రెస్ సర్కారు పుణ్యమా అని ప్రస్తుతం సిబ్బంది అంతా బదిలీపై వెళ్లడంతో ఇక్కడ మందు గోలీలిచ్చే నాథుడే లేడని రోగులు వాపోతున్నారు. మెరుగైన వైద్యసేవలు అందించినందుకు అప్పటి వైద్యాధికారి పల్లవికి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు వచ్చిందని గుర్తుచేస్తున్నారు. గతంలో ప్రతి నెలా 30 నుంచి 35 వరకు సాధారణ ప్రసవాలు జరిగాయని, సిబ్బంది రాత్రింబవళ్లు వైద్యసేవలు అందించి ప్రశంసలు అందుకున్నారని పేర్కొంటున్నారు. సిబ్బంది అంతా బదిలీపై వెళ్లగా.. స్టాఫ్ నర్సు మాత్రమే ఉండేది. ఆమె కూడా ఇటీవల బదిలీ అయ్యింది. లోనవెల్లి వైద్యాధికారి నవతను ఈ దవాఖానకు ఇన్‌చార్జి వైద్యాధికారిగా నియమించారు. సాయంత్రానికల్లా దవాఖాన మూతపడుతున్నదని రోగులు మండిపడుతున్నారు.

స్మగ్లింగ్ చేసే వారే ఇప్పటి హీరోలు: పవన్



హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతో గురువారం సమావేశమైన ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనంతరం చేసిన వ్యాఖ్యలు మెగా, అల్లు అభిమానుల మధ్య చిచ్చు రాజేశాయి. ఏపీ, కర్ణాటక మధ్య వన్యప్రాణులు, అటవీ సంరక్షణ, కుంకి ఏనుగులను ఏపీకి తీసుకురావడం తదితర అంశాలపై ఇరువురు చర్చించారు. అనంతరం విలేకరులతో పవన్ మాట్లాడుతూ 40 ఏండ్ల క్రితం సినిమాల్లో హీరోలు అడవులను కాపాడేవారని, ఇప్పటి సినిమాల్లో హీరోలు అడవుల్లో చెట్లను నరికి స్మగ్లింగ్ ఎలా చేయాలో చూపిస్తున్నారని చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. కన్నడ సూపర్‌స్టార్ రాజ్‌కుమార్ నటించిన 'గందదగుడి' సినిమాను ప్రస్తావించిన పవన్.. ఆ సినిమాలో హీరో అడవులను కాపాడతాడని, కానీ ఇప్పుడు హీరోలు అడవిలో చెట్లను నరికి స్మగ్లింగ్ చేస్తున్నారని పేర్కొన్నారు. పవన్ చేసిన వ్యాఖ్యలు మళ్లీ చర్చకు తెరలేపాయి.

బీర్ల ధరలు భారీగా పెంపు?

- ధరల పెంపుపై ఎక్సైజ్ కమిటీ తర్జన భర్జన
- 15-20 శాతం ధరలు పెరిగే అవకాశం!
- వినాయక నిమజ్జనం రోజు నుంచే కొత్త ధరలు?
- రాష్ట్ర ప్రభుత్వానికి కమిటీ ప్రతిపాదనలు?
- ఇప్పటికే అన్ని బ్రూవరీస్‌తో మాటామంతీ
- కేసుకు రూ.450 వరకు బ్రూవరీల డిమాండ్



హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో భారీగా బీర్ల ధరలు పెరగనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎక్సైజ్ కమిటీ గురువారం ఆబ్కారీభవన్‌లో సమావేశమైంది. ప్రభుత్వం ఇటీవల నిర్దేశించిన రూ.వేల కోట్ల లక్ష్యాన్ని చేరుకోవాలంటే మద్యం ధరల పెంపు ఒక్కటే పరిష్కారమార్గంగా కనిపిస్తున్నది. దీనికితోడు ప్రభుత్వ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే తక్షణం బీర్ల ధరలను పెంచాల్సిందేనని తెలుస్తున్నది. అయితే, బీర్ల ధరల పెంపుపై గురువారం సమావేశమైన ఎక్సైజ్ కమిటీ.. ధరల పెంపుపై తర్జన భర్జనలు చేసినట్టు తెలిసింది. ప్రభుత్వ పెద్దల డైరెక్షన్‌లోనే సుమారు 15-20 శాతం ధరలు పెంచేందుకు ఓ నిర్ణయానికి వచ్చినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. బీర్ల ఉత్పత్తి కేంద్రాల (బ్రూవరీల)కు ప్రస్తుతం ప్రభుత్వం చెల్లిస్తున్న ధరలను 10-15శాతం మేర పెంచాలని, ఆ నష్టాన్ని పూడ్చుకొనేందుకు, ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేందుకు 15-20 శాతం ధరలు పెంచాలని నిర్ణయించినట్టు తెలిసింది. కాగా, భారం పూర్తిగా వినియోగదారులపైనే పడనున్నది.

ఒక్కో కేసుకు రూ.450 డిమాండ్

తెలంగాణలోని 6 బ్రూవరీల్లో ఏటా 88 కోట్ల లీటర్ల బీరు ఉత్పత్తి అవుతున్నది. ఆ బీరును తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ కొనుగోలుచేసి మద్యం దుకాణాలకు సరఫరా చేస్తుంది. 12 బీర్లు ఉండే ఒక కేసుకు బేవరేజెస్ కార్పొరేషన్ లైట్ బీర్లకు రూ.289, స్ట్రాంగ్ బీర్లకు రూ.313 చెల్లిస్తున్నది. అక్కడి నుంచి మద్యం దుకాణాలకు రూ.1,400 చొప్పున చేరుతున్నది. మద్యం దుకాణాలు ఒక్కో కేసు రూ.1,800 చొప్పున అమ్ముకుంటున్నాయి. తయారీ కేంద్రాల వద్ద సుమారు రూ.24కి లభించే ఒక బీరు.. కార్పొరేషన్ చేతి నుంచి మద్యం దుకాణాలకు వచ్చేసరికి రూ.117.. వినియోగదారులకు వచ్చేసరికి రూ.150 అవుతున్నది. తమకు నిర్వహణ ఖర్చులు భారీగా పెరిగాయని, 2021 నుంచి ఇప్పటి వరకు ధరలు పెంచలేదని.. ఇప్పుడు కనీసం 20-25 శాతం ధరలు పెంచాలని అన్ని బ్రూవరీలు ఎక్సైజ్ కమిటీ ముందు ప్రతిపాదన పెట్టాయి. ఈ నెల మొదటి వారంలో ఒక్కో రోజు ఒక్కో బ్రూవరీ ప్రతినిధులను పిలిచి.. ఎక్సైజ్ కమిటీ విడివిడిగా మాట్లాడింది. గతంలో ఒక్కో కేసుకు రూ.289 ఉంటే.. పెరిగిన నిర్వహణ దృష్ట్యా తమకు రూ.450 ఇవ్వాలని ఆ ప్రతినిధులు డిమాండ్ చేశారు. బ్రూవరీలకు అడిగినంతా రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ ఇవ్వాల్సి వస్తే.. బీర్ల ధరలు కనీసం 20 శాతం పెరగనున్నట్టు తెలిసింది.

ప్రభుత్వ లక్ష్యానికి మద్యం ప్రియులే దిక్కు!

మద్యం ఆదాయాన్ని మరో రూ.5,318 కోట్లు పెంచాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకొన్నది. ఎక్సైజ్‌శాఖలోని ఒక్క మద్యం విభాగం నుంచే రూ.25,617 కోట్ల నిధులను ఆశిస్తున్నట్టు వెల్లడించింది. ఆ మేరకు ఇప్పుడు బీర్ల ధరల పెంపునకు సిద్ధమైంది. ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే బీర్లు, లిక్కర్ కలిపి కనీసం 25 శాతం అదనంగా మద్యం అమ్మకాలు చేపట్టాల్సి ఉన్నది. దీంతో మరింత తాగించడం ఒకటి కాగా, రెండోది ధరలు పెంచడమే మార్గంగా కనిపిస్తున్నది. సర్కారుకు వస్తున్న ఆదాయ వనరుల్లో మద్యానిదే ప్రధాన పాత్ర. మద్యం అమ్మకాలు, ట్యాక్స్‌ల ద్వారా ఏటా సుమారు రూ.35 వేల కోట్ల వరకు సర్కారుకు ఆదాయం సమకూరుతున్నది. ఈ లక్ష్యాన్ని ప్రభుత్వం రూ.45 వేల కోట్లకు పెంచింది. ఈ క్రమంలోనే బీర్ల ధరలకు త్వరలో రెక్కలు రాబోతున్నాయి.

వినాయక నిమజ్జనం రోజునే?

బీర్ల ధరల పెంపుపై గురువారం సమావేశమైన ఎక్సైజ్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి ధరల పెంపు ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది. దీనిపై ప్రభుత్వ పెద్దలు ఓ నిర్ణయం తీసుకోనున్నారు. బీర్ల ధరలు పెంచితే కొత్త ధరలను వినాయక నిమజ్జనం రోజునే అమల్లోకి తెస్తారని సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు కేవలం బీర్ల ధరలే పెరగనున్నాయి. ఇతర లిక్కర్ ధరలు యథావిధిగా ఉంటాయి. ఈ మేరకు మద్యం ఉత్పత్తిదారులతో ఒప్పందం చేసుకున్నట్టు తెలిసింది.

పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్ రీషెడ్యూల్

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ కళాశాలల్లో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను రీ షెడ్యూల్ చేశారు. పాత షెడ్యూల్ ప్రకారం ఈ నెల 31 నుంచి తరగతులు ప్రారంభం కావాల్సి ఉండగా, కొత్త షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 2 నుంచి మొదలుకానున్నాయి. టీజీ పీజీఈసీ/టీజీ పీజీఈసెట్-2024 ప్రవేశాల రీ షెడ్యూల్ ప్రకారం ఈ నెల 24 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుంది. ఈ నెల 25న అర్హుల జాబితా ప్రకటిస్తారు. వెబ్ ఆప్షన్ల నమోదుకు ఈ నెల 27 నుంచి 28 వరకు అవకాశం కల్పించారు. ఈ నెల 29న వెబ్ ఆప్షన్ల సవరణ, సెప్టెంబర్ 1న తొలి విడత సీట్ల కేటాయింపు ఉంటుంది. సెప్టెంబర్ 2 నుంచి 5 వరకు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌తోపాటు ట్యూషన్ ఫీజు చెల్లించాలి.

12న డిప్లొమా కోర్సులకు కౌన్సెలింగ్

వ్యవసాయ యూనివర్సిటీ, ఆగస్టు 8 : ప్రొ.జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో వ్యవసాయ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 12న నేరుగా హాజరుకావాలని రిజిస్ట్రార్ రఘురాంరెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్‌లోని యూనివర్సిటీ ఎగ్జామినేషన్ సెంటర్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు విధిగా హాజరుకావాలని చెప్పారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, నిర్ణీత ఫీజు రూ.19,460(గవర్నమెంట్), రూ.22,210(ప్రైవేట్)తో హాజరుకావాలని సూచించారు.

రెండో శనివారం సెలవు ఇవ్వాలి

- టీపీటీఎల్‌ఎఫ్ డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ) : ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో రెండో శనివారం సెలవు ఇవ్వాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్(టీపీటీఎల్‌ఎఫ్)తోపాటు డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్ చేశాయి. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ లింగయ్యకు ఆ సంఘాల నేతలు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన, డీఈవోలకు ఆర్డర్స్ ఇస్తామని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు.

ముగ్గురు చిన్నారులపై వీధి కుక్కల దాడి

ఉండవెల్లి, ఆగస్టు 8: ఇండ్ల ముందు ఆడుకుంటున్న ముగ్గురు చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. ఈ ఘటన గురువారం జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం ప్రాగటూర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన లక్ష్మీకాంత, నగేశ్ దంపతుల కుమారుడు రిషి, చంద్రకళ, నాగరాజు కుమారుడు విజయ్‌కుమార్, చంద్రశేఖర్, శారద కుమారుడు తిరుమలేశ్ కలిసి ఆడుకుంటున్నారు. వారిపై వీధికుక్కలు ఒక్కసారిగా దాడి చేసి గాయపర్చాయి. చిన్నారులను అలంపూర్, కర్నూల్ దవాఖానలకు తరలించామని తల్లిదండ్రులు తెలిపారు.

యాదగిరిగుట్టలో అఖండ దీపారాధన

యాదగిరిగుట్ట, ఆగస్టు 8 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అఖండ దీపారాధనకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రధానాలయ మాడ వీధుల్లోని ఈశాన్య ప్రాంతంలో అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నారు. 32 ఫీట్ల పొడవు, 28 ఫీట్ల వెడల్పుతో ప్రత్యేకమైన రేకులతో కూడిన షెడ్డు నిర్మిస్తున్నారు.

జనగామ సీఐ, ఎస్సైపై బదిలీ వేటు

- న్యాయవాదులపై దాడి చేసినట్టు ఫిర్యాదులు

జనగామ చౌరస్తా, ఆగస్టు 8: న్యాయవాద దంపతులపై దాడి చేసినట్టు వచ్చిన ఫిర్యాదుల మేరకు జనగామ అర్బన్ సీఐ ఎల్ రఘుపతిరెడ్డితోపాటు ఎస్సై పీ తిరుపతిని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేస్తూ గురువారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా కానిస్టేబుల్ బీ కరుణాకర్‌ను ఏఆర్‌కు అటాచ్ చేశారు. వరంగల్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ దామోదర్ రెడ్డిని జనగామ అర్బన్ సీఐగా నియమించారు. ఈ నెల 5న ఓ కేసు విషయంలో స్థానిక న్యాయవాదులైన అమృతరావు, కవిత దంపతులపై సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సై తిరుపతి, కానిస్టేబుల్ కరుణాకర్ దాడి చేసినట్టు ఫిర్యాదు రావడంతో బుధవారం కేసు నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదుల నిరసనలతో బదిలీ వేటు వేశారు.

మరో రెండు రోజులు వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రెండు రోజులు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. మహబూబాబాద్, భద్రాద్రి-కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. గత 24 గంటల్లో ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో అత్యధికంగా 9.49 సెం.మీ వర్షపాతం నమోదైంది. నైరుతి రుతుపవనాలు ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో మంచి వర్షాలు నమోదవుతున్నాయి. కానీ యాదాద్రి-భువనగిరి, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, హైదరాబాద్, జనగామ జిల్లాల్లో ఇప్పటికీ లోటు వర్షపాతం నమోదవుతున్నది. ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 413.4 మి.మీ కురవాల్సి ఉండగా గురువారం వరకు 517.4 మి.మీ గా ఉంది. అత్యధికంగా ములుగు జిల్లాలో 1014.3 మి.మీ నమోదైంది.

వ్యవసాయ వ్యాపార కేంద్రాలు నెలకొల్పాలి

- కేంద్ర బడ్జెట్‌లో 'సహకార' నిధులు పెరగాలి
- తెలంగాణలో సహకార సంఘాలతోనే పురోగతి
- రాజ్యసభ చర్చలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): దేశంలోని ప్రతి లోక్‌సభ నియోజకవర్గానికి ఒకటి చొప్పున వ్యవసాయ వ్యాపార కేంద్రాలను నెలకొల్పాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను బీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కోరారు. గురువారం రాజ్యసభలో సహకార రంగంపై జరిగిన చర్చలో రవిచంద్ర పలు అంశాలను లేవనెత్తారు. సహకార సంఘాల్లో సాంకేతికతను జోడించడం, సభ్యులకు సామాజిక భద్రత పథకానికి ప్రాధాన్యం ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. కేంద్ర బడ్జెట్‌లో సహకార రంగానికి మరిన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. దీంతో ఈ రంగాన్ని బలోపేతం చేస్తూ యువతకు, మహిళలకు మరింత తోడ్పాటు అందించాలని ఆర్థిక మంత్రిని కోరారు. సహకార రంగానికి 2022-23 బడ్జెట్‌లో రూ.900 కోట్లు ఖర్చు చేశారని, 2023-24 బడ్జెట్లో తొలుత కేవలం 55 కోట్లు కేటాయించి, ఆ తతర్వాత మరో 300 కోట్ల అంచనాతో సవరించారని తెలిపారు. ప్రస్తుత 2024-25 బడ్జెట్‌లో 500 కోట్లు కేటాయించారని, పెంపు విషయమై సమీక్షించాలని కోరారు. గత పదేండ్లలో తెలంగాణలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు, మహిళా, చేనేత, వివిధ వృత్తిదారులకు ఆయా సహకార సంఘాల ద్వారా ఆర్థిక భరోసా కల్పించడంతో రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి పురోగతి సాధించిందని చెప్పారు. ఆ పదేండ్లలో వ్యవసాయం, అనుబంధ సహకార రంగాలు అద్భుతమైన ప్రగతి సాధించాయని వివరించారు. కొత్తగా 8 వేల గొర్రెల పెంపకందారుల సొసైటీలను నెలకొల్పి సుమారు 5 వేల కోట్లతో లక్షలాది యూనిట్ల గొర్రెలను పంపిణీ చేసినట్టు చెప్పారు. రైతులకు రుణాలు, పెట్టుబడి సాయం, గిట్టుబాటు ధరలు అందించడం వల్ల పంటల ఉత్పత్తి భారీగా పెరిగి, వాటిని నిల్వ చేసేందుకు తెలంగాణ వ్యాప్తంగా నూతన గోదాముల నిర్మాణం కూడా చేపట్టినట్టు వివరించారు. సహకార రంగంలో సప్లయ్ వ్యవస్థ సమర్థవంతంగా లేకపోవడం, మౌలిక సదుపాయాలు, రవాణా, మార్కెట్ లింకేజీ వంటి కారణాలతో పంటలు పండించిన తర్వాత రైతులు ఎక్కువగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశంలో వరి, గోధుమ వంటి నిత్యావసర ఆహార ధాన్యాల నష్టాలను అరికట్టే చర్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.

కువైట్‌లో తెలంగాణ వాసి అరిగోస

- ఎడారి దేశంలో అవస్థలు పడుతున్న వలస కార్మికుడు
- స్వదేశానికి రప్పించాలని సీఎం, ఎమ్మెల్యేకు విన్నపం
- ఏజెంటు మోసం చేశాడని వీడియో ద్వారా వేడుకోలు
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులు



గోడు వెళ్లబోసుకుంటున్న రాథోడ్ నాందేవ్

ముథోల్, ఆగస్టు 8: బతుకుదెరువు కోసం కువైట్ వెళ్లిన తెలంగాణ వాసి అరిగోస పడుతున్నాడు. ఇంట్లో పని ఉందని ఇక్కడికి తీసుకొచ్చి ఎడారిలో ఒంటెల కాపరిగా నియమించారని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు. తనను తెలంగాణకు రప్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను వేడుకుంటున్నాడు. ఈ మేరకు కువైట్‌లో తాను పడుతున్న బాధలపై ఓ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నాందేవ్.. కుటుంబాన్ని పోషించుకోవడానికి, ఆర్థిక కష్టాలను అధిగమించేందుకు 10 నెలల క్రితం ఓ ఏజెంటు ద్వారా కువైట్‌కు వెళ్లాడు. ఇంట్లో పని అని చెప్పి ఏజెంటు తనను ఇక్కడికి పంపించాడని, తీరా ఇక్కడికొచ్చాక ఇంట్లో పని కాకుండా ఎడారిలో ఒంటెలను మేపడానికి పెట్టారని వాపోయాడు. నెలల తరబడి పట్టణాలకు దూరంగా ఉంటూ ఎండను తట్టుకోలేక పలుమార్లు అనారోగ్యానికి గురయ్యానని ఆవేదన వ్యక్తంచేశాడు. యజమాని వేధిస్తున్నాడని మనస్తాపం చెందాడు. ప్రథమ చికిత్స కూడా చేయించడం లేదని కన్నీటి పర్యంతమయ్యాడు. తనను సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆదుకుని తెలంగాణకు రప్పించాలని వేడుకుంటున్నాడు. మరో వైపు.. కుటుంబ పెద్ద లేని లోటు తమను మానసికంగా వేధిస్తున్నదని, ప్రజాప్రతినిధులు స్పందించి తన భర్తను సురక్షితంగా రప్పించేందుకు సాయం చేయాలని రాథోడ్ భార్య, కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులపై కమిటీ

- త్వరలో నియమించనున్న ప్రభుత్వం

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీకి సంబంధించిన మార్గదర్శకాలను రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఓ కమిటీని నియమించనున్నది. రేషన్ కార్డులతో సంబంధం లేకుండా అందరికీ ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేయాలన్న ప్రభుత్వ నిర్ణయం మేరకు ఈ కమిటీ ఇప్పటికే ఉన్న లబ్ధిదారులతోపాటు కొత్త అర్హులను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో అధ్యయనం నిర్వహించనున్నది. ప్రస్తుతం ఉన్న విధానాలు, వాటి అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు, లోపాలపై కూడా ఈ కమిటీ దృష్టి సారించనున్నట్టు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 54,45,658 జాతీయ ఆహార భద్రత కార్డులతోపాటు 35,50,496 స్టేట్ ఫుడ్ సెక్యూరిటీ కార్డులు ఉన్నట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ కుటుంబాలతోపాటు ప్రస్తుతం రేషన్ కార్డులు లేని కుటుంబాలను కూడా కలిపి మొత్తంగా 3 కోట్ల మందికి ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేసే అవకాశం ఉన్నదని అధికారులు చెప్తున్నారు.

చెరువు లెక్క.. బ్రహ్మదేవరకెరుక!

- చెరువు శిఖం 60 ఎకరాలు అన్యాక్రాంతం
- ఆ భూమి విలువ రూ.30 కోట్ల పైమాటే
- మూడు వైపులా శిఖం భూముల ఆక్రమణ
- రూ.100 కోట్ల లిఫ్టు పనులకు శంకుస్థాపన
- కబ్జాలతో తగ్గిన నీటి నిల్వ సామర్థ్యం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



బ్రహ్మదేవర చెరువు



ఆక్రమణకు గురైన బ్రహ్మదేవర చెరువు కట్ట

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): చెరువు శిఖం భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. చెరువుల్లో నీటి మట్టం తగ్గిపోవడంతో అక్రమార్కులకు ఇదే అవకాశంగా తెగబడుతున్నారు. చెరువు శిఖాల్లో మట్టిని పూడ్చి మడులు కడుతున్నారు. చెరువుల్లోనే బోర్లు వేసి సాగు చేసుకుంటున్నారు. ఇలా ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 60 ఎకరాల వరకు కబ్జా చేశారు. ఊరందరనీ సాదిన చెరువు ఉనికే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు ఆడిందే ఆటగా కొనసాగుతున్నది. బ్రహ్మదేవర చెరువు లెక్క బ్రహ్మదేవుడికే తెలుసునని ప్రజలు చర్చించుకుంటున్నారు.

నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామంలో కాకతీయులు నిర్మించిన బ్రహ్మదేవర చెరువు మండలంలోనే అతిపెద్దది. చెరువు విస్తీర్ణం 191ఎకరాలు. వెయ్యి ఎకరాలకుపైగా ఆయకట్టు. 24 గ్రామాలకు తాగునీరు అందించే కల్పతరువు. నిరుడు సెప్టెంబర్‌లో అయిటిపాముల రిజర్వాయర్ వద్ద రూ.100 కోట్ల లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు పనులకు నాటి ఆర్థికమంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ లిఫ్టు పూర్తయితే మూడు మండలాల్లోని 11 గ్రామాల్లో సుమారు 11 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నది. ఇన్ని గ్రామాలకు తాగు, సాగునీరు అందించే రిజర్వాయర్‌ను కట్టవైపు మినహా మూడు వైపుల నుంచి శిఖాన్ని కొందరు రైతులు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు.

మట్టితోనే పూడ్చి.. అచ్చుకట్టి..

చెరువు శిఖం భూమి అంటే.. చెరువు నీళ్లు నిల్వ ఉండే ప్రాంతం. ఎవరికైనా ప్రభుత్వం పట్టా ఇచ్చి ఉంటే ఆ భూమి తేలినప్పుడే సాగుచేసుకోవాలి. ఆ ప్రాంతంలో చెట్లు నరకడం, మట్టి తవ్వడం వంటివి చేయకూడదు. కొందరు అక్రమార్కులు చెరువు మట్టిని ట్రాక్టర్లతో తరలించి శిఖం భూమిని ఆక్రమించారు. మడులుగా అచ్చుకట్టి సాగుచేసుకుంటున్నారు. పదుల సంఖ్యలో చెర్వుఅన్నారం, ఇతర గ్రామాల రైతులు ఒక్కొక్కరు మూడెకరాల నుంచి పదెకరాల వరకు ఆక్రమించుకున్నారు. చెరువును పూడ్చుతూ సాగు చేసుకోవడమేకాకుండా చెరువులోనే ఇటీవల బోర్లు కూడా వేశారు. ఇప్పటివరకు 60 ఎకరాల చెరువు శిఖాన్ని కలిపేసుకున్నారు. జాతీయ రహదారి సమీపంలో కనుక ఎకరం కనీసం రూ.50 లక్షలు ఉంటుందని అంచనా. ఈ లెక్కన భూమి విలువ అక్షరాల రూ.30 కోట్లకు పైమాటే. పదేండ్లపాటు కాలమై చెరువులో నీళ్లు నిండుగా ఉన్నాయి. నిరుడు రిజర్వాయర్ పూర్తిగా ఎండిపోయింది. ఇదే అదనుగా ఇంకో అడుగు ముందుకేసి చెరువు అలుగును కూడా కబ్జా చేశారు. అలుగువరకు మట్టిని పూడ్చి మడులు అచ్చుకట్టారు. పడమటి వైపు అలుగు భూమి పూర్తిగా కబ్జాకు గురైంది. ఈ ఏడాది వేసవిలో గుట్టను దాపుగా చేసుకొని చెరువు మట్టిని తరలించి పెద్దమొత్తంలో ఆక్రమణకు తెగబడ్డారు. ఫలితంగా రిజర్వాయర్‌లో నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. అధికార యంత్రాంగం చోద్యం చూస్తున్నది తప్ప పట్టించుకోవడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు.

చెరువులు, కుంటలు కబ్జా..

అయిటిపాములలో రికార్డుల ప్రకారం.. బ్రహ్మదేవర చెరువు కాకుండా 86 ఎకరాల్లో మెదుగుల చెరువు, 12.31 ఎకరాల్లో చౌడమ్మ కుంట,11.39 ఎకరాల్లో కుతురోని కుంట, రసూల్‌గూడెంలో 10.24 ఎకరాల్లో ఊరకుంట, 6 ఎకరాల్లో తీగలమ్మ చెరువు (కుమ్మరికుంట), 5 ఎకరాల్లో కానాలకుంట, అన్నారం రోడ్డులో 2.38 ఎకరాల్లో నేలమర్రికుంట, మరో 3-4 కుంటలు ఉన్నాయి. కుమ్మరికుంట పూర్తి కబ్జాకు గురికాగా, మిగతా కుంటలు అధికశాతం ఆక్రమణదారుల చేతుల్లో చిక్కాయి.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం: డీఈఈ

అయిటిపాముల చెరువు, కుంటల ఆక్రమణల గురించి డీఈఈ భూషణాచారిని వివరణ కోరగా.. రిజర్వాయర్ ఆక్రమణ గురించి కొందరు రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. రెవెన్యూ అధికారులతో కలిసి వచ్చిన తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

కంచికి చేరని కేసులు

కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ ఇటీవలి కాలంలో పదేపదే వార్తలకెక్కుతున్నది. ఇది ఆ సంస్థ సాధించిన విజయాల వల్ల కాకుండా, సందేహాస్పద పాత్ర వల్ల కావడం గమనార్హం. గత పదేండ్ల గణాంకాలు గమనిస్తే ఈడీ కేసుల పస ఏమిటో తేటతెల్లమవుతుంది. స్వయంగా కేంద్ర ప్రభుత్వమే పార్లమెంటుకు సమర్పించిన లెక్కల ప్రకారం.. 2014-24 మధ్యకాలంలో మనీలాండరింగ్ చట్టం కింద మొత్తం 5,297 కేసులను ఈడీ దాఖలు చేస్తే అందులో రుజువైనవి 40 మాత్రమే. అంటే సక్సెస్ రేటు 1 శాతం లోపేనన్నమాట. మిగిలిన కేసులు, వాటిల్లో అరెస్టయినవారి పరిస్థితి ఏమిటనేది ఆలోచించాల్సిన విషయం. ఈ వివరాలను కేంద్రం పార్లమెంటుకు సమర్పించిన బుధవారం రోజే సుప్రీంకోర్టు కూడా ఇదే అంశంపై కీలక వ్యాఖ్యలు చేసింది. వేల సంఖ్యలో కేసులుంటే రుజువైనవి పిడికెడు కూడా లేకపోవడం ఏమిటని దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. దర్యాప్తు తీరు మెరుగుపర్చుకోవాలని గట్టిగా మందలించింది.

ఇంతకూ ఈడీ కేసుల్లో లోపం ఎక్కడుంది? ఆ మధ్య ఓ న్యాయనిపుణుడు ఈడీ బండారాన్ని పూసగుచ్చినట్టు బయటపెట్టారు. ముందుగా ఓ నలుగురైదుగురిని ఈడీ అరెస్టు చేస్తుంది. వారిలో ఒకరు తర్వాత అప్రూవర్‌గా మారుతారు. మిగతా వారికి వ్యతిరేకంగా మౌఖికంగా సాక్ష్యమిస్తారు. ఆ వాంగ్మూలం ఆధారంగా మిగతావారి మీద కేసు పెడతారు. నికరంగా శాస్త్రీయమైన ఆధారాలు లేకుండా ఇలా మౌఖిక సాక్ష్యాలపై ఆధారపడటాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ముందుగా అరెస్టు చేసి తర్వాత తాపీగా సాక్ష్యాధారాల కోసం వెతకడమనే విలోమ పద్ధతి వల్ల కేసులు నిలబడటం లేదనేది జగమెరిగిన సత్యం. పైగా అవినీతి అంతుచూస్తామని దూకుడు చూపే ఈడీలోనే అవినీతిపరులు పట్టుబడుతుండటం సంస్థలోని వారంతా కడిగిన ముత్యాలేమీ కాదని తెలియజేస్తున్నది. తాజాగా ఓ సీనియర్ ఈడీ అధికారి నిందితుని నుంచి రూ.20 లక్షల లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన ఘటన సంస్థ పరువును బజారుకీడ్చింది. గతేడాది తమిళనాడులోనూ లంచం కేసులోనే ఈడీ అధికారి అరెస్టు కావడం అప్పట్లో సంచలనం సృష్టించింది.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ లక్ష్యాల సాధనకు ఈడీ ఓ ఆయుధంలా మారిందనే ఆరోపణలు మొదటినుంచీ ఉన్నాయి. రాజకీయాల్లో అవినీతి ప్రక్షాళనకే ఈడీని ప్రయోగిస్తున్నామని పాలక బీజేపీ అంటుంటే, దారికి రానివారిని లొంగదీసుకునేందుకే ఆ దర్యాప్తు సంస్థను ఉసిగొల్పుతున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈడీ వ్యవహారశైలి, కేసులు చతికిలబడుతున్న తీరే అందుకు నిదర్శనం. కేంద్ర దర్యాప్తు సంస్థల పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రవేశపెట్టడమే ఈ సమస్యకు పరిష్కారం. పార్లమెంటరీ కమిటీ పర్యవేక్షణ తప్పనిసరి చేయాలి. ఆ కమిటీ ముందు సంస్థల బాధ్యులు ఎప్పటికప్పుడు హాజరై వాంగ్మూలాన్ని సమర్పించే సాంప్రదాయాన్ని ప్రవేశపెట్టాలి. ఆ మొత్తం వ్యవహారాన్ని ప్రసార మాధ్యమాల్లో ప్రత్యక్ష ప్రసారం చేయాలి. అప్పుడే కేసుల నిగ్గు తేలుతుంది. దర్యాప్తు సంస్థల పనితీరూ మెరుగుపడుతుంది. దేశ ప్రజలకు నమ్మకమూ పెరుగుతుంది.

వర్గీకరణపై జాతీయ పార్టీల జాప్యమేల?



నాంచారయ్య
మెరుగుమాల

దేశ ప్రజలకు సంబంధించిన అనేక అంశాలపై తమకు మాత్రమే స్పష్టమైన దృక్పథం ఉంటుందని, కొన్ని రాష్ట్రాలకే పరిమితమైన ప్రాంతీయ పక్షాలకు వాటిపై అవగాహన ఉండదని పదే పదే చెప్పుకొనే జాతీయపక్షాలు తమ అవకాశవాద వైఖరిని మరోసారి బయట పెట్టుకుంటున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో సీట్ల రిజర్వేషన్ల విషయంలో అనుసూచిత కులాలను (ఎస్సీలు) ఏబీసీడీలుగా వర్గీకరణ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి వారం దాటిపోయింది. కానీ, బీజేపీ, కాంగ్రెస్ జాతీయస్థాయిలో దీనిపై తమ వైఖరిని ఇంతవరకు వెల్లడించలేదు.



దాదాపు ఐదున్నర దశాబ్దాలు దేశాన్ని ఏలిన కాంగ్రెస్, 16 ఏండ్లకు పైగా ఢిల్లీలో అధికారంలో ఉన్న బీజేపీలకు వివిధ అంశాలపై అవకాశవాదానికి చోటులేని జాతీయ దృక్పథం లేదని ఎస్సీల వర్గీకరణ అంశంలో రుజువవుతోంది. అలాగే, ఇతర వెనుకబడిన వర్గాల (ఓబీసీలు) కోటాల విషయంలో మాదిరిగానే ఎస్సీల రిజర్వేషన్ అమలులోనూ క్రీమీలేయర్‌ను మినహాయించే విషయమై పై తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన సూచనపై కనీసం మాట్లాడడానికి కూడా ఈ రెండు జాతీయ పార్టీలు సిద్ధంగా లేవు. వాస్తవానికి కోటాల వర్గీకరణ లేదా ఉప వర్గీకరణ అనేది ఉత్తరాదిన పంజాబ్, హర్యానా, బీహార్, పశ్చిమాన మహారాష్ట్ర, దక్షిణాదిన తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో మాత్రమే మూడు దశాబ్దాలకు పైగా నలుగుతున్న సమస్య. ఈ ఎస్సీల కోటా వర్గీకరణ వివాదాన్ని అన్ని పక్షాలతో సంప్రదింపులు జరిపి సామరస్యపూర్వకంగా పరిష్కరించే వీలున్నా కాంగ్రెస్, బీజేపీలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో తీరున అవకాశవాద వైఖరిని అవలంబిస్తున్నాయి. తరతరాలుగా సామాజిక అణచివేతకు గురైన దళితులను వర్గాలుగా చీల్చి ఎన్నికల్లో తమ ప్రయోజనాలకు అనుగుణంగా 1990ల నుంచీ ఇవి రాజకీయాలను నడుపుతున్న విషయం దేశ ప్రజలకు తెలియని రహస్యమేమీ కాదు. ఎస్సీల వర్గీకరణ విషయంలో బీఆర్ఎస్ వంటి దక్షిణాది పార్టీలకున్న సూత్రబద్ధ వైఖరి దశాబ్దాలుగా దేశాన్ని పాలించే రెండు జాతీయపక్షాలకు లేకపోవడం విచారకరం.

వర్గీకరణపై ఉత్తరాది, దక్షిణాది ఎస్సీలలో భిన్నాభిప్రాయాలు:

కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ వంటి దక్షిణాది రాష్ట్రాలకు భిన్నంగా హర్యానా, పంజాబ్, బీహార్, మహారాష్ట్రలో చర్మకార వృత్తిపై ఆధారపడిన ఎస్సీ కులాలవారు దాదాపు అన్ని రంగాల్లో మిగిలిన దళిత వర్గాల కన్నా మెరుగైన స్థితిలో ఉన్నారు. ఈ కారణంగా ఉత్తరాది చర్మకార కులాలైన చమార్లు లేదా జాటవుల మద్దతు మెండుగా ఉన్న బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) దళితుల కోటా వర్గీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే భాగస్వామ్య పక్షాల్లో ఒకటైన లోక్‌జన్ శక్తి పార్టీ (ఎల్జేపీ) కూడా సుప్రీంకోర్టు తీర్పు అమలుకు సుముఖంగా లేదనే వార్తలొస్తున్నాయి. దివంగత దళిత నేత రామ్‌విలాస్ పాశ్వాన్ కుమారుడు, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నాయకత్వం వహిస్తున్న ఈ పార్టీకి ప్రధానంగా వారి కులస్తులైన దుసధులు (పాశ్వాన్లు) ఎక్కువగా మద్దతు పలుకుతున్నారు. తూర్పు ఉత్తరప్రదేశ్, బీహార్‌లోని ఎస్సీల్లో అధిక సంఖ్యలో ఉన్న దుసధులు దళిత వర్గాల్లో కాస్త మెరుగైన స్థితిలో ఉన్నారు. అందుకే ఎస్సీల వర్గీకరణను ఎల్జేపీ లోపాయికారిగా వ్యతిరేకిస్తోంది. అదీగాక, 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో ఎస్సీల ఓట్లను కనీస సంఖ్యలో కూడా దక్కించుకోలేకపోయిన బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో ఉన్న ఎస్సీ వర్గీకరణను తేనెతుట్టెగా పరిగణించడం కూడా దాని నాన్చుడు ధోరణికి ప్రధాన కారణం. అయోధ్యలో రాముడి గుడి కట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందాలనుకున్న కాషాయపక్షానికి ఈ పుణ్యక్షేత్రం ఉన్న ఫైజాబాద్ పార్లమెంటు సీటులోనే సమాజ్‌వాదీ పార్టీ నిలబెట్టిన దళిత అభ్యర్థి చేతిలో ఓటమి ఎదురవడం కూడా కోలుకోలేని దెబ్బ. ఈ నేపథ్యంలో ఎస్సీల వర్గీకరణను సుప్రీంకోర్టు చెప్పినట్టు రాష్ట్రాల వ్యవహారంగా పరిగణించి, ఈ ఏడాది జరిగే నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలోపు తన జాతీయ వైఖరిని చెప్పకుండా దాటవేయాలని బీజేపీ కేంద్ర నాయకత్వం చూస్తోంది. ఆ పార్టీ నేతల మాటల ద్వారా ఈ విషయం అవగతమవుతున్నది. దీనికి తోడు ఎస్సీల కోటా అమలులోనూ 'సంపన్న శ్రేణి' నియమం పాటించే విషయంపై ఆలోచించాలన్న సుప్రీంకోర్టు తీర్పును ఉత్తరప్రదేశ్, బీహార్ నేతలు బాహాటంగా వ్యతిరేకిస్తుండటం కమలం పార్టీ నేతృత్వంలోని కేంద్ర సర్కారును ఇరుకున పెడుతోంది.

కోటాల విషయంలో పచ్చి అవకాశవాదానికి మారుపేరు కాంగ్రెస్:

1990లో వీపీ సింగ్ నాయకత్వంలోని నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఓబీసీలకు తొలిసారిగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో 27 శాతం కోటా కల్పించింది. అప్పుడు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన నాటి కాంగ్రెస్ అధ్యక్షుడు రాజీవ్‌గాంధీ తాను కన్నుమూసే వరకు అదే వైఖరిని అవలంబించారు. దాదాపు మూడున్నర దశాబ్దాల తర్వాత ఆయన కుమారుడు రాహుల్‌గాంధీ కులగణన ఎజెండాను సామాజిక న్యాయ పార్టీలుగా పేరొందిన తన మిత్రపక్షాలైన ఎస్పీ, డీఎంకే, ఆర్జేడీ నుంచి గుంజుకుని ఓబీసీ రక్షకుడిగా కొత్త అవతారమెత్తి హస్తినలో అధికారం కోసం వెంపర్లాడుతున్నారు. అయితే, ఆయన చెప్పుచేతల్లో నడిచే కాంగ్రెస్ కూడా బీజేపీ బాటలో పయనిస్తూ ఎస్సీల వర్గీకరణపై జాతీయ వైఖరిని వెల్లడించడం లేదు.

> **మంగళవారం ఢిల్లీలో అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా, రాహుల్‌గాంధీలతో సమావేశమైన కాంగ్రెస్ నేతలు ఈ అంశంపై ఇంకా చర్చించాల్సి ఉందని, త్వరలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులతో సమావేశమై పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకుంటామని ప్రకటించారు.**

వాస్తవానికి కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణ నాయకులు వర్గీకరణకు అనుకూలంగా ఉండగా, చర్మకార వృత్తి నేపథ్యం ఉన్న కులాల నుంచి వచ్చిన హర్యానా, యూపీ నేతలు కుమారీ సెల్జా, పన్నాలాల్ పునియా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలుస్తున్నది. ఈ ఇద్దరు నేతలు హరియానా, పంజాబ్‌లో మూలాలున్న చర్మకార జాటవ్ కుటుంబాల్లో జన్మించినవారే. గతంలో యూపీ నుంచి లోక్‌సభ, రాజ్యసభకు ఎన్నికైన పునియా 2010 నుంచి 2016 వరకు జాతీయ అనుసూచిత కులాల (ఎస్సీ) కమిషన్ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 1977 వరకు నిరాటంకంగా కేంద్రంలో రాజ్యమేలిన కాంగ్రెస్ సామాజిక విషయాల్లో బీజేపీ కన్నా కాస్త ముందుండాల్సింది పోయి, ఎస్సీల వర్గీకరణ వ్యవహారంలో అన్ని లెక్కలు బేరీజు వేసుకుని నడవాలనుకోవడం దాని తాజా అవకాశవాద వైఖరికి అద్దం పడుతోంది.

ఎన్నికల్లో ప్రయోజనాలే రెండు జాతీయపక్షాలను నడిపించే ఏకైక ఎజెండా:

తమకు అత్యధిక రాష్ట్రాల్లో ఉనికి ఉందని, అంతర్జాతీయ, జాతీయ విషయాల్లో తమకు మాత్రమే సుస్పష్ట అవగాహన ఉందని చెప్పుకొనే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు వేలాది కులాలున్న ఇండియాలో ప్రతి సామాజిక వివాదాన్ని ఓట్లు దండుకోవడానికి సాధనంగా మలచుకోవడం ఆనవాయితీగా మారింది. రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా మాత్రమే ఎస్సీల జాబితాలో కొత్తగా కులాలను చేర్చే పకడ్బందీ రాజ్యాంగ ఏర్పాటు ఉన్న మన దేశంలో తరతరాలుగా సామాజిక దోపిడీకి గురైన దళిత కులాల మధ్య పేచీ వచ్చినప్పుడు సామరస్య వాతావరణంలో పరిష్కారాలు కనుగొనడం ఉత్తమ మార్గం. వర్గీకరణ వంటి వివాదాలు తలెత్తినప్పుడు అన్ని రాజకీయపక్షాలూ సుప్రీంకోర్టుకు పరిష్కార బాధ్యత అప్పగించి, తీర్పు వచ్చాక జాప్యం చేసే ధోరణి అవలంబించడం పూర్తిగా బాధ్యతారాహిత్యం అవుతుంది.

అన్ని ఎస్సీ కులాల నేతల మధ్య ఏకాభిప్రాయ సాధనకు, ఎస్సీల వర్గీకరణ వంటి కీలక విషయంపై ఆచరణాత్మక విధానం రూపొందించడానికి ప్రాంతీయపక్షాలు సహా అన్ని రాజకీయ పార్టీల మధ్య అంగీకారం కుదర్చడానికి రెండు జాతీయపక్షాలు చొరవ తీసుకునే సూచనలు ప్రస్తుతానికి కనిపించడం లేదు. 'ఈ అంశం రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించింది కాబట్టి, జాతీయ పక్షాలకు ఎస్సీల వర్గీకరణ అమలుపై తొందరెందుకు?' అనే బీజేపీ, కాంగ్రెస్‌ల ధోరణి దేశ ప్రయోజనాలకు, సామాజిక సామరస్యానికి అత్యంత హానికరమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

> **దాదాపు మూడున్నర దశాబ్దాల తర్వాత ఆయన కొడుకు రాహుల్‌గాంధీ నేడు కులగణన ఎజెండాను సామాజిక న్యాయ పార్టీలుగా పేరొందిన తన మిత్రపక్షాలైన ఎస్పీ, డీఎంకే, ఆర్జేడీ నుంచి గుంజుకుని ఓబీసీ రక్షకుడిగా కొత్త అవతారమెత్తి హస్తినలో అధికారం కోసం వెంపర్లాడుతున్నారు.**

వినేశ్.. మా కోహినూర్ వజ్రం



ఫిజిక్స్ అరుణ్ కుమార్
93947 49536

'కుస్తీ నాపై గెలిచింది. నేను ఓడిపోయాను. నన్ను క్షమించండి. మీ కల, నా ధైర్యం విచ్ఛిన్నమయ్యాయి. ఇక నాకు పోరాడే బలం లేదు. మీ అందరికీ ఎప్పటికీ రుణపడి ఉంటా' అంటూ మీ (వినేశ్ ఫోగాట్) సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్'లో మీరు చేసిన పోస్టును చూసి బరువెక్కిన హృదయంతో బాధపడుతున్న యావత్ భారతం మరింత భావోద్వేగ సాగరంలో మునిగిపోయింది. ఈ సందర్భంగా మీకు కొన్ని విషయాలు చెప్పాలనుకుంటున్నా.



వినేశ్ ఫోగాట్.. మీకు వినిపిస్తోందా? మన దేశ రాష్ట్రపతి, ప్రధాని, ప్రతిపక్ష నేతలతో మొదలు విభిన్న రంగాల్లోని ప్రముఖులు, సగటు భారతీయులు సహా అందరూ.. ఒక్క మాటలో చెప్పాలంటే యావత్ దేశం మీ ప్రతిభ, పోరాటస్ఫూర్తిని కీర్తిస్తోంది. మీరు మా కోహినూర్ వజ్రం.

మీపై విధి ఎన్ని కత్తులు దూస్తేనేమి, కాలం మీ పట్ల మరీ ఇంత కఠినంగా వ్యవహరించడమేంటి? రెండు దశాబ్దాల మీ పట్టుదల, సంకల్పం ముందు ఒలింపిక్ పతక ప్రభావం మాకు చాలా చిన్నది. ఈ దేశంలో రెజ్లింగ్ క్రీడలో జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరిస్తూ నడిరోడ్డుపై మీరు చేసిన పోరు, విశ్వక్రీడా వేదికపై ఈ దేశాన్ని గెలిపించేందుకు మైదానంలో మీరు చేసిన పోరాటం రెండింటినీ మేం చూశాం. మీ ఆటకు సెల్యూట్ చేసి మా హృదయ సామ్రాజ్యాలలో మిమ్మల్ని అత్యున్నత పీఠంపై కూర్చోబెట్టాం. మా అందరికీ మీరే సూపర్ హీరో. వంద గ్రాముల అనర్హత గురించి మాకెందుకు? ఒలింపిక్స్ నిబంధనలు ఏం చెబితే మాకెందుకు? తొలి మ్యాచ్‌లోనే విశ్వ విజేతను మట్టి కరిపించి మా హృదయాలను మీరు గెలిచారు. ఇక పతకాలు.. కుట్రలు, కుతంత్రాలతో కూడిన పథకాల గోల మాకెందుకు? మండుతున్న మీ కన్నీటి సెగకు భయపడి ఓటమి ఏనాడో పారిపోయింది. మిమ్మల్ని ఓడించలేకే ఆటలో ఆడనీయకుండా వంద గ్రాముల అనర్హత పేరు చెబుతోంది!

విభిన్న భాషలు, రాజకీయ పార్టీలు, మతాలు, సంస్కృతుల సమ్మేళనంతో కూడిన 145 కోట్ల జనాభా కలిగిన అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం మనది. ఘన చరిత్ర గల ఈ దేశంలో ఒలింపిక్స్ పోటీల్లో కనీసం డబుల్ డిజిట్ పతకాలు సాధించడానికి దశాబ్దాలుగా ఎంతగానో శ్రమిస్తున్నాం. అలాంటి దేశం తరపున ఒక (అ)సాధారణ అమ్మాయి పురుషులకే ప్రత్యేకమైనదిగా భావించే రెజ్లింగ్‌లో దేశం తరపున ప్రాతినిధ్యం వహించడమే గొప్ప విజయం. అసమానతలు, వివక్ష, అన్యాయాలపై అలుపెరగని పోరాటం చేస్తూ.. విమర్శలు, అవాంతరాలు, రాజకీయ కుతంత్రాలను ప్రతిఘటిస్తూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి జాతీయ జెండాను రెపరెపలాడించడమే కాకుండా మూడుసార్లు ఒలింపిక్స్‌కు ప్రాతినిధ్యం వహించడం అసాధారణ విజయం. అదే మాకు బంగారంతో సమానం. టోక్యో ఒలింపిక్స్ క్వార్టర్ ఫైనల్‌లో పోరాడి ఓడిన, రియో ఒలింపిక్స్ క్వార్టర్ ఫైనల్‌లో తీవ్ర గాయాలతో నిలబడలేని స్థితిలో దేశానికి తిరిగొచ్చిన దృశ్యాలు ఇప్పటికీ మా కండ్ల ముందే కదలాడుతున్నాయి.

> **ఈ ఒలింపిక్స్‌లో మన దేశాన్ని గెలిపించడం కోసం 57 కేజీలు ఉండే మీరు 50 కేజీల విభాగంలో పోటీ పడేందుకు ఎంత కష్టపడ్డారో మీ ఆటను చూస్తే అర్థమైంది. అంచనాలు లేకుండా బరిలో దిగి ఛాంపియన్లకు చెక్ పెడుతూ ఫైనల్‌కు చేరడమంటే మాటలు కాదు. అందుకు శారీరక, మానసిక దృఢత్వం, సంసిద్ధత, దేశం పట్ల ఎనలేని అంకిత భావం ఉండాలి. మీ శ్రమ ఎప్పటికీ వృథా కాదు. కాలం చేసే మాయాజాలంలో ఏమైనా జరగొచ్చు.**

దాదాపు రెండు దశాబ్దాలుగా వివిధ ప్రైవేటు విద్యాసంస్థల్లో 6వ తరగతి నుంచి డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థుల వరకు గణిత ఉపాధ్యాయుడిగా, భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా నేను సేవలందిస్తున్నాను. ఈ క్రమంలో వివిధ సందర్భాల్లో ఎంతో మంది మహనీయుల జీవితాల గురించి విద్యార్థులకు చెప్తూ వారికి స్ఫూర్తినిచ్చాను. ఐన్‌స్టీన్‌ను ఒకప్పుడు ఈ ప్రపంచం పిచ్చోడంది. విద్యుత్ బల్బు కనుగొనడం కోసం ఎడిసన్ చేసిన వందల ప్రయత్నాలను చూసి ప్రపంచం ఎగతాళి చేసింది. అమ్మాయిలకు ఉన్నత చదువులు చదివేందుకు అర్హత లేదని చెప్పినా వినకుండా ముందుకుసాగిన మేడం క్యూరీ రెండు నోబెల్ బహుమతులను గెలిచింది. బక్కపలుచని గాంధీ మన దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చారు. అంతేకాదు, యావత్ ప్రపంచంపై అహింస ముద్ర వేశారు. వరల్డ్ కప్ అందుకోవడమే స్వప్నంగా క్రికెట్ ఆడిన సచిన్ 2003 ఫైనల్లో ఓడినప్పటికీ కుంగిపోలేదు. తిరిగి పుంజుకొని 2011లో ఇండియాను విశ్వ విజేతగా నిలిపారు. రేపటి నుంచి మీ జీవిత కథ కూడా గెలుపోటములకు అతీతంగా కోట్లాది మందికి ప్రేరణనిస్తుంది. మీరు పోరాటానికి పాట అయ్యారు. భవిష్యత్తు భారతానికి పాఠమయ్యారు.

వినేశ్.. వింటున్నారా..! 'వినేశ్.. నువ్వు ఛాంపియన్లకే ఛాంపియన్‌వి. దేశానికి గర్వకారణం. ప్రతి భారతీయుడికీ స్ఫూర్తివి నువ్వు. ఈరోజు తగిలిన ఎదురుదెబ్బ బాధ కలిగించేదే. దీనివల్ల కలిగిన నిరాశను మాటల్లో చెప్పలేకపోతున్నా. అదే సమయంలో అడ్డంకులను అధిగమించే నీ సత్తా నాకు తెలుసు. సవాళ్లను స్వీకరించడమే నీ నైజం. తిరిగి బలం పుంజుకో. మేమందరం నీకు అండగా ఉన్నాం'.. మన ప్రధాని మోదీ మీకిచ్చిన సందేశమిది. ఇది ప్రధాని మాటే కాదు, ప్రతి భారతీయుడి హృదయ స్పందన.

వినేశ్.. మిమ్మల్ని చూసి ఈ దేశం గర్విస్తోంది. మీరంటే మాకు ఎనలేని గౌరవం. ఏమైనా జరగనీ.. మీకు మేము తోడుంటాం. మీ స్ఫూర్తితో మా జీవిత పోరాటంలో గెలుపోటములకు అతీతంగా ముందడుగేస్తాం. మాకు మీ ఫలితాల ద్వారా వచ్చే పతకాల కంటే మీ ప్రయాణపు ప్రకాశమే ఆదర్శం.

> **"కేంద్రం ఎందుకు మౌనం వహిస్తున్నది?**



> **ముందు రోజు మూడు మ్యాచ్‌లు గెలిచినప్పుడు వినేశ్ బరువు 50 కిలోలే. ఒకవేళ తర్వాతి రోజు ఆమె బరువు 50 కిలోల కంటే ఎక్కువ ఉండి ఉంటే.. దాని ప్రభావం ముందు రోజు మ్యాచ్ ఫలితాలపై ఎలా పడుతుంది? అసలు ఈ విషయంపై భారత ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తున్నది. ఒలింపిక్ పతకం వినేశ్‌ది మాత్రమే కాదు, యావత్ దేశానిది. ఈ విషయాన్ని బీజేపీ అర్థం చేసుకోవాలి. - రణదీప్ సూర్జేవాలా, కాంగ్రెస్ ఎంపీ**

ప్రపంచవ్యాప్తంగా చూసినా, భారతదేశ భౌగోళిక స్వరూపాన్ని పరిశీలించినా, ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రాన్ని చూసినా.. అవన్నీ ఒకనాడు దట్టమైన కారడవులు, కొండకోనలు కలిగిన ప్రాంతాలే. ఆధునిక ప్రపంచంలో ప్రస్తుతం మనకు కనిపిస్తున్న నగరాలు, పట్టణాలన్నీ ఒకప్పుడు చెట్లు, పుట్టలతో నిండిన అటవీ ప్రాంతాలే. మనం ఇప్పుడు చూస్తున్న నాగరికతకు కొండకోనలు, అడవుల్లో నివసించే ఆదివాసీ గిరిజనులే మూలం. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఆదివాసీ గిరిజనులను గుర్తిస్తూ, వారి ఆత్మగౌరవం ప్రతిబింబించేలా ఆగస్టు 9వ తేదీని ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా జరుపుకోవడం మనమందరం గర్వించదగ్గ విషయం.

ఆదివాసీలకు అండగా బీఆర్ఎస్



ఎల్.రూప్‌సింగ్
90005 00760



నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఆదిమానవుల నుంచి నేటి ఆధునిక సమాజం వరకు అందరికీ జీవనమార్గం చూపింది ఆదివాసీ గిరిజనులే. చక్రాన్ని కనుగొని ఆధునిక చరితకు నాంది పలికింది వారే. ఎడ్లబండ్లను తయారు చేసి రవాణాకు మార్గం సుగమం చేసింది వారే. చివరికి బ్రిటిష్ పాలకులను గడగడ వణికించి స్వాతంత్ర్య పోరాటానికి ఊపిరిపోసింది వారే. చరిత్ర దాచినా దాగని నగ్నసత్యమిది.

యుగాలు మారాయి, కాలాలు మారాయి. కానీ, ఆదివాసీ గిరిజనుల బతుకులు మాత్రం మారలేదు. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా వారి స్థితిగతులను పరిశీలించాలని 1982లో ఐరాస నిర్ణయించింది. పదేండ్ల పాటు వివిధ దేశాలు తిరిగిన ప్రతినిధి బృందం 1992లో నివేదికను ఐరాసకు సమర్పించింది. ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను కాపాడాలని, వారి అభ్యున్నతికి పాటుపడాలనే ఉద్దేశంతో ఆగస్టు 9వ తేదీని ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా ఐరాస ప్రకటించింది.

2011 జనాభా లెక్కల ప్రకారం.. మన దేశంలో మొత్తం జనాభాలో 8 శాతం ఆదివాసీ గిరిజనులున్నారు. 500కు పైగా తెగలు, సమూహాలు, 705 భాషలను భారత ప్రభుత్వం గుర్తించింది. వారి సమగ్రాభివృద్ధికి ఐటీడీఏలను ఏర్పాటు చేసింది. కానీ, సమైక్య పాలకుల నిర్వాకం వల్ల అభివృద్ధికి ఆమడదూరంలోనే ఆదివాసీ గిరిజనులు నిలిచిపోయారు. 1952లో షెడ్యూల్డ్ ట్రైబ్స్‌ను ఆదివాసీలుగా రాజ్యాంగం గుర్తించింది. ఉమ్మడి పాలకులు మాత్రం ఆంధ్ర ప్రాంతంలోని బంజారాలను ఎస్టీలుగా గుర్తించి, తెలంగాణవారిని విస్మరించారు. 1976లో తెలంగాణ ఆదివాసీలకు ఎస్టీలుగా గుర్తింపు దక్కింది. దీంతో 20 ఏండ్ల పాటు వారికి రాజ్యాంగ ఫలాలు అందలేదు.

అంతేకాదు, గ్రామ పంచాయతీలలో తండాలు, గూడేలు, చెంచుపేటలు భాగంగా ఉండటం వల్ల అవి అభివృద్ధికి నోచుకోలేదు. ఆయా ప్రాంతాలకు కనీసం రోడ్డు సౌకర్యం కూడా కల్పించలేదు. దీంతో ప్రసవ సమయాల్లో మహిళలు పురిటినొప్పులతోనే కాలినడకన, ఎండ్ల బండ్ల మీద, మంచాలపై దయనీయమైన స్థితిలో ప్రయాణించాల్సి వచ్చేది. సమయానికి వైద్యం అందక చాలామంది మరణించేవారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత భయానకంగా ఉండేది. వైద్యశాలలు అందుబాటులో లేకపోవడంతో విషజ్వరాలు, రోగాల బారిన పడి అనేకమంది మరణించేవారు. ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు అందుబాటులో ఉండేవారు కాదు.

అడవులే జీవనాధారంగా పోడు వ్యవసాయం చేసుకొని బతికే ఆదివాసీ గిరిజనులకు భూ పట్టాలిచ్చి ఆదుకోవాల్సిన పాలకులు వారి పట్ల అమానుషంగా వ్యవహరించేవారు. అటు ఫారెస్టు అధికారులతో, ఇటు రెవెన్యూ అధికారులతో అక్రమ కేసులు బనాయించి చిత్రహింసలకు గురిచేసేవారు అప్పటి పాలకులు. అంతేకాదు, జైళ్లలో పెట్టి వారి కుటుంబాలను చిన్నాభిన్నం చేసేవారు. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)లను కూడా సరైన రీతిలో సమైక్య పాలకులు నిర్వహించకపోవడంతో ఆదివాసీల బతుకులు ఆగమాగమయ్యాయి.

ఈ నేపథ్యంలో ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించింది. తెలంగాణ విధాత, స్వరాష్ట్ర సాధకుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావు తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆదివాసీ బిడ్డల కష్టాలను దగ్గర్నుంచి చూసిన ఆయన వారి గోసను తీర్చాలని సంకల్పించారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఆదివాసీ గిరిజనుల చిరకాల ఆకాంక్ష (మా తండాలో- మా రాజ్యం, మావనాటే- మావరాజ్)ను నిజం చేశారు. తండాలు, గూడేలు, చెంచుపేటలను గ్రామ పంచాయతీలుగా గుర్తించారు. 3,146 పంచాయతీలను ఏర్పాటు చేసి, ఆదివాసీ గిరిజనులను పాలకులుగా తీర్చిదిద్దారు. పోడు వ్యవసాయం చేసుకొని జీవిస్తున్న 1,51,146 మంది ఆదివాసీ బిడ్డలకు 4,06,369 ఎకరాల పోడు పట్టాలు ఇచ్చి యజమానులను చేశారు.

> **ఉమ్మడి ఏపీలో గిరిజన జనాభా 10శాతం ఉండగా.. సమైక్య పాలకులు 6 శాతం రిజర్వేషన్లే ఇచ్చి మోసం చేశారు. ఈ అన్యాయంపై నిలదీయాల్సిన కేంద్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ సిద్ధించాక ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేసీఆర్ ఎంతగానో శ్రమించారు. కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా ఒత్తిడి చేశారు. అయినప్పటికీ కేంద్రం పట్టించుకోకపోవడంతో జీవో నెం.33 ద్వారా ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేసి, గిరిజన పక్షపాతిగా కేసీఆర్ నిలిచారు.**

ఆదివాసీ బంజారాల ఆదిపురుషుడు శ్రీసంత్ సేవాలాల్, ఆదివాసీ గోండ్ పోరాట యోధుడు కుమ్రం భీం, ఆదివాసీ ఎరుకల తెగకు చెందిన నాంచారమ్మల జయంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం తరపున అధికారికంగా బీఆర్ఎస్ సర్కార్ నిర్వహించింది. అంతేకాదు, వారి పేరిట బంజారాహిల్స్‌లో రూ.50 కోట్లతో ఆధునిక హంగులతో భవనాలు నిర్మించింది. 1,682 గిరిజన ఆవాసాల్లో రూ.1276 కోట్లతో 3,173 కిలోమీటర్ల పొడవైన రోడ్లు నిర్మించిన కేసీఆర్ అభివృద్ధికి బాటలు వేశారు. ఆదివాసీ గిరిజనుల అభ్యున్నతి కోసం కేసీఆర్ చేసినవి ఇంకా చాలా ఉన్నాయి. అందుకే ఆదివాసీ గిరిజన సమాజానికి కేసీఆర్ చేసిన కృషి మరువరానిది.

(వ్యాసకర్త: ఆదివాసీ గిరిజన నేత)



గురువారం ముంబైలోని ఆర్బీఐ ప్రధాన కార్యాలయంలో ద్రవ్యసమీక్ష సందర్భంగా డిప్యూటీ గవర్నర్లతో ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్

యూపీఐతో 5 లక్షల చెల్లింపు

ట్యాక్స్ పేమెంట్స్‌కు మాత్రమే..

- ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ నిర్ణయం
- వరుసగా 9వసారీ కీలక వడ్డీరేట్లు యథాతం

ముంబై, ఆగస్టు 8: ట్యాక్స్ పేయర్స్ సౌకర్యార్థం యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా పన్ను చెల్లింపులకున్న పరిమితిని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గణనీయంగా పెంచింది. ఏకంగా రూ.5 లక్షలదాకా పెంచుతూ గురువారం ముగిసిన ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో నిర్ణయించారు. ఇంతకుముందు ఇది లక్ష రూపాయలే. తాజా నిర్ణయం.. నగదు లావాదేవీలను తగ్గించి, యూపీఐ వినియోగాన్ని మరింత పెంచగలదన్న ఆశాభావాన్ని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వ్యక్తం చేశారు. పెద్ద మొత్తంలో పన్ను చెల్లించేవారికి ఇది కలిసొస్తుందని, చిన్నచిన్న మొత్తాల్లో కాకుండా.. చాలామందికి ఒకేసారి ట్యాక్స్ పేమెంట్స్‌కు వీలు చిక్కుతుందని ద్రవ్యసమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. సులువుగా పన్ను బకాయిలను చెల్లించేందుకూ ట్యాక్స్ పేయర్స్‌ను ప్రోత్సహించినట్టవుతుందని అభిప్రాయపడ్డారు. గత ఏడాది డిసెంబర్‌లో దవాఖానలకు, విద్యా సంస్థలకు యూపీఐ ద్వారా రూ.5 లక్షల వరకు చెల్లించుకునే సదుపాయాన్ని ఆర్బీఐ ఇచ్చింది. మునుపు ఇది లక్షే.

డెలిగేటెడ్ పేమెంట్స్

యూపీఐ ద్వారా డెలిగేటెడ్ చెల్లింపుల సదుపాయాన్ని ఆర్బీఐ కొత్తగా పరిచయం చేసింది. దీనివల్ల డిజిటల్ పేమెంట్స్ వినియోగం మరింత లోతుగా జరుగుతుందని చెప్పింది. ఈ సౌకర్యంతో ప్రధాన కస్టమర్.. తన బ్యాంక్ ఖాతా నుంచి తాను నిర్ణయించిన మొత్తాన్నే మరో వ్యక్తి (సెకండరీ యూజర్) యూపీఐ ద్వారా చెల్లించే అవకాశాన్ని ఇవ్వగలరు. ఈ ప్రక్రియలో సెకండరీ యూజర్ యూపీఐకి ప్రత్యేకంగా బ్యాంక్ ఖాతా లింకై ఉండాల్సిన అవసరం లేదు.

హోమ్ లోన్ టాప్-అప్‌లు కఠినం

గృహ రుణాలపై టాప్-అప్‌లు ఇటీవలి కాలంలో పెద్ద ఎత్తున పెరుగుతుండటంపట్ల ఆర్బీఐ ఆందోళన వ్యక్తం చేసింది. టాప్-అప్‌ల ద్వారా పొందిన నగదు మొత్తాలను స్టాక్ మార్కెట్ల వంటి వాటిల్లో పెట్టుబడులు పెడుతుండవచ్చన్న అనుమానాల్ని వెలిబుచ్చింది. ఈ క్రమంలోనే హోమ్ లోన్లపై టాప్-అప్‌లు ఇస్తే ఎందుకు వినియోగిస్తున్నారన్నది ఆరాతీయాలని బ్యాంకులకు సూచించింది.

6.5 శాతం వద్దే రెపోరేటు

ఈ ద్రవ్యసమీక్షలోనూ రెపోరేటును 6.50 శాతం వద్దే యథాతథంగా ఆర్బీఐ ఉంచింది. ఆరుగురు సభ్యుల ద్రవ్య విధాన కమిటీలో నలుగురు మద్దతు పలికారు. దీంతో వరుసగా 9వ ద్రవ్యసమీక్షలోనూ కీలక వడ్డీరేట్లు ఎక్కడివక్కడే ఉన్నట్టైంది. కాగా, గత ఏడాది ఫిబ్రవరిలో చివరిసారిగా రెపోను పెంచారు. అప్పట్నుంచి అది అక్కడే ఉంటున్నది. దీంతో గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణాలపై ఈఎంఐలు భారంగానే నడుస్తున్నాయి.

గంటల్లోనే చెక్ క్లియరెన్స్


ఇకపై చెక్ క్లియరెన్స్‌లు వేగంగా జరిగిపోనున్నాయి. ప్రస్తుతం చెక్ డిపాజిట్ చేసిన దగ్గర్నుంచి అది క్లియర్ కావడానికి రెండు పనిదినాలు పడుతుండగా.. దీన్ని కేవలం కొద్ది గంటల వ్యవధిలోనే బ్యాంకులు పూర్తిచేయాలని ఆర్బీఐ గవర్నర్ దాస్ ద్రవ్యసమీక్ష సందర్భంగా ప్రతిపాదించారు. ఇప్పుడు బ్యాచ్ ప్రాసెసింగ్ మోడ్‌లో చెక్ ట్రంకేషన్ సిస్టమ్ (సీటీఎస్) కింద చెక్కుల క్లియరెన్స్ జరుగుతున్నది. అయితే ఇకపై సీటీఎస్‌లో 'ఆన్ రియలైజేషన్ సెటిల్మెంట్'తో చెక్ క్లియరెన్సులు జరగాలన్నారు. దీనివల్ల పేమెంట్స్ చేసేవారికి, తీసుకునేవారికి లాభిస్తుందన్నారు.

రూపాయీ.. జరభద్రం

రూపాయి పతనం భారతీయ రిజర్వ్ బ్యాంక్‌కూ దడ పుట్టిస్తున్నది. చివరకు కరెన్సీ మార్కెట్‌లో బ్యాంకింగ్ ట్రేడింగ్‌కు కళ్లెం వేసేదాకా సెంట్రల్ బ్యాంక్ వెళ్లాల్సి వస్తున్నది. అవును.. రూపీని బలహీనపర్చకండంటూ బడా బ్యాంకులను ఆర్బీఐ వేడుకుందన్న వార్తలు ఇప్పుడు ఒకింత కలవరపాటుకే గురిచేస్తున్నాయి మరి. రూపాయి తలరాతను రాసే కేంద్ర బ్యాంకుకే ఎందుకింతటి ఖర్మ? అంటే అర్థం కాని అయోమయంలో యావత్తు దేశ ఆర్థిక వ్యవస్థ పడిందిప్పుడు. డాలర్ ముందు రూపాయి నష్టాలు జీవనకాల గరిష్ఠాలను తాకుతుంటే.. మోదీ సర్కారు హయాంలో మారకం విలువ ఏకంగా రూ.23.63 దిగజారడం ప్రమాద ఘంటికల్నే మోగిస్తున్నది.

ఆర్బీఐకే దడ పుట్టిస్తున్న దేశీయ కరెన్సీ

- వరుస నష్టాలతో సెంట్రల్ బ్యాంక్‌కు ముచ్చెమటలు
- కరెన్సీ మార్కెట్‌లో జోక్యంతో బడా బ్యాంకులపై ఒత్తిడి
- రూపీకి పోటీగా ట్రేడింగ్ పొజిషన్లు పెంచుకోవద్దని ఆదేశాలు
- ఏం చేసినా ఆగని పతనం.. డాలర్ ముందు తేలిపోతున్న వైనం
- ఆల్‌టైమ్ కనిష్టాన్ని తాకుతూ ఏకంగా 84.09కి క్షీణత
- మోదీ హయాంలో రూ.23.63 క్షీణించిన మారకం విలువ



న్యూఢిల్లీ, ఆగస్టు 8: రూపాయి క్షీణతను అడ్డుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) శతవిధాలా ప్రయత్నిస్తున్నది. తన వద్దనున్న అన్ని సాధనాలనూ వినియోగించుకుంటున్న సెంట్రల్ బ్యాంక్.. ఆఖరికి సామ, దాన, భేద, దండోపాయాలకూ దిగుతున్నది. ఈ క్రమంలోనే తాజాగా కరెన్సీ మార్కెట్‌లో రూపీకి పోటీగా తమ ట్రేడింగ్ పొజిషన్లను పెంచుకోవద్దని పలు ప్రముఖ బ్యాంకులకు హుకుం జారీ చేసినట్టు రాయిటర్స్ కథనం చెప్తున్నది. ఈ మేరకు ఎకనామిక్ టైమ్స్, మనీ కంట్రోల్, బిజినెస్ స్టాండర్డ్, సీఎన్‌బీసీ, ఎన్‌డీటీవీ వంటి జాతీయ ప్రధాన వార్తా పత్రికల్లోనూ వచ్చింది. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ రోజూ పడిపోతూనే ఉండటాన్ని చూస్తూనే ఉన్నాం. సోమవారం స్పాట్ మార్కెట్‌లో మునుపెన్నడూ లేనివిధంగా 84.09 స్థాయికి దిగజారింది. ఆసియా దేశాల్లో గత నెల రోజుల్లో ఇంతలా మరే దేశపు కరెన్సీ విలువ దిగజారింది లేదు. దీంతో అప్రమత్తమైన ఆర్బీఐ.. మంగళవారం అత్యవసరంగా స్పాట్, ఫ్యూచర్స్ మార్కెట్లతోపాటు, నాన్-డెలివరబుల్ ఫార్వర్డ్స్ (ఎన్‌డీఎఫ్) సెగ్మెంట్ లావాదేవీల్లో జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ఇందులో భాగంగానే పెద్ద బ్యాంకులను ట్రేడింగ్ పొజిషన్లు తగ్గించుకోవాలని సూచించినట్టు ఇప్పుడు తెలియవస్తున్నది. అయితే ఈ పరిణామం అటు కరెన్సీ మార్కెట్‌లో.. ఇటు దేశ ఆర్థిక వ్యవస్థలో గుబులు పుట్టిస్తున్నది. రూపీని నడిపించే ఆర్బీఐనే ఇంతలా గాబరా పడిపోతున్నదేమిటా? అన్న ప్రశ్నలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ఇదీ సంగతి..

కరెన్సీ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ 84 మార్కును దాటకూడదని ఆర్బీఐ గట్టిగానే ప్రయత్నించింది. ఇందుకోసం స్పాట్ మార్కెట్ తెరుచుకోవడానికి ముందే రూ.12,500 కోట్ల విలువైన డాలర్లను ఎన్‌డీఎఫ్ మార్కెట్‌లో అమ్మేసింది. తద్వారా రూపాయిపై ఒత్తిడిని తగ్గేలా చేసింది. నిజానికి ఈ తరహా చర్యలను ఆర్బీఐ ఎప్పుడూ చేస్తూనే ఉంటుంది. అయితే ఓవైపు ఇలా చేస్తూనే.. మరోవైపు బ్యాంకింగ్ కార్యకలాపాలనూ నియంత్రించేందుకు ప్రయత్నించడమే ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. స్పాట్ మార్కెట్‌లో రూపాయి నష్టాలు.. వర్తకుల ట్రేడింగ్‌కు ఆటంకంగా మారుతున్నది. దీంతో రూపీపై తమ లాంగ్ పొజిషన్లను బలపర్చుకునేందుకు అప్పటికప్పుడు చైనా కరెన్సీ యువాన్ కోసం అంత ఎగబడ్డారు. ఇది ఒక్కసారిగా రూపాయిని బలహీనపర్చింది. అలాగే ఎన్‌డీఎఫ్ మార్కెట్‌లో స్థానిక బ్యాంకులు అదనపు పొజిషన్లు తీసుకున్నకొద్దీ రూపాయిని బలపర్చేందుకు ఆర్బీఐ మరింత శ్రమించాల్సి వస్తుంది. డాలర్లను పెద్ద ఎత్తున ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇది దేశంలో ఫారెక్స్ నిల్వల్ని దిగజార్చగలదు. అందుకే ఒక స్థాయి వరకే డాలర్లను విడుదల చేసేందుకు ఆర్బీఐ సుముఖత చూపిస్తుంది. ఆ తర్వాతే ఇతర సాధనాలను ఉపయోగిస్తుంది.

ఇలాగైతే ఎలా?

పడిపోతున్న రూపాయి మారకం విలువ.. ప్రతి ఒక్కరిపైనా ప్రభావం చూపుతుంది. తినే తిండి నుంచి.. వాడే వస్తూత్పత్తి వరకు, తీసుకునే రుణం దగ్గర్నుంచి.. చేసే పొదుపుదాకా అన్నీ ప్రభావితమవుతాయి. ముఖ్యంగా దిగుమతులు భారమైపోతాయి. ఇది దేశంలో ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. ద్రవ్యోల్బణం పెరిగితే.. దాన్ని తగ్గించేందుకు ఆర్బీఐ కఠిన ద్రవ్యవిధానాన్ని అనుసరించాల్సి వస్తుంది. ఫలితంగా బ్యాంకులిచ్చే అన్ని రుణాలపై వడ్డీరేట్లు పెరుగుతాయి. దీనివల్ల పేద, మధ్యతరగతి ప్రజానీకమే ఎక్కువగా ఉన్న మన దేశంలో వినిమయ శక్తి దెబ్బతింటుంది. కొనుగోళ్లు లేక మార్కెట్‌లో వ్యాపారాలు కుంటుబడుతాయి. తద్వారా ఉత్పత్తి మందగిస్తుంది. పెట్టుబడులు రాక కీలక రంగాల్లో నిస్తేజం ఆవరిస్తుంది. ఉద్యోగ-ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతాయి. చివరకు దేశ ఆర్థిక వృద్ధిరేటు ఆగిపోతుంది. అందుకే ఏ దేశానికైనా దాని కరెన్సీనే ఆయువుపట్టు కానీ ఇప్పుడు రూపాయి దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్టు తయారైంది.

మోదీ హయాంలో రూపాయికి దెబ్బ

కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కారు కొలువుదీరిన దగ్గర్నుంచి రూపాయి పతనం కొనసాగుతూనే ఉన్నది. దేశ ఆర్థిక వ్యవస్థకు కొలమానంగా భావించే రూపీ ఎంతకీ లేవలేని దుస్థితికి దిగజారిందన్నా అతిశయోక్తి కాదు. 2014లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ 60.34గా ఉన్నది. ఇప్పుడిది 83.97గా నమోదైంది. అంటే గడిచిన పదేండ్లకుపైగా కాలంలో రూపాయి విలువ ఏకంగా 23.63 మేర క్షీణించింది. అంతకుముందు మన్మోహన్ సింగ్ పాలనలోనూ రూపాయి పడిపోయినప్పటికీ.. ఇంతకన్నా తక్కువే. ఆ పదేండ్లలో 15.97 మేర దిగజారింది. అయితే అప్పటితో చూస్తే ఇప్పుడే కరెన్సీ మార్కెట్‌లో ఒడిదొడుకులు ఎక్కువయ్యాయి. ఇందుకు అంతర్జాతీయ పరిణామాలు కారణమైనా.. దేశీయ పరిస్థితులూ హేతువేనన్నది కాదనలేని సత్యం.

21న టీ హబ్‌లో హ్యాకథాన్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): హెచ్‌ఎస్‌బీసీ సహకారంతో ఈనెల 21న టీహబ్‌లో హ్యాకథాన్‌ను నిర్వహించబోతున్నారు. ఇంజనీరింగ్, కోడింగ్ అంశాలపై ఔత్సాహికులకు ఉదయం 9-రాత్రి 9 గంటల వరకు హ్యాకథాన్‌ను నిర్వహించనున్నట్లు టీహబ్ ప్రతినిధి ఒకరు తెలిపారు. మరిన్ని వివరాలకు ఈ లింకు (https://bit.ly/ 4d9naxb)లో సంప్రదించాలని సూచించారు. విజేతలుగా ఎంపికైన వారికి హెచ్‌ఎస్‌బీసీలో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం ఉంటుంది.

ఎల్ఐసీ లాభం 10,461 కోట్లు



న్యూఢిల్లీ, ఆగస్టు 8: దేశీయ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ) ఆశాజనక పనితీరు కనబరిచింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను రూ.10,461 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.9,544 కోట్ల లాభంతో పోలిస్తే 10 శాతం ఎగబాకినట్లు కంపెనీ వెల్లడించింది. అటు ఆదాయం కూడా రూ.1,88,749 కోట్ల నుంచి రూ.2,10,910 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. గత త్రైమాసికంలో ఆర్జించిన ఆదాయంలో తొలి ఏడాది ప్రీమియం వసూళ్లు రూ.6,811 కోట్ల నుంచి రూ.7,470 కోట్లకు పెరగగా, రెన్యూవల్ ప్రీమియం వసూళ్లు రూ.53,638 కోట్ల నుంచి రూ.56,429 కోట్లకు, అలాగే పలు సంస్థల్లో పెట్టుబడుల రూపంలో రూ.96,183 కోట్లు సమకూరినట్లు తెలిపింది.

ఫెడరల్ బ్యాంక్ విస్తరణ

హైదరాబాద్, ఆగస్టు 8: ఫెడరల్ బ్యాంక్ తెలుగు రాష్ట్రాల్లో మరిన్ని శాఖలు ఏర్పాటుచేయబోతున్నది. ప్రస్తుతం తెలంగాణ, ఏపీల్లో 78 శాఖలు ఉండగా, వచ్చే ఏడాదిన్నరలోగా ఈ శాఖల సంఖ్యను 100కి పెంచుకోనున్నట్లు బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, జోనల్ హెడ్ దిలీప్ తెలిపారు. ప్రస్తుతేడాది 10 నుంచి 12 శాఖలను ప్రారంభించనుండగా, వచ్చే ఏడాది కూడా ఇంతే స్థాయిలో బ్రాంచ్‌లను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు హైదరాబాద్‌లోకి అడుగుపెట్టి 50 ఏండ్లు పూర్తైన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన చెప్పారు.

'నైనీబ్లాకులో చెట్ల గణన'

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): ఒడిశాలో నైనీ బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభించడానికి వీలుగా చెట్ల గణన, తొలగింపు ప్రక్రియకు సహకరించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహూజాను సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ కోరారు. 10 రోజుల్లో చెట్ల గణన ప్రక్రియ చేపడతామని ఆయన హామీ ఇచ్చినట్టు సీఎండీ వెల్లడించారు. బుధవారం భువనేశ్వర్‌లో కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో కొత్త బ్లాక్‌ల స్థితిగతులపై నిర్వహించిన సమావేశంలో సీఎండీ మాట్లాడారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

ఎస్బీఐ చైర్మన్‌గా తెలంగాణ బిడ్డ ఎంపిక హర్షణీయం మాజీ ఎంపీ బోయినపల్లి

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) 27వ చైర్మన్‌గా జోగుళాంబ గద్వాల జిల్లా పెద్దపోతులపాడుకు చెందిన చల్లా శ్రీనివాసులు శెట్టి నియామకవడంపై మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. శ్రీనివాసులుశెట్టి మారుమూల గ్రామంలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియంలో చదివి, ఎస్బీఐ చైర్మన్ స్థాయికి ఎదగడం గొప్ప విషయమని ప్రశంసించారు. ఎస్బీఐ చైర్మన్‌గా తెలుగువాళ్లు తొలిసారిగా నియామకమవడం తెలంగాణకు గర్వకారణమని పేర్కొన్నారు. శ్రీనివాసులు శెట్టిని తెలంగాణ ప్రభుత్వం తరపున రాష్ట్ర ఆర్థికమంత్రి మల్లు భట్టివిక్రమార్క సన్మానించాలని కోరారు.

మంత్రి పొంగులేటి కారు టైర్ పంక్చర్

వైరారూరల్, ఆగస్టు 8: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రయాణిస్తున్న కారు టైరు గురువారం పంక్చర్ అయింది. డ్రైవర్ అప్రమత్తమై పక్కకు నిలిపారు. గురువారం ఖమ్మంలోని తన నివాసం నుంచి మంత్రి పొంగులేటి ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి కాన్వాయ్‌తో బయలుదేరారు. వైరాలోని హైలెవల్ వంతెన దిగిన తర్వాత జాతీయ రహదారిపై మంత్రి ప్రయాణిస్తున్న ల్యాండ్ క్రూజర్ వెనుక టైర్ పంక్చరైంది. అప్రమత్తమైన డ్రైవర్ కారును వెంటనే పక్కకు నిలిపారు. ఆ తర్వాత పొంగులేటి స్పేర్ వెహికిల్‌లో ప్రగడవరం వెళ్లిపోయారు.

ఎదులపహాడ్ అడవుల్లో పులి కదలికలు

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): తాడోబా అభయారణ్యాల నుంచి 25 రోజుల క్రితం కాగజ్‌నగర్ అటవీ ప్రాంతానికి వచ్చిన ఎస్-12 పులి జనావాసాలకు దగ్గరగా సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మూడున్నర ఏళ్ల వయసున్న మగపులి కదలికలు తాజాగా తిర్యాణి మండలం ఎదులపహాడ్ అడవుల సమీపంలో కనిపించాయి.

ట్రిపుల్ ఆర్‌కు భూములివ్వం

భూమికి భూమి ఇస్తేనే ఒప్పుకుంటం • తేల్చిచెప్పిన సంగారెడ్డి జిల్లా రైతులు • పెద్దపూర్ వద్ద జాతీయ రహదారిపై ధర్నా

సదాశివపేట, ఆగస్టు 8: రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి భూములు ఇవ్వబోమని రైతులు తేల్చిచెప్పారు. భూములు కోల్పోతున్న తమకు భూమికి భూమి ఇవ్వాలని, లేకపోతే బహిరంగ మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురువారం రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండల పరిధిలోని గిర్మాపూర్, సదాశివపేట మండల పరిధిలోని పెద్దాపూర్ శివారులో అధికారులు డిజిటల్ భూ సర్వే నిర్వహించారు. సర్వేకు ఎలాంటి అడ్డంకులు జరగకుండా ముందస్తుగా భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ట్రిపుల్ ఆర్ రింగ్ రోడ్డు వల్ల జీవనోపాధి కోల్పోతున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు లిఖితపూర్వకంగా హామీ ఇచ్చి భూసర్వే చేయాలని డిమాండ్ చేశారు. తాతల కాలం నుంచి వస్తున్న భూములను కోల్పోతే తమకు జీవనోపాధి లేకుండా పోతుందని, భూములు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అనంతరం పెద్దాపూర్ వద్ద జాతీయ రహదారి 65పై ధర్నా నిర్వహించారు.



సంగారెడ్డి జిల్లా పెద్దాపూర్ శివారులో ధర్నా చేస్తున్న రైతులను అరెస్టు చేస్తున్న పోలీసులు

భూమిస్తే నేనెట్ల బతికేది?



నాకు అద్దెరక భూమి ఉన్నది. భూమి ఇస్తే నేనెట్ల బతుకుడు. రోడ్డుకు భూ మియ్యా. అందరిస్తే నేనిస్తా. భూమికి భూమి ఇవ్వాలి. లేదంటే బయట ఉన్న రేటు కట్టియ్యాలి. గట్లయితేనే ఇస్తా. లేదంటే ఇయ్యా.

- పార్వతమ్మ, గిర్మాపూర్

ఆస్తిపన్ను మోత మోగుడే!

› I తరువాయి...

పెంచడమేనని సమాచారం. ప్రస్తుతం గ్రేటర్ వ్యాప్తంగా ఆస్తి పన్ను వసూళ్లు ఏడాదికి రూ.1900 కోట్ల వరకు ఉండగా... దానిని రూ.5వేల కోట్లకు చేర్చాలనేది ఈ జీఐఎస్ సర్వే ప్రధాన లక్ష్యం. వాస్తవానికి గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఈ సర్వే ప్రతిపాదన ఒక ప్రైవేటు ఏజెన్సీ ద్వారా ప్రభుత్వం దృష్టికి వచ్చింది. కానీ పేద, మధ్య తరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని భావించిన కేసీఆర్ సర్వే ప్రతిపాదనను తిరస్కరించారు. అదే ప్రతిపాదన ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ మొగ్గ తొడిగింది. అణువణువూ అన్వేషించి... పన్నుల మోతను మోగించేందుకు సిద్ధమవుతున్నది.



ప్రస్తుతం స్వీయ మదింపుతోనే చెల్లింపులు

జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రస్తుతం 19 లక్షలకు పైగా ఉన్న ఆస్తుల నుంచి ఏటా రూ.1900 కోట్ల వరకు ఆస్తి పన్ను రూపంలో జీహెచ్‌ఎంసీ ఖజానాకు చేరుతున్నది. ఎన్నో ఏండ్ల కిందట నిర్ధారించిన ఆస్తి పన్నును ప్రామాణికంగా చేసుకొని యజమానులు చెల్లింపులు జరుపుతున్నారు. అనుమతులు లేని నిర్మాణదారులు రెట్టింపు స్థాయిలో ఆస్తి పన్ను కడుతున్నారు. వీరంతా స్వీయ మదింపు (సెల్ఫ్ అసెస్‌మెంట్) విధానంలోనే ఆస్తి పన్ను చెల్లిస్తున్నారు. వీరు తమ ఆస్తిని భారీగా కాకున్నా... కొంతమేర తక్కువగా అంచనా వేసి చెల్లింపులు చేస్తున్న వారి సంఖ్య గణనీయంగా ఉంటుంది. వీరిలో పేద, మధ్య తరగతి కుటుంబాలు అధికంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో జీఐఎస్ సర్వే ద్వారా ప్రతి ఆస్తిని అణువణువూ లెక్కించవచ్చని ఒక ప్రైవేటు ఏజెన్సీ ప్రతిపాదించినట్టు తెలిసింది. జీఐఎస్ సర్వేలో డ్రోన్ ద్వారా ప్రతి ఆస్తి కొలత పక్కాగా తేలుతుంది. గూగుల్ స్ట్రీట్ మ్యాప్ ద్వారా అది ఎన్ని అంతస్థుల భవనమో నిర్ధారణ అవుతుంది. ఇలా ప్రతి అంగుళం కూడా లెక్కించి... అది నివాస ప్రాంతమా? లేక వాణిజ్య ప్రాంతమా? అనే ప్రామాణికతతో ఆస్తి పన్నును సవరించనున్నారు. అంటే ప్రస్తుతం చెల్లిస్తున్న దానికంటే ఇకపై భారీ మొత్తమే చెల్లించాల్సి వస్తుంది. తద్వారా జీహెచ్‌ఎంసీకి కాసుల వర్షం కురుస్తుందనేది సదరు ఏజెన్సీ వాదన.

ఉన్నపళంగా ఆర్థిక భారం మోపొద్దనే...

జీఐఎస్ సర్వే ప్రతిపాదనను గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ప్రైవేటు ఏజెన్సీ తెరపైకి తెచ్చింది. దీని ద్వారా జీహెచ్‌ఎంసీ ఆదాయం భారీగా పెరుగుతున్నది వాస్తవమే. కానీ ఆ పెరుగుదల పేద, మధ్యతరగతి భారాన్ని మోపుతుంది. ప్రస్తుతం ఆస్తుల మదింపు అణువణువూ కొలతల ఆధారంగా జరగలేదు. కాస్త అటుఇటూ ఉంటుందనేది బహిరంగ రహస్యం. ఇప్పుడు జీఐఎస్ సర్వే చేపట్టడమంటే చెల్లింపుదారుల నుంచి ముక్కుపిండి వాస్తవ మొత్తాన్ని వసూలు చేస్తారు. ఇండ్లకు సంబంధించిన ఆస్తిపన్ను చెల్లింపుదారుల్లో పేద, మధ్య తరగతి కుటుంబాలే అధికంగా ఉన్నాయి. వాణిజ్య సముదాయాలను మినహాయిస్తే కాలనీల్లో ఉండే చిన్న చిన్న వ్యాపారదారులు కూడా మధ్య తరగతి కుటుంబాల పరిధిలోకే వస్తారు. నిర్మాణాల వాస్తవ కొలతల ఆధారంగా పేద, మధ్య తరగతి ప్రజల నుంచి ముక్కుపిండి ఆస్తి పన్ను వసూలు చేయాల్సి రావడాన్ని కేసీఆర్ ప్రభుత్వం వ్యతిరేకించింది. వారి జేబుల నుంచి వచ్చే సొమ్ముతో జీహెచ్‌ఎంసీ ఆదాయాన్ని పెంచుకోవాలనే లక్ష్యాన్ని కేసీఆర్ తిరస్కరించారు. దీంతో ఆ ప్రతిపాదన అప్పట్లో అటకెక్కింది.

ఇంటి డాక్యుమెంట్లు అడుగుతున్న సర్వే సిబ్బంది

మరోవైపు ఒక ప్రైవేటు ఏజెన్సీ ద్వారా జరుగుతున్న ఈ సర్వేలో.. యజమానుల నుంచి ఆధార్ కార్డు, ఇంటి డాక్యుమెంట్లు అన్నీ సేకరిస్తున్నారు. దీనిపై నగరవాసుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే జీహెచ్‌ఎంసీ దగ్గర యజమానులకు సంబంధించిన సమగ్ర వివరాలు కంప్యూటరీకరించి ఉన్నందున ప్రైవేటు ఏజెన్సీకి ఇవ్వాల్సిన అవసరమేముందని వారు ప్రశ్నిస్తున్నారు. అసలే సైబర్ క్రైం నిత్యం ఓ పెను సవాల్‌గా మారిన ఇలాంటి తరుణంలో ప్రజల వ్యక్తిగత డాటా బయటికి పోవడంపై ఆందోళన వ్యక్తమవుతున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నపుడు ప్రైవేటు ఏజెన్సీలకు వ్యక్తిగత వివరాలు వెళ్లడంపై ఆందోళన వ్యక్తం చేసిన దాఖలాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జీఐఎస్ సర్వే దరిమిలా ప్రైవేటు ఏజెన్సీ డాక్యుమెంట్లను తీసుకోవడాన్ని పలువురు వ్యతిరేకిస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే..

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జీఐఎస్ సర్వే మళ్లీ తెరపైకి వచ్చింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సర్వే ప్రతిపాదనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతమున్న ఆదాయానికి అదనంగా మరో రూ.3వేల కోట్లు వస్తాయనే లక్ష్యంతో ఈ సర్వేకు అనుమతి ఇచ్చినట్టు తెలుస్తున్నది. కానీ పైకి అధికారులు మాత్రం... గ్రేటర్ ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి, పట్టణ ప్రణాళిక, వనరుల నిర్వహణను మెరుగుపరిచేందుకు జీఐఎస్ సర్వే ఎంతగానో దోహద పడుతుందని చెప్తున్నారు. కానీ సర్వే అనంతరం యజమానులకు సాంకేతికంగా కొలతలు చూపి.. గతంలో తక్కువ పరిమాణం ప్రాతిపదికన తక్కువ మొత్తం చెల్లిస్తున్నారని, వాస్తవ కొలతల ఆధారంగా ఇంత మొత్తం నిర్ధారణ అయిందని నోటీసులు ఇవ్వనున్నట్టు తెలిసింది. సాంకేతిక సర్వే అయినందున యజమానులకు దానిని తప్పుబట్టే అవకాశం కూడా ఉండదు.

మా ఇంటికీ చెత్త బండి రావట్లే

- **చెత్త సేకరణ నిర్వహణ సరిగా లేదు**
- **మేమూ ఇబ్బందులు పడుతున్నాం**
- **జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి**



హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 6 (నమస్తే తెలంగాణ): 'గ్రేటర్ హైదరాబాద్‌లో ఇంటింటి చెత్త సేకరణ సరిగా లేదు. రోజూవారీగా చెత్తను సేకరించటం లేదు. మా ఇంటికి సైతం చెత్తబండి రావటం లేదు. మేము కూడా ఇబ్బందులు పడుతున్నాం' అంటూ గురువారం స్వయానా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆమ్రపాలి పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో పారిశుద్ధ్య నిర్వహణ ఎంత అధ్వానంగా ఉన్నదో చెప్పడానికి ఈ వ్యాఖ్యలే నిదర్శనం. ముఖ్యమంత్రి సహా మంత్రులు, ఐఏఎస్‌లు, ప్రముఖులు ఉండే రాజధాని దుస్థితి ఇది. ఇక పల్లెల దుస్థితిని మాటల్లో వర్ణించలేం. బీఆర్‌ఎస్ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లెప్రగతి, పట్టణ ప్రగతిని అటకెక్కించిన కాంగ్రెస్ సర్కారు చర్యల ఫలితంగా ఇప్పుడు ఎక్కడ చూసినా చెత్తాచెదారమే కనిపిస్తున్నది. పారిశుద్ధ్య కార్మికులకు కొన్ని నెలలుగా వేతనాలు ఇవ్వకపోవటంతో వాళ్లు విధులు నిర్వర్తించటం లేదు. ఈ సమస్యపై మాజీ మంత్రి హరీశ్‌రావు గొంతెత్తడంతో.. గురువారమే కార్మికులకు వేతనాలు విడుదల చేస్తున్నట్టు మంత్రి సీతక్క ప్రకటించారు. కానీ ఇప్పటికే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యాతోపాటు అంటువ్యాధులు తీవ్రంగా ప్రబలాయి. ఇటీవల రాష్ట్రంలో ఇద్దరు నిండు గర్భిణులు డెంగ్యూ సోకి కన్నుమూశారు. వర్షాలు భారీగా కురుస్తుండటంతో పారిశుద్ధ్య నిర్వహణ నానాటికీ అధ్వానంగా మారింది.

స్వచ్ఛ ఆటోలపై చర్యలేవి?

పారిశుద్ధ్య నిర్వహణలో జీహెచ్‌ఎంసీ వైఫల్యాలను ఎత్తిచూపుతూ 'నమస్తే తెలంగాణ' పలుమార్లు ప్రత్యేక కథనాలను ప్రచురించింది. అయినా అధికారుల్లో చలనం లేదు. రాజధానిలో సుమారు 5,250 స్వచ్ఛ ఆటోల ద్వారా నగరంలో 4,886 కాలనీల్లో 23 లక్షల గృహాల నుంచి రోజుకు 7 వేల మెట్రిక్ టన్నులకు పైగా చెత్త సేకరణ జరగాలి. ఒక్కో ఆటోకు 500-600 ఇండ్లు కేటాయించి, చెత్త సేకరణ చేపట్టాలి. కొన్ని రోజులుగా స్వచ్ఛ ఆటోల పనితీరు సరిగా లేదు. రోజుకు దాదాపు 1,000 స్వచ్ఛ ఆటోలు పనిచేయటం లేదని స్వయంగా గత కమిషనర్ రోనాల్డ్‌రోస్ గుర్తించారు. ఇటీవల కమిషనర్ ఆమ్రపాలి సైతం స్వచ్ఛ ఆటోల పనితీరుపై సమీక్షించి స్వచ్ఛ ఆటోలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినా ఫలితం లేదు.

ప్రైవేట్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్

34 మంది విద్యార్థులకు అస్వస్థత

అచ్చంపేటటౌన్, ఆగస్టు 8: విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన ఘటన గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం లింగోటం ఆక్స్‌ఫర్డ్ ప్రైవేట్ పాఠశాల హాస్టల్‌లో జరిగింది. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి పాఠశాలను తనిఖీ చేయాలని డీడీఎంహెచ్‌వో తారాసింగ్‌ను ఆదేశించారు. ఆయన హాస్టల్ భోజనాన్ని పరిశీలించారు. చికిత్స పొందుతున్న విద్యార్థులను జిల్లా వైద్యాధికారి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో 820 మందికి 525 మంది అల్పాహారం తీసుకున్నారని, వారిలో 34 మంది అస్వస్థతకు గురికాగా.. అచ్చంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించామని తెలిపారు.



మార్లిన్ మన్రో విగ్రహం తరలింపు!

న్యూయార్క్: వివాదాస్పదంగా మారిన ప్రఖ్యాత హాలీవుడ్ నటి, మోడల్, గాయని మార్లిన్ మన్రో భారీ విగ్రహాన్ని అమెరికాలోని పామ్ స్ప్రింగ్స్‌లో వేరే ప్రదేశానికి తరలించడానికి ఎట్టకేలకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. 2014లోనే పామ్‌స్ప్రింగ్స్‌ను వదిలి తిరిగి 2021లో అదేచోటుకు చేరుకున్న ఈ భారీ విగ్రహంపై వివాదాలు చుట్టుముట్టాయి. 1955లో వచ్చిన 'ద సెవెన్ ఇయర్ ఇచ్' అనే చిత్రంలో మార్లిన్ మన్రో స్కర్ట్ సీన్ చలనచిత్ర రంగంలో ఒక ఐకానిక్ సీన్‌గా నిలిచిపోయింది. ఆ సీన్‌లోని స్టిల్‌తో మార్లిన్ మన్రో 26 అడుగుల విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. అయితే స్కర్ట్ ఎగిరే సెక్సీ దృశ్యంతో అంత భారీగా ఉన్న విగ్రహాన్ని చూసి మహిళలు, పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు పామ్ స్ప్రింగ్స్ మేయర్ జెఫ్రీ బెర్న్‌స్టీయిన్ తెలిపారు. అందుకే దానిని దగ్గరలోనే డౌన్‌టౌన్ పార్కులో ఒక నిర్దేశిత ప్రదేశానికి తరలించనున్నట్టు చెప్పారు.

బ్రిటన్‌లో జాతివివక్ష వ్యతిరేక నిరసనలు

లండన్ తదితర నగరాల్లో ప్రదర్శనలు

లండన్: జాతి వివక్ష వ్యతిరేక నిరసనకారులు బ్రిటన్‌లోని లండన్, తదితర నగరాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. గత వారంలో రైట్‌వింగ్ గ్రూపులు వలసదారులకు వ్యతిరేకంగా నిర్వహించిన నిరసనలను తిప్పికొట్టేందుకు ఈ ప్రదర్శనలు జరిగాయి. వివిధ వర్గాలకు చెందినవారు ఐకమత్యాన్ని ప్రదర్శించారని నిర్వాహకులు తెలిపారు. నిరసనకారులు 'స్మాష్ ఫాసిజం అండ్ రేసిజం', 'స్టాప్ ది ఫార్ రైట్' అనే నినాదాలతో ప్లకార్డులను ప్రదర్శించారు. జాత్యహంకారం, ఇస్లామోఫోబియాలకు వ్యతిరేకంగా ఐకమత్యంగా నిలిచిన ప్రజలకు, లండన్‌వాసులకు రక్షణ కల్పించడంలో పగలు, రాత్రి శ్రమిస్తున్న పోలీసులకు ధన్యవాదాలు అని లండన్ మేయర్ సాదిక్ ఖాన్ ఎక్స్‌లో పోస్ట్‌చేశారు.





యుద్ధ క్షేత్రంలోకి రోబో శునకాలు

'బ్యాడ్ వన్'ను సిద్ధం చేసిన ఉక్రెయిన్!

కీవ్: యుద్ధ సంక్షోభంలో చిక్కుకున్న ఉక్రెయిన్ సరికొత్త ఆయుధాన్ని ఆవిష్కరించింది. సైన్యంలో తీవ్రమైన మానవ వనరుల కొరత ఎదుర్కొంటున్న ఆ దేశం, రోబో శునకం 'బ్యాడ్ వన్'ను అభివృద్ధి చేసింది. యుద్ధ క్షేత్రంలో, సైనిక ఆపరేషన్లలో వీటిని వాడాలని, రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఇవి కీలకంగా మారుతాయని ఉక్రెయిన్ భావిస్తున్నది. త్వరలో వీటిని సైన్యంలో మోహరించబోతున్నట్టు వార్తలు వెలువడ్డాయి. సైనిక నిఘా, మందుపాతరలను గుర్తించేందుకు చేపట్టే హై-రిస్క్ ఆపరేషన్‌లలో 'బ్యాడ్ వన్'లను వాడబోతున్నట్టు తెలిసింది. ఏడు కిలోల మందుగుండు లేదా ఆయుధాల్ని, యుద్ధ క్షేత్రంలో గాయపడ్డ సైనికుడి వద్దకు ఔషధాల కిట్‌ను ఇవి మోసుకెళ్లగలవు.

కాఫీ, టీలో సుక్రలోజ్ వాడటం క్షేమమే!

న్యూఢిల్లీ: మధుమేహంతో బాధపడేవారు ఉదయం టీ లేదా కాఫీలో జీరో క్యాలరీ కృత్రిమ స్వీట్‌నర్ సుక్రలోజ్‌ను వాడటం వల్ల ప్రమాదం లేదని తాజా అధ్యయనం వెల్లడించింది. మూడు నెలల సగటు బ్లడ్ సుగర్ కౌంట్ (హెచ్‌బీఏ1సీ)ని ఇది పెంచబోదని తెలిపింది. అంతేకాకుండా, దీనిని కొద్ది మోతాదులో వాడితే, శరీరం బరువు తగ్గడానికి ఉపయోగపడుతుందని వివరించింది. మద్రాస్ డయాబెటిస్ రిసెర్చ్ ఫౌండేషన్ ఈ పరిశోధనను నిర్వహించింది. టైప్-2 మధుమేహంతో బాధపడే వయోజనులకు ముప్పు కలిగించే అంశాలపై సుక్రలోజ్ ప్రభావం గురించి మన దేశంలో జరిగిన మొదటి అధ్యయనం ఇదే కావడం విశేషం. మన దేశంలో నేచర్, స్ప్లెండా, సుగర్-ఫ్రీ బ్రాండ్ల పేర్లతో ఈ ఆర్టిఫిషియల్ స్వీట్‌నర్ దొరుకుతుంది.

మధుమేహం కేసుల పెరుగుదలపై పిల్

న్యూఢిల్లీ, ఆగస్టు 8: దేశంలో మధుమేహం, దాని అనుబంధ రోగాలు ఆందోళకర స్థాయిలో పెరగడంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని(పిల్) ఈ నెల 27న విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. తక్కువ పోషకాలు, పరిమితికి మించిన చక్కెర, ఉప్పు, నూనె ఉన్న ప్యాకేజ్డ్ ఆహారంపై వాటి వివరాలతో కూడిన ముందు వైపు లేబిలింగ్(ఎఫ్‌ఓపీఎల్) నిబంధన అమలు చేసేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని ఈ పిల్ దాఖలైంది. దీని వల్ల ప్రజలు సులువుగా పోషక విలువలు, హానికర పదార్థాల సమాచారాన్ని తెలుసుకుంటారని పిటిషనర్ తెలిపారు. మధుమేహం చాప కింద నీరులా దేశంలో వ్యాపిస్తున్నదని, లక్షలాది మందిపై ప్రభావం చూపుతున్న ఈ వ్యాధి మన ఆరోగ్య వ్యవస్థపై పెను భారాన్ని మోపుతున్నదని పిల్ వేసిన 3ఎస్ అండ్ అవర్ హెల్త్ సొసైటీ ఎన్జీవో తెలిపింది. దేశంలో ప్రతి నలుగురిలో ఒకరు మధుమేహంతో బాధ పడుతున్నారని.. ఇది స్థూలకాయానికి దారితీస్తుందని వెల్లడించింది.

నీట్ పీజీ వాయిదాపై నేడు సుప్రీం విచారణ

న్యూఢిల్లీ: నీట్-పీజీ పరీక్షను వాయిదా వేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టు విచారణ జరుపనున్నది. తాము వెళ్లడానికి తీవ్ర అసౌకర్యంగా ఉండే నగరాల్లో తమకు పరీక్ష కేంద్రాలను కేటాయించారని పిటిషనర్ ఆరోపించారు. విశాల్ సారేన్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు.

జపాన్‌ను వణికించిన భారీ భూకంపం

టోక్యో: భారీ భూకంపం ఒకటి గురువారం జపాన్‌ను వణికించింది. దక్షిణ తీర ప్రాంతంలోని క్యుషు తీరంలో సంభవించిన ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.1గా నమోదైంది. భూమికి 30 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రాన్ని గుర్తించారు. భూకంపంతో అప్రమత్తమైన అధికారులు సునామీ హెచ్చరికలు జారీచేశారు. భూ ప్రకంపనలతో క్యుషు ద్వీపంలోని నిచినాన్ నగరం, మియాజకి ప్రాంతాలు చిగురుటాకులా వణికాయి. దీని ప్రభావంతో తీరంలో అలలు 1.6 అడుగుల మేర ఎగసిపడ్డాయి. అయితే ప్రాణ, ఆస్తినష్టానికి సంబంధించి ఎలాంటి సమాచారమూ లేదు.

బీహార్‌లో కూలిన మరో బ్రిడ్జి

కటిహార్, ఆగస్టు 8: బీహార్‌లో మరో బ్రిడ్జి కూలింది. కటిహార్ జిల్లాలోని గంగానదిపై నిర్మిస్తున్న బ్రిడ్జిలో కొంత భాగం గురువారం కూలిపోయినట్టు అధికారులు తెలిపారు. అయితే ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. బకియా సుఖాయె పంచాయతీని జిల్లా కేంద్రానికి కలుపుతూ నిర్మిస్తున్న ఈ చిన్న బ్రిడ్జిని రూరల్ వర్క్స్ శాఖ నిర్మిస్తున్నది. నదీ ప్రవాహ ఒత్తడి వల్లే నిర్మాణంలో ఉన్న పిల్లర్లు కూలాయని అధికారులు తెలిపారు.



ప్రముఖ సినీ నటుడు చిరంజీవి గురువారం కేరళ సీఎం విజయన్‌ను కలిశారు. వయనాడ్ వరద బాధితుల సహాయార్థం రూ.1 కోటి చెక్కును అందజేశారు.

బీహార్‌లో గుళ్లు, మఠాల నమోదు తప్పనిసరి

పాట్నా: ఆలయాలు, మఠాలు, ట్రస్టుల రిజిస్ట్రేషన్‌ను బీహార్ ప్రభుత్వం తప్పనిసరి చేసింది. రాష్ట్రంలో నమోదు కాని ఆలయాలను నమోదయ్యేలా చూడాలని ప్రభుత్వం అన్ని జిల్లాల మెజిస్ట్రేట్‌లకు ఆదేశాలు జారీ చేసింది. అలాగే వాటి స్థిరాస్తుల వివరాలను బీహార్ రాష్ట్ర మత పరమైన ట్రస్టుల బోర్డు(బీఎస్‌బీఆర్‌టీ) వెబ్‌సైట్‌లో ఉంచాలని తెలిపింది. బీహార్ హిందూ మత ట్రస్ట్‌ల చట్టం-1950 ప్రకారం అన్ని దేవాలయాలు, మఠాలు, ట్రస్ట్‌లు, ధర్మశాలలు బీఎస్‌బీఆర్‌టీలో వివరాలు నమోదు చేసుకోవాలని మంత్రి నితిన్ నబిన్ గురువారం తెలిపారు. రిజిస్టర్ అయిన దేవాలయాలు, మఠాలు, ట్రస్ట్‌లకు సంబంధించిన చట్ట విరుద్ధ ఆస్తుల లావాదేవీలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఆ రాశి వారు వద్దు!

చైనా కంపెనీ ఉద్యోగ ప్రకటన

బీజింగ్: చైనాలో ఓ కంపెనీ విడుదల చేసిన ఉద్యోగ ప్రకటన చర్చనీయాంశంగా మారింది. ఫలానా రాశిలో (ఇయర్ ఆఫ్ ద డాగ్) పుట్టిన దరఖాస్తుదారులను తీసుకోబోమని ఆ దేశంలోని ఓ రవాణా కంపెనీ ఉద్యోగ ప్రకటన జారీచేసింది. తక్కువ అర్హతలున్నా.. వేరే రాశిలో జన్మించిన వారి దరఖాస్తులను తీసుకుంటామని తెలిపింది. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ కథనం ప్రకారం, గాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లోని సాంక్సింగ్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ క్లర్క్ ఉద్యోగాల కోసం పత్రికల్లో ప్రకటన విడుదల చేసింది. 'ఇయర్ ఆఫ్ ద డాగ్'లో పుట్టిన దరఖాస్తుదారులను బ్యాన్ చేసినట్టు తెలిపింది. దీనిపై కంపెనీ ఉద్యోగి మాట్లాడుతూ, 'కంపెనీ బాస్ రాశి 'డ్రాగన్'. దీనికి 'ఇయర్ ఆఫ్ ద డాగ్'కు పొంతన కుదరదు. కంపెనీకి నష్టం వాటిల్లుతుందని భావించాం' అని చెప్పారు.

సీబీఐకి చిక్కిన ఈడీ

- **లంచం కేసులో ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ అరెస్టు**
- **20 లక్షలు తీసుకొంటూ అడ్డంగా బుక్కైన వైనం**
- **బాధితుడి ఫిర్యాదుతో ప్లాన్ వేసి పట్టుకొన్న సీబీఐ**



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులంటే ఆర్థిక నేరగాళ్లకు వణుకు. సోదాలకు వాళ్లు వస్తున్నారంటేనే భయపడిపోతారు. అలాంటి ఈడీలో అసిస్టెంట్ డైరెక్టర్ అధికారి ఒకరు లంచానికి తెగబడ్డాడు. అడిగినంత సొమ్ము ఇవ్వకపోతే అక్రమ కేసు బనాయిస్తానని ఓ వ్యాపారిని బెదిరించాడు. దీంతో ఏం చేయాలో తెలియని బాధితుడు తనను రక్షించాలంటూ ఈడీకి జంట ఏజెన్సీగా చెప్పుకొనే సీబీఐని ఆశ్రయించాడు. ఇంకేముంది.. నిందితుడైన ఆ ఈడీ అధికారిని చాకచక్యంగా ప్లాన్ వేసి సీబీఐ అధికారులు పట్టుకొన్నారు.

అసలేం జరిగిందంటే?

ముంబైకి చెందిన ఓ వ్యక్తి నగల వ్యాపారం చేస్తాడు. సదరు వ్యాపారి అక్రమార్జనకు పాల్పడినట్టు ఎవరో చేసిన ఫిర్యాదుతో గత శనివారం, ఆదివారం ఆయన ఇంట్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ సందీప్ సింగ్ యాదవ్ నేతృత్వంలో ఈ దాడులు జరిగాయి. అయితే, ఆ సోదాల్లో ఏమీ లభించకపోవడంతో.. తన బుద్ధిచూపించిన యాదవ్.. తనకు రూ. 25 లక్షలు ఇవ్వాలని వ్యాపారిని డిమాండ్ చేశాడు. లేకుంటే నీ కొడుకుపై అక్రమ కేసు బనాయిస్తానని బెదిరించాడు. బేరాలు పూర్తయ్యాక లంచం రూ. 20 లక్షలకు కుదిరింది. అయితే, ఈడీ అధికారిని ఎలాగైనా అరెస్ట్ చేయించాలని అనుకొన్న వ్యాపారి.. జరిగినదంతా సీబీఐ అధికారులకు రహస్యంగా విన్నవించారు. సీబీఐ అధికారులు చెప్పినట్టుగానే.. రూ.20 లక్షలను ఇస్తానని యాదవ్‌కు చెప్పిన వ్యాపారి.. ముంబైలోని ఓ ప్రాంతానికి రమ్మన్నారు. అక్కడ మాటువేసిన సీబీఐ అధికారులు లంచం తీసుకొంటుండగా యాదవ్‌ను అరెస్ట్ చేశారు. యాదవ్ గతంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ)లో పనిచేసినట్టు సీబీఐ అధికారులు తెలిపారు.

పిడుగుపాటుకు ఏటా 1800 మందికిపైగా మృతి

లక్నో: దేశంలో పిడుగుపాట్లు ఏటా వందల మందిని బలిగొంటున్నాయి. తాజా అధ్యయనం ప్రకారం, గత 54 ఏళ్లలో పిడుగుపాట్ల కారణంగా 1,01,309 మంది మరణించారు. అంటే సంవత్సరానికి సగటున 1,876 మంది ప్రాణాలు కోల్పోతున్నారు. 1967-2020 వరకు ఎన్‌సీఆర్బీ గణాంకాలను విశ్లేషించి నివేదిక రూపొందించారు.

పాస్‌పోర్ట్, ఐడీ కార్డ్ లేకుండానే విమానయానం!

త్వరలో అబుదాబి ఎయిర్‌పోర్ట్‌లో అందుబాటులోకి

అబుదాబి, ఆగస్టు 8: అబుదాబిలోని జాయేద్ అంతర్జాతీయ విమానాశ్రయం అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తేబోతున్నది. సీఎన్‌ఎన్ కథనం ప్రకారం స్మార్ట్ ట్రావెల్ ప్రాజెక్ట్ ద్వారా 2025 నాటికి ఈ ఎయిర్‌పోర్ట్ అంతటా బయోమెట్రిక్ సెన్సర్లు అమర్చుతారు. ఇవి ప్రయాణికుల ముఖ కవళికలను గుర్తించగలుగుతాయి. కాబట్టి ప్రయాణికులు పాస్‌పోర్టు చూపించడం, తనిఖీలు చేయించుకోవడం వంటివి అవసరం ఉండదు. ప్రయాణం వేగంగా, భద్రంగా, సౌకర్యవంతంగా జరుగుతుంది. ఇది అమల్లోకి వస్తే, ఫేషియల్ ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీని వినియోగించే తొలి అంతర్జాతీయ విమానాశ్రయంగా రికార్డు సృష్టిస్తుంది.

భట్టి భాష్యం.. ఒట్టి అబద్ధం

'నమస్తే' కథనాన్ని తప్పుబట్టిన భట్టి

వాస్తవాలు మాత్రమే ప్రచురణ

దానినే తప్పుబట్టిన అమాత్యుడు

అనాలోచిత నిర్ణయం వల్లే కూలిన గోడ

వీడియో తీసింది అక్కడి వారే

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): సుంకిశాల ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురువారం మింట్ కంపౌండ్‌లోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో స్పందించారు. 'నమస్తే తెలంగాణ' పత్రిక కథనాన్ని చూపుతూ పలు వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో భట్టి చేసిన వ్యాఖ్యలు..అవి ఒట్టి బూటకం అనేందుకు ఉదాహరణలు కొన్ని.



భట్టి: కృష్ణానదిలో డెడ్‌స్టోరేజీ నుంచి కూడా హైదరాబాద్ నగరానికి మంచినీళ్లు తెచ్చేందుకు సుంకిశాల పథకం చేపడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాదం జరిగేలా నిర్మాణం చేపడుతుందనే అర్థం వచ్చేలా 'నమస్తే తెలంగాణ'లో ఒక కథను వండి వార్చారు.

వాస్తవం: సుంకిశాల ఘటన జరిగిందని, వారం రోజులుగా బయటి ప్రపంచానికి తెలియదని, పెను ప్రమాదం తప్పిందని జరిగిన సంఘటనను మాత్రమే 'నమస్తే తెలంగాణ' రిపోర్టు చేసింది. అందులో చూపిన వీడియో 'నమస్తే తెలంగాణ' ప్రతినిధులు తీసినది కాదు. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడే ఉన్న వారు, పథకం పనులను నిర్వహిస్తున్న వారు చిత్రీకరించింది. అందులో జరిగిన దృశ్యాలనే వార్తలో ప్రస్తావించారే తప్ప సొంత కవిత్వంతో రాసిన కథనం కాదు అది. వాస్తవం చెబితే భుజాలు ఎందుకు తడుముకున్నారో మరి!

భట్టి: సుంకిశాల ప్రాజెక్టుకు సంబంధించి 11.6.2021నాడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒప్పందం జరిగింది. 2022లో పనులు మొదలుపెట్టారు. జూలై 2, 2023 నాడు కుప్పకూలిన వాల్ నిర్మాణం జరిగింది. కట్టించింది బీఆర్ఎస్ ప్రభుత్వమే.

వాస్తవం: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒప్పందం, నిర్మాణ పనులు శరవేగంగా జరిగాయనేది వాస్తవం. కానీ సుంకిశాల ఘటనకు కారణమైన గేటు అమరిక, సొరంగాన్ని ఓపెన్ చేసే పనులు గత నెలలో అంటే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగాయి. గోడ కుప్పకూలేందుకు కారణం పనుల్లో నాణ్యత లోపం కాదు. రిటెయినింగ్ వాల్ నిర్మాణ డిజైన్ అంతకంటే కాదు. ప్రతికూల సమయంలో హడావుడి, అనాలోచిత నిర్ణయం కారణంగా ప్రమాదం జరిగింది. స్వయానా జలమండలి అధికారులు అధికారికంగా ఇచ్చిన పత్రికా ప్రకటనలో ఈ వాస్తవం స్పష్టంగా ఉంది.

భట్టి: సాగర్‌లోకి నీళ్లొచ్చాయట.. కూలిందట! సాగర్‌లోకి నీళ్లు రాకుంటే ఏమొస్తాయ్. సాగర్ కట్టిందే నీళ్ల కోసం. ఆ నీళ్ల నుంచే కదా పంపుహౌజ్ ద్వారా నీళ్లు తెచ్చుకుందామని కట్టుకుంది. అవన్నీ దృష్టిలో పెట్టుకొనే కదా కట్టాల్సింది. డిజైన్లు ఎంత లోపభూయిష్టంగా ఉన్నాయో దీని ద్వారా అర్థమవుతున్నది. మీ పాలన, మీ పర్యవేక్షణ ఎలా ఉన్నాయో అర్థమవుతున్నది.

వాస్తవం: సాగర్‌లోకి ఊహించని రీతిలో, ఊహించని సమయంలో నీళ్లు వచ్చాయి. అందుకే ఈ ప్రమాదం జరిగిందనేది జలమండలి అధికారుల అధికారిక ప్రకటన సారాంశం. అధికారులు, ఏజెన్సీకి ఈ కఠోర వాస్తవం తెలియదు కాబోలు. సాగర్ అంటే అందులో నీళ్లుండవు, నీటి కోసమే సాగర్ నిర్మాణం చేపట్టారనే వాస్తవాలు తెలిక సొరంగాన్ని పూర్తిస్థాయిలో ఓపెన్ చేశారేమో! దాని ఫలితంగా ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చు. డిజైన్లు, నాణ్యత అనేవి ప్రమాదానికి కారణం కాదని జలమండలి అధికారులే స్పష్టం చేశారు. ఇక, పాలన, పర్యవేక్షణ అంటే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నందున ఆ బాధ్యత ఎవరిదనేది పురపాలక శాఖ పోర్టుఫోలియో నిర్వహిస్తున్న వారికే తెలియాలి.

భట్టి: కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే గోడ కూలిందనే చెప్పే ప్రయత్నం చేశారు. కానీ అది మేం కట్టిందీ కాదు.. కట్టించిందీ కాదు. మా హయాంలో మొదలు పెట్టిందీ కాదు. తమరి (బీఆర్ఎస్) పుణ్యమే ఇది కూడా. ఒళ్లు గగుర్పొడిచే వీడియో కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి అని గొప్పగా మార్కెట్ చేసుకునే ప్రయత్నం చేశారు. ఎవరి మీదనో బురద చల్లేందుకు ప్రయత్నం చేశారు.

వాస్తవం: కట్టింది, కట్టించింది కాంగ్రెస్ ప్రభుత్వం కాకపోవచ్చుగానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎనిమిది నెలలకు రిటెయినింగ్ వాల్ కుప్పకూలిందనేది నిర్వివాదాంశం. ఇక, ఒళ్లు గగుర్పొడిచే వీడియో అంటే.. ఘటన జరిగి వారం రోజులైనా ప్రభుత్వం దానిని దాచిపెట్టింది. సంఘటన జరిగిందనే వాస్తవాన్ని ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యతనే 'నమస్తే తెలంగాణ' నిర్వర్తించింది. ఆ వీడియోను బయటి ప్రపంచానికి చూపించింది. గత పది, పదిహేను రోజుల్లో ఇంజినీర్లు తీసుకున్న నిర్ణయాలే ప్రమాదానికి కారణమనేది జలమండలి వివరణలోనూ ఉన్నందున పాపమో.. పుణ్యమో.. గత బీఆర్ఎస్ ప్రభుత్వానిది కాదని తేలింది.

కొసమెరుపు: నాగార్జున సాగర్ ప్రాజెక్టును కాంగ్రెస్ కట్టింది. కృష్ణాకు భారీ వరద వచ్చినప్పుడు, దానిని గమనిస్తూ ప్రభుత్వం సకాలంలో గేట్లు తెరవాల్సి ఉంటుంది. ఒకవేళ అలా చేయకుండా ఏదైనా ప్రమాదం జరిగితే ఆ తప్పుకు బాధ్యత సాగర్ ప్రాజెక్టు కట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానిది అవుతుందా? లేక, అధికారంలో ఉండి నిర్లక్ష్యం వహించిన అప్పటి ప్రభుత్వానిది అవుతుందా? భట్టిగారు చెప్పాలి.

జలమండలి చెప్పిన నిజం

సుంకిశాల పాపాన్ని బీఆర్ఎస్‌పైకి నెట్టే ప్రయత్నం చేసిన మంత్రులు భట్టి, పొన్నం

జలమండలి వివరణతో దొరికిన ప్రభుత్వం

ఏజెన్సీపైకి తప్పు నెట్టేసే ప్రయత్నం

మీడియా సమావేశానికి ముందు జలమండలి ఇంజినీర్లను కలిసిన భట్టి



హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): 'మంచైతే మాది.. చెడు అయితే మీది' అన్నట్టుగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. సుంకిశాల ఘటనను కూడా గత ప్రభుత్వం మీదికి నెట్టేసి చేతులు దులుపుకోవాలని చూస్తున్నది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ ఇదే ప్రయత్నం చేశారు. అయితే, జలమండలి వివరణతో ప్రభుత్వం అడ్డంగా దొరికిపోయింది. అది కూడా తమపైకి రాకుండా నెపాన్ని ఏజెన్సీపైకి నెట్టివేసే ప్రయత్నం చేసింది. 'వచ్చే వేసవిలోగా నీరు అందించాలనే ఉద్దేశంతో మిడిల్ టన్నెల్ పూర్తి చేయడానికి ఏజెన్సీ నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం వారు సంప్ వైపు టన్నెల్‌పై గేటును ఏర్పాటు చేశారు. రిజర్వాయర్ వైపు ఉన్న మట్టిని తొలగించారు. అదే సమయంలో సివిల్ వర్క్స్ టీమ్స్ సైడ్‌వాల్స్ మధ్య టై బీమ్ కనెక్టివిటీని కాస్టింగ్ చేసే పనిలో ఉన్నాయి. రిజర్వాయర్‌కు వరద ఆలస్యంగా వస్తుందని, ఈ ఏడాది ఆగస్టు చివరి నాటికి మధ్య టన్నెల్ స్థాయికి లెవల్ పెరుగుతుందని ఏజెన్సీ భావించింది. ఆగస్టు చివరి నాటికి అవసరమైన టై బీములను పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. అదే సమయంలో మిడిల్ టన్నెల్ కోసం గేట్ ఫిక్సింగ్ పనులు చేపట్టారు. జూలై 29, 30, 31 తేదీల్లో గేటు బిగింపు పనులు జరిగాయి. ఇదే సమయంలో నాగార్జున సాగర్‌కు ఒక్కసారిగా భారీ ప్రవాహం పెరిగింది. దాదాపు 3.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో రిజర్వాయర్ వద్ద అకస్మాత్తుగా బ్యాక్ క్లోజ్ వేవ్ యాక్షన్ పెరిగి నీళ్లు టన్నెల్‌లోకి వచ్చాయి. దీంతో టన్నెల్ గేటు ధ్వంసమై దానికి అనుసంధానంగా ఉన్న సైడ్‌వాల్ కూలిపోయింది. ఇదంతా ఐదు నిమిషాల స్వల్ప వ్యవధిలోనే జరిగింది. రిజర్వాయర్ సంపు పూర్తిస్థాయి నీటిమట్టంతో నిండిపోయింది'.. ఇదీ, సుంకిశాల కూలిన ఘటనపై గురువారం జలమండలి కార్యాలయం నుంచి వచ్చిన అధికారిక వివరణలోని సారాంశం. అన్నం ఉడికిందో, లేదో తెలుసుకునేందుకు ఒక మెతుకు పట్టుకుంటే చాలు.. అన్నట్టుగా సుంకిశాల ఘటనకు కారణం కూడా అంతే. కాళేశ్వరాలు.. పాపాలు.. అని ఊదరగొట్టడం అప్పటికప్పుడు కొంత పనికొస్తుందేమో కానీ, నికార్సయిన కారణాన్ని తేల్చాలంటే సాంకేతికంగా ఏం జరిగిందో చూడాలి. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిగ్గు తేల్చాలి. అది ప్రభుత్వ కనీస బాధ్యత. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలు ఆ బాధ్యతను మరిచారు. కానీ నిజం నిప్పులాంటిది. దాస్తే దాగదు కదా. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియా సమావేశం నిర్వహించి, నిరాధార ఆరోపణలు చేసిన కొద్ది గంటల్లోనే జలమండలి అధికారులు అధికారిక ప్రకటన విడుదల చేశారు. దీంతో జలమండలి నిజం.. భట్టి అబద్ధం.. అని తేలిపోయింది.

గేట్లు బిగించకుంటే ముందుగానే సాగర్‌కు భారీ ఇన్‌ఫ్లో

గత నెల 29–31 తేదీల్లో సొరంగ గేట్లు అమర్చామని జలమండలి అధికారులు తెలిపారు. ఆ తర్వాత సాగర్‌కు మూడున్నర లక్షల క్యూసెక్కుల వరద రావడంతో ప్రమాదం జరిగినట్టు వివరణలో పేర్కొన్నారు. కానీ వాస్తవంగా జూలై 27 నుంచే వరద 50 వేల క్యూసెక్కులకు మించి రావడం మొదలైంది. అదే సమయంలో శ్రీశైలం జలాశయానికి 4.12 లక్షల క్యూసెక్కుల వరద కొనసాగుతున్నది. అంటే దిగువకు వరద పెరుగుతున్నదని ఎవరైనా సులువుగా అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు గేట్ల బిగింపు చివరి రోజు 31వ తేదీన నాగార్జునసాగర్‌కు 2.18 లక్షల క్యూసెక్కుల వరద కొనసాగుతున్నది. గేట్ల బిగింపు తర్వాతనే సొరంగం ఓపెన్ చేస్తారు. అంటే సొరంగం ఓపెన్ చేసే సమయానికి రెండు లక్షల క్యూసెక్కులకు పైగా వరద కండ్ల ముందే ఉంది. కానీ అనూహ్యంగా మూడున్నర లక్షల క్యూసెక్కుల వరద వచ్చిందని జలమండలి వివరణలో పేర్కొనడం అవాస్తవం. తాము ఊహించని విధంగా వరద ఒక్కసారిగా వచ్చి పడినందునే ఘటన జరిగిందని చెప్పే ప్రయత్నం చేశారు. కానీ వరద 50వేలు... లక్ష.. రెండు లక్షలు.. ఆపై మూడు లక్షల క్యూసెక్కులకు పెరిగింది.

అంతా అయిపోయిందనుకున్న సమయంలో!

ఘటన జరిగిన తర్వాత జలమండలి అధికారులు విషయాన్ని గోప్యంగా ఉంచారు. పంపుహౌజ్‌లోకి సీపేజ్ వాటర్ వచ్చినందున నిండిపోయిందని, అందుకే పనులు నిలిపివేసినట్టు అందరికీ చెప్తూ వచ్చారు. వాస్తవానికి పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శికి కూడా పూర్తి వివరాలు తెలియవని విశ్వసనీయంగా తెలిసింది. అంటే అసలు సుంకిశాల పథకం పనులను ఉన్నతస్థాయిలో ఏ ఒక్కరూ పర్యవేక్షించడంలేదని దీని ద్వారా అర్థమవుతుంది. మరోవైపు రిటెయినింగ్ వాల్ కూలిపోతున్న వీడియో దృశ్యాలు ఏజెన్సీ, అధికారులు ఎవరి దగ్గరా లేవు. అసలు వీడియో తీసినట్టుగా కూడా వారికి తెలియదు. అందుకే గోప్యత ఫలించిందని నిశ్చింతగా ఉన్నారు. కానీ 'నమస్తే తెలంగాణ' వీడియోను బయటి ప్రపంచానికి చూపిన తర్వాతనే అటు ఏజెన్సీ, ఇటు అధికారులకు అసలు తత్వం బోధపడింది. అందుకే గురువారం ఉదయం సుంకిశాల వద్ద లోతైన విచారణ కొనసాగింది. ఘటన జరిగినపుడు విధుల్లో ఎవరు ఉన్నారు? వీడియో ఎవరు తీశారు? 'నమస్తే తెలంగాణ' నుంచి ఎవరు వచ్చారు? ఎవరితో మాట్లాడారు? ఇలా అన్ని కోణాల్లోనూ విచారణ జరిగింది.

'నమస్తే తెలంగాణ' రాసిందే అక్షరాలా నిజం

సుంకిశాల ఘటనను వెలుగులోకి తీసుకువచ్చిన 'నమస్తే తెలంగాణ'.. ప్రతికూల సమయంలో సొరంగాన్ని తెరవడమే ప్రమాదానికి కారణమన్న నిపుణుల అభిప్రాయాన్ని స్పష్టం చేసింది. ముఖ్యంగా పంపుహౌజ్ స్లాబ్ నుంచి గేటుకు టై బీమ్స్ బిగించిన తర్వాతనే సొరంగాన్ని ఓపెన్ చేయాలనే సాంకేతిక మర్మాన్ని కూడా పేర్కొన్నది. అది చేయకపోవడంతో పాటు నాగార్జునసాగర్‌కు భారీ వరద వస్తున్న సమయంలో సొరంగాన్ని ఓపెన్ చేయడం వల్లనే ప్రమాదం జరిగిందని రాసింది. అదే అక్షరాలా నిజమని జలమండలి ప్రకటన తేటతెల్లం చేసింది. కృష్ణా వరదపై ఇంజినీర్లు అంచనా తప్పడంతోనే ఈ ఘటన జరిగిందని చెప్పింది. జలమండలి వివరణలోనూ ఆగస్టులో వరదలు వస్తాయనుకుంటే ముందుగా వచ్చాయని, అందుకే ఇలా జరిగిందని పేర్కొన్నది. కాకపోతే జలమండలి ఇంజినీర్లపై ఎలాంటి నెపం లేకుండా ఏజెన్సీపై నెపాన్ని నెట్టారు. కానీ 'నమస్తే తెలంగాణ' విచారణలో మాత్రం ఏజెన్సీ ఇంజినీర్లు వారించినా జలమండలి ఇంజినీర్లు సొరంగాన్ని ఓపెన్ చేయించారనే తేలింది. కారణం ఎవరైనా వారి అంచనాలు తప్పయినందునే దుర్ఘటన జరిగిందనేది సుస్పష్టం. నాసిరకం నిర్మాణమో, డిజైన్ లోపమో కారణం కాదన్నది విస్పష్టం. మరోవైపు ఈ ఘటన వల్ల మార్చి నెలలో పూర్తి చేయాలనుకున్న పథకం రెండు నెలలు ఆలస్యం అవుతుందని వివరణలో పేర్కొన్నారు. కానీ నిపుణుల అంచనా మేరకు కనీసంగా ఏడాది కాలయాపన జరిగే అవకాశమున్నది.

లోకం పోకడ



ఇంట్లో వున్న కూరగాయలన్నీ మీరు తీసుకెళ్తే ఏం వండి చావను? అసలే కూరగాయలు దొరకక నేను చస్తుంటే!



జలమండలి ఇంజినీర్లు ఏం చేస్తున్నారు?

ప్రతికూల సమయంలో గేట్లు అమర్చి, సొరంగం ఓపెన్ చేయమన్నది ఎవరు? అనేది తేలితేనే బాధ్యులు ఎవరనేది నిర్ధారించవచ్చు. కానీ జలమండలి వివరణలో ఏజెన్సీ ఒక అంచనాలో ఉంది. కానీ, ఆ అంచనా తప్పడంతో ఈ ఘటన జరిగిందంటూ నెపాన్ని ఏజెన్సీపై వేసి ఎపిసోడ్‌ను ముగించాలనే ప్రయత్నం చేసింది. నిజంగా చూస్తే, సుంకిశాల పథకం పనులు ఓపెన్ టెండర్ల విధానంలో అప్పగించినవే. కానీ ఈ–ప్రొక్యూర్‌మెంట్ విధానంలో అప్పగించినవి కావు. అలాంటప్పుడు ఏజెన్సీనే ఒక అంచనాకు వచ్చి గేట్లు బిగించి, తనకు తానుగా సొరంగాన్ని ఓపెన్ చేస్తుంటే జలమండలి ఇంజినీర్లు ఏం చేస్తున్నారు? నిత్యం పనులను పర్యవేక్షించాల్సింది ఇంజినీర్లే కదా. పైగా గేట్ల బిగింపు, సొరంగం ఓపెన్ చేయడమనేవి అత్యంత కీలకమైన ఘట్టాలు. ఆ సమయంలో జలమండలి ఇంజినీర్లు ఎక్కడ ఉన్నారు? వారి విచక్షణ ఎక్కడికి పోయింది? నిజానికి ఇవి కదా విచారణలో తేలాల్సినవి.



ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు సమస్యలను వివరిస్తున్న మహిళలు

ఖానాపూర్ ఎమ్మెల్యేను నిలదీసిన మహిళలు

ఆగ్రహం వ్యక్తం చేసిన వెడ్మ బొజ్జు పటేల్

ఖానాపూర్, ఆగస్టు 8 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులతోపాటు, పట్టణానికి చెందిన పలువురు మహిళలు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను నిలదీశారు. గురువారం పట్టణంలో వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులకు భూమిపూజ చేసేందుకు వచ్చిన ఎమ్మెల్యేను వారు పలు సమస్యలపై ప్రశ్నించారు. డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయంలో నెలకొన్న సమస్యలను, పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. డబుల్ బెడ్రూం ఇండ్లల్లో కొందరు ఉండటం లేదని, వారి స్థానంలో అర్హులైన వారికి ఇవ్వాలని స్థానిక నిరుపేదలు కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నదని, దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. మహిళలు వినకపోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లికి రుణమాఫీ సెగ

- 27వేల లోన్ మాఫీకాలేదని రైతు ఫిర్యాదు
- న్యాయం చేయాలని అన్నదాతల డిమాండ్

శంకరపట్నం,ఆగస్టు 8: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు రుణమాఫీ సెగ తగిలింది. గురువారం కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని కేశవపట్నం రైతు వేదికలో జరిగిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీకి ఎమ్మెల్యే హాజరు కాగా.. రుణమాఫీకాని రైతులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఆయనకు ఫిర్యాదు చేశారు. తాము మొలంగూర్ ఇండియన్ బ్యాంకులో రూ.లక్ష నుంచి రూ. 1.50 లక్షల వరకు రుణం తీసుకున్నట్టు చెప్పారు. రెండు దఫాలుగా రుణమాఫీ అయినా తమకు కాలేదని వాపోయారు. అందులో రూ.27 వేల రుణం కూడా మాఫీ కాలేదని రాజయ్య అనే రైతు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చాడు. ఇండియన్ బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్ల రుణమాఫీ కాక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా బ్యాంకు సిబ్బందితోపాటు వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తమకు వెంటనే రుణమాఫీ జరిగేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.



కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కేశవపట్నం రైతు వేదికలో.. రుణమాఫీ కాలేదని ఎమ్మెల్యే కవ్వంపల్లితో మొర పెట్టుకుంటున్న రైతులు



సాగర్‌లో గేట్లన్నీ ఎత్తారు

నందికొండ/ధరూరు/ అయిజ/శ్రీశైలం, ఆగస్టు 8 : నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో 26 క్రస్ట్ గేట్ల ద్వారా స్పిల్‌వే మీదుగా దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. సాగర్ రిజర్వాయర్ నీటి మట్టం 590 (312 టీఎంసీలు) అడుగులకు గాను గురువారం 585.90 (300 టీఎంసీలు) అడుగులకు చేరడంతో క్రస్ట్ గేట్లను 18 నుంచి క్రమంగా పెంచుకుంటూ 26 క్రస్ట్ గేట్ల ద్వారా (4 గేట్లు 10 అడుగులు, 22 గేట్లు 5 అడుగుల మేర ఎత్తి) 2,25,462 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు 3,52,158 క్యూసెక్కులు వస్తుండగా.. 2,72,019 క్యూసెక్కుల అవుట్‌ఫ్లోను మెయింటెన్స్ చేస్తున్నారు. సాగర్ క్రస్ట్ గేట్లు మొత్తం ఎత్తడంతో చూసేందుకు పర్యాటకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. జూరాల ప్రాజెక్టుకు గురువారం ఇన్‌ఫ్లో 3.15 లక్షల క్యూసెక్కులు నమోదు కాగా 42 గేట్లు ఎత్తారు. ప్రాజెక్టు గేట్లు, విద్యుదుత్పత్తి, కాల్వల నుంచి 3,35,488 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదైంది. శ్రీశైలం డ్యాంకు ఇన్‌ఫ్లో 3,54,761, అవుట్‌ఫ్లో 3,73,890 క్యూసెక్కులుగా నమోదైంది. పదిగేట్లు, విద్యుదుత్పత్తి నుంచి వరద దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు పరుగులు పెడుతున్నది.

'మేడిగడ్డకు 3,30,830 క్యూసెక్కుల వరద

మహదేవపూర్/కాళేశ్వరం/కన్నాయిగూడెం, ఆగస్టు 8 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల పరిధిలోని మేడిగడ్డ బరాజ్‌కు వరద తగ్గుతున్నది. గురువారం 3,30,830 క్యూసెక్కుల ప్రవాహం రాగా, మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అన్నారం బరాజ్‌కు మానేరు, కాల్వల ద్వారా 4,500 క్యూసెక్కుల నీరు వస్తుండగా, మొత్తం 66 గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నారు. సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి ప్రవాహం పెరుగుతున్నది.

రుణమాఫీ ఫిర్యాదులపై పట్టింపేది?

- కంటితుడుపుగా ఫిర్యాదుల స్వీకరణ
- ప్రతి జిల్లాల్లో వేల సంఖ్యలో వినతులు
- ఏఈవోలు, బ్యాంకుల వద్ద బారులు
- 47 వేల మందికి మాఫీ కాలేదన్న మంత్రి
- ప్యాక్స్‌లో 30 వేలమందికి మొండిచేయి
- బీఆర్ఎస్ గ్రీవెన్స్‌కు 45 వేల ఫిర్యాదులు

హైదరాబాద్, ఆగస్టు 8(నమస్తే తెలంగాణ): అన్ని అర్హతలు ఉన్నా రుణమాఫీ కాకపోవటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేస్తేనైనా రుణమాఫీ అవుతుందేమోనన్న ఆశతో రైతులంతా గ్రీవెన్స్ సెల్‌కు పరుగులు తీస్తున్నా.. నిరాశే మిగులుతున్నది. రుణమాఫీపై రైతులు చేస్తున్న ఫిర్యాదులు పరిష్కారానికి నోచుకోవటం లేదు. రైతులు గొడవ చేయకుండా, వారి నుంచి వ్యతిరేకత రాకుండా ఉండేందుకు కంటితుడుపు చర్యగా ఫిర్యాదులు స్వీకరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో తీసుకున్న ఫిర్యాదులను ఉన్నతాధికారులకు పంపించకపోవటంతో ఫిర్యాదుల స్వీకరణ పరిష్కారానికి కాదని, రైతులను మభ్యపెట్టడానికేనని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

ఏఈవోల వద్దకు, బ్యాంకులకు రైతుల క్యూ

రెండు విడతల్లో రూ.1.5 లక్షల వరకు రుణం కలిగిన 17.75 లక్షల మంది రైతులకు రూ.12,224 కోట్ల రుణాలు మాఫీ చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ మాఫీ లెక్కలు పేపర్‌పైనే ఉన్నాయి తప్ప క్షేత్రస్థాయిలో వేల మంది రైతులకు రుణమాఫీ కాలేదు. దీంతో రైతులంతా ఏఈవోలు, బ్యాంకులకు క్యూ కడుతున్నారు. తమకెందుకు రుణమాఫీ కాలేదని ఆరా తీస్తున్నారు. అధికారులు చెప్పే ఏవేవో కారణాలతో నిరుత్సాహంతో వెనుదిరుగుతున్నారు. ఆధార్ కార్డులో, పాస్‌బుక్‌లో పేర్లు వేరుగా ఉన్నాయని, రేషన్‌కార్డు లేదని, ప్రభుత్వ ఉద్యోగం ఉన్నదని, ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారని, పాస్‌బుక్ లేదని.. ఇలా ఏఈవోలు అనేక కారణాలు చెప్తున్నారు. బ్యాంకుల వద్దకు వెళ్లిన రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది. అక్కడ వాళ్ల గోడువినే నాథుడే లేకుండా పోయాడు. రుణమాఫీ జాబితాలో పేరుంటేనే తమ వద్దకు రావాలి.. లేదంటే తమకేం సంబంధం లేదంటూ బ్యాంకు అధికారులు తేల్చి చెప్తున్నారు.



ఇంద్రవెల్లి రైతువేదికలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రం

జిల్లాల్లో ఫిర్యాదుల వెల్లువ

ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఫిర్యాదు కేంద్రాలకు, ఏఈవోల వద్దకు, బ్యాంకులకు కుప్పలుతెప్పలుగా ఫిర్యాదులు అందుతున్నాయి. సాంకేతిక కారణాలు, ఇతర సమస్యల వల్ల తొలి విడతలో 17 వేల మందికి, రెండో విడతలో 30 వేల మందికి రుణమాఫీ కాలేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా వెల్లడించారు. అంటే రెండు విడతల్లో కలిపి సుమారు 47 వేల మందికి రుణమాఫీ కాలేదు. ఇందులో 7 వేల మంది సమస్యలను మాత్రమే పరిష్కరించినట్టు మంత్రి తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో అధికారులు చేసిన తప్పులు, సాంకేతిక తప్పిదాలతో 30 వేలమందికి రుణమాఫీ కాలేదని టెస్కాబ్ బ్యాంకు అధికారులే వెల్లడించారు. 3,982 మంది రైతుల పేర్లు జాబితాలో చేర్చలేదని తెలిపారు.

బీఆర్ఎస్ నంబర్‌కు 45 వేల ఫిర్యాదులు

రుణమాఫీ కాని వారి కోసం బీఆర్ఎస్ పార్టీ ప్రత్యేకంగా వాట్సాప్ ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తున్నది. ఈ నంబర్‌కు ఇప్పటికే 45 వేలకు పైగా ఫిర్యాదులు అందినట్టు ఆ పార్టీ తెలిపింది. జిల్లాల్లోనూ భారీ సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయి. 'నమస్తే తెలంగాణ' సేకరించిన వివరాల ప్రకారం ఫిర్యాదు కేంద్రాల్లో సుమారు 26 వేల వరకు ఫిర్యాదులు అందాయి. అత్యధికంగా ఖమ్మంలో 7,400, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 6 వేలు, మహబూబ్‌నగర్‌లో 1,300, జోగులాంబ గద్వాలలో 950, యాదాద్రి భువనగిరిలో 617, సూర్యాపేటలో 2,500, భూపాలపల్లిలో 1,721, ములుగులో 1,050, హనుమకొండలో 619, మహబూబాబాద్‌లో 262, రంగారెడ్డిలో 1,332, వికారాబాద్‌లో 2,218, నిర్మల్‌లో 1,290, వరంగల్‌లో 224 ఫిర్యాదులు అందాయి. ఇవి కేవలం రైతులు ఆఫీసుకు వచ్చి చేసిన ఫిర్యాదులే. ఏఈవోల వద్ద ఫిర్యాదులు ఇంతకు రెట్టింపు ఉంటాయని తెలిసింది. అయితే, ఈ ఫిర్యాదులు ఎంతవరకు పరిష్కారానికి నోచుకుంటున్నాయనేది ప్రశ్నార్థకంగా మారింది. క్షేత్రస్థాయిలో తీసుకున్న ఫిర్యాదులు ఉన్నతాధికారులకు పంపించటం లేదని తెలిసింది. ఇందుకు సంబంధించి వ్యవసాయశాఖ డైరెక్టరేట్‌లో ఎలాంటి విభాగాన్ని ఏర్పాటు చేయకపోవటం గమనార్హం. అసలు రాష్ట్రవ్యాప్తంగా రుణమాఫీపై ఎన్ని ఫిర్యాదులు అందాయనే లెక్కాపత్రం ఉన్నతాధికారుల వద్ద లేనేలేదు. అంటే.. కంటితుడుపు చర్యగానే ఫిర్యాదులు స్వీకరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



నీరజ్ వెండి వెలుగులు

- పారిస్‌లో భారత్‌కు తొలి రజత పతకం
- పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్‌కు స్వర్ణం
- సరికొత్త ఒలింపిక్ రికార్డు నమోదు


పారిస్: నాలుగేండ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో ఎలాంటి అంచనాలూ లేకుండా బరిలోకి దిగి బరిసెతో భారత్‌కు అథ్లెటిక్స్‌లో తొలి స్వర్ణం అందించిన 'గోల్డెన్ బాయ్' నీరజ్ చోప్రా పారిస్‌లోనూ రజతంతో మెరిశాడు. స్టేట్ డి ఫ్రాన్స్ వేదికగా గురువారం అర్ధరాత్రి జరిగిన జావెలిన్ త్రో ఫైనల్‌లో నీరజ్ రెండో ప్రయత్నంలో 89.45 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంతో సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. వరుసగా రెండో స్వర్ణమే లక్ష్యంగా బరిలోకి దిగిన నీరజ్.. తుదిపోరులో అంచనాలను ఆశించిన స్థాయిలో అందుకోలేకపోయాడు. పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ ఒలింపిక్స్‌లో మునుపెన్నడూ లేని విధంగా ఏకంగా 92.97 మీటర్ల రికార్డు త్రో తో పసిడి సొంతం చేసుకున్నాడు. కెన్యా అథ్లెట్ పీటర్స్ అండర్సన్ 88.54 మీటర్ల దూరం విసిరి కాంస్యం గెలుచుకున్నాడు. తాజా ఎడిషన్‌లో భారత్‌కు ఇది ఐదో పతకం కాగా మొదటి రజతం. హాకీ జట్టుతో పాటు షూటింగ్‌లో 3 కాంస్యాలు వచ్చాయి.

నదీమ్ రికార్డు త్రో.. నీరజ్ తడబాటు

తొలి ప్రయత్నంలో బరిసెను అందుకున్న నీరజ్‌తో పాటు అర్షద్ త్రోలు ఫౌల్ అయ్యాయి. కానీ రెండో ప్రయత్నంలో మాత్రం నదీమ్ రెచ్చిపోయాడు. అతడు విసిరిన ఈట ఒలింపిక్ పాత రికార్డులన్నింటినీ చెరిపేసింది. విశ్వక్రీడల చరిత్రలో ఇదే అత్యుత్తమం. తద్వారా అతడు 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో ఆండ్రీస్ (నార్వే) విసిరిన 90.57 మీటర్ల రికార్డు బ్రేక్ అయింది. 'టోక్యో'లో నీరజ్ స్వర్ణం గెలవగా అర్షద్ ఐదో స్థానంలో నిలవగా పారిస్‌లో మాత్రం అర్షద్ పసిడి పట్టుకుపోయాడు. అర్షద్ తర్వాతే వచ్చి జావెలిన్‌ను అందుకున్న నీరజ్.. తన అనుభవన్నంతా ఉపయోగించి 89.45 మీటర్ల త్రో విసిరాడు. కానీ ఆ తర్వాత నీరజ్ వేసిన నాలుగు త్రో లు ఫౌలే కావడం గమనార్హం. రెండో త్రో తో రికార్డు సృష్టించిన నదీమ్.. ఆరో సారీ 91.79 మీటర్ల దూరం విసిరి రెండు సార్లు 90 మీటర్ల మార్కును దాటడం విశేషం. గత ఒలింపిక్స్‌లో రజతం గెలిచిన జాకబ్ వెద్లిచ్ ఈసారి (88.50 మీటర్లు) నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

1 వరుసగా రెండు ఒలింపిక్స్ (అథ్లెటిక్స్)లో రెండు పతకాలు గెలిచిన తొలి, ఏకైక అథ్లెట్ నీరజ్ చోప్రా.

4 సుశీల్ కుమార్, పీవీ సింధు, మను భాకర్ (ఒకే ఎడిషన్‌లో 2) తర్వాత రెండు పతకాలు సాధించిన నాలుగో భారతీయుడు నీరజ్



హాకీలో భారత పతకాలు

1928	1932	1936	1948	1952	1956	1960	1964	1968	1972	1980	2020	2024
(అమెస్టర్‌డామ్)	(లాస్ ఏంజిల్స్)	(బెర్లిన్)	(లండన్)	(హెల్సెంకి)	(మెల్‌బోర్న్)	(రోమ్)	(టోక్యో)	(మెక్సికో)	(మ్యూనిచ్)	(మాస్కో)	(టోక్యో)	(పారిస్)
స్వర్ణం	స్వర్ణం	స్వర్ణం	స్వర్ణం	స్వర్ణం	స్వర్ణం	రజతం	స్వర్ణం	కాంస్యం	కాంస్యం	స్వర్ణం	కాంస్యం	కాంస్యం

హాకీ కాంస్య కాంతులు

చక్ దే ఇండియా

స్పెయిన్‌పై చిరస్మరణీయ విజయం • 52 ఏండ్ల తర్వాత వరుస ఒలింపిక్స్‌లో పతకాలు • సుదీర్ఘ కెరీర్‌కు గోల్ కీపర్ శ్రీజేశ్ వీడ్కోలు

భారత హాకీ జట్టు అద్భుతం చేసింది! పారిస్ ఒలింపిక్స్‌లో మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించింది. పునర్‌వైభవానికి టోక్యో ఒలింపిక్స్‌లో బీజం పడగా..పారిస్ విశ్వక్రీడల్లో తమ సత్తాఏంటో చేతల్లో చూపెట్టింది. సెమీస్‌లో జర్మనీ చేతిలో పోరాడి ఓడిన టీమ్‌ఇండియా.. స్పెయిన్‌తో కాంస్య పతక పోరులో బెబ్బులిలా గర్జించింది. గాయపడ్డ సింహాన్ని తలపిస్తూ స్పెయిన్‌పై పంజా విసిరింది. హర్మన్‌ప్రీత్‌సింగ్ డబుల్ ధమాకాతో మరోమారు నాయకునిలా ముందుండి నడిపిస్తే.. పెట్టని కోటగోడలా శ్రీజేశ్ ప్రత్యర్థికి సింహస్వప్నంలా నిలిచాడు. ఆఖరి సెకన్ వరకు ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో భారత్ కాంస్య కాంతులు విరజిమ్మింది. 52 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత వరుసగా రెండు ఒలింపిక్స్‌లో పతకాలతో కొత్త చరిత్రకు నాంది పలికింది. అసమాన ప్రతిభతో దేశానికి ఎన్నో చిరస్మరణీయాలు అందించడంలో కీలకమైన శ్రీజేశ్ డబుల్ ఒలింపియన్‌గా కెరీర్‌కు వెలుగు జిలుగులు అద్దుకున్నాడు. మొత్తంగా పడుతూలేస్తూ సాగుతున్న భారత ఒలింపిక్ ప్రయాణంలో హాకీలో కాంస్య పతకం కొత్త ఊపిరి ఊదింది. కోట్లాది భారతీయ అభిమానుల గుండెలు ఉప్పొంగేలా చేసిన హాకీ వీరులు ప్రశంసల జడివానలో తడిసిముద్దవుతున్నారు. ప్రధాని మొదలు సామాన్యుల వరకు హాకీ విజయాన్ని తనివితీరా ఆస్వాదిస్తున్నారు.



పారిస్: ఒలింపిక్స్ హాకీలో భారత్‌ది ఘనమైన చారిత్రక వారసత్వం. హాకీ అంటే భారత్..భారత్ అంటే హాకీ అనే రీతిలో ఆటను శాసించిన తీరు గత చరిత్ర చూస్తే ఇట్టే అర్థమవుతుంది. 1928 అమెస్టర్‌డామ్ ఒలింపిక్స్ నుంచి మొదలుపెడితే నేటి పారిస్ విశ్వక్రీడల వరకు భారత హాకీ రికార్డులను టచ్ చేసిన వాళ్లు లేరు. ఈ ఘనమైన చరిత్రలో భారత్ ఏకంగా 8 స్వర్ణాలు, ఒక రజతం, 4 కాంస్య పతకాలతో ఎవరెస్ట్ అంత ఎత్తులో ఉన్నది. 1968(మెక్సికో), 1972(మ్యూనిచ్) ఒలింపిక్స్ తర్వాత 52 ఏండ్లకు వరుసగా టోక్యో(2020), పారిస్(2024) విశ్వక్రీడల్లో టీమ్‌ఇండియా పతకాలు కొల్లగొట్టి నయా చరిత్ర లిఖించింది. మ్యాచ్ విషయానికొస్తే గురువారం జరిగిన కాంస్య పతక పోరులో భారత్ 2-1 తేడాతో స్పెయిన్‌పై చిరస్మరణీయ విజయం సాధించింది. భారత్ తరఫున హర్మన్‌ప్రీత్(30ని, 33ని) డబుల్ గోల్స్‌తో అదరగొట్టగా, కెప్టెన్ మార్క్ మిరాలెస్(18ని) స్పెయిన్‌కు ఏకైక గోల్ అందించాడు.

హర్మన్ డబుల్ ధమాకా:

స్పెయిన్‌తో కాంస్య పతక పోరులో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌సింగ్ తన దమ్ము ఏంటో చూపెట్టాడు. మెగాటోర్నీలో సూపర్ ఫామ్‌మీదున్న హర్మన్‌ప్రీత్ స్పెయిన్‌తో కీలక పోరులోనూ అదే జోరు కనబరిచాడు. సెమీస్‌లో జర్మనీ చేతిలో ఓటమి నుంచి తొందరగానే తేరుకున్న టీమ్‌ఇండియా..స్పెయిన్‌కు ఎట్టి పరిస్థితుల్లో మ్యాచ్ చేజార్చుకోవద్దనే పట్టుదలతో బరిలోకి దిగింది. దీనికి తోడు గోల్‌కీపర్ శ్రీజేశ్ సుదీర్ఘ కెరీర్‌కు ఘనమైన వీడ్కోలు పలికేందుకు సహచర ప్లేయర్లందరూ గట్టిగా ప్రయత్నించారు. తొలి క్వార్టర్‌లో కొంత మందకొడిగానే కదిలిన భారత దళాలు..రెండో క్వార్టర్‌లో తమ ఆటతీరుకు పదును పెట్టారు. అయితే 18వ నిమిషంలో డీసర్కిల్‌లో మన్‌ప్రీత్ సింగ్ చేసిన తప్పుతో దక్కిన పెనాల్టీ స్ట్రోక్‌ను మిరాలెస్ గోల్‌గా మలువడంతో స్పెయిన్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఇక్కణ్నుంచి తమ గేర్ మార్చిన టీమ్‌ఇండియా..స్పెయిన్ గోల్‌పోస్ట్‌లకు దాడులకు దిగింది. రెండో క్వార్టర్స్ ముగుస్తుందన్న తరుణంలో దక్కిన పెనాల్టీ కార్నర్‌ను హర్మన్‌ప్రీత్ సింగ్ గోల్ చేయడంతో స్కోరు 1-1తో సమమైంది. మూడో క్వార్టర్ మొదలైన మూడో నిమిషంలో వచ్చిన పెనాల్టీ కార్నర్‌ను సద్వినియోగం చేసుకోంటూ హర్మన్ గోల్‌గా మలువడంతో భారత్ ఆధిక్యం 2-1కు చేరుకుంది. ఓవైపు తమ ఆధిక్యాన్ని కాపాడుకుంటూనే మరోవైపు స్పెయిన్ ఫార్వర్డ్ దాడులను భారత్ దీటుగా తిప్పికొట్టింది. కీలకమైన నాలుగో క్వార్టర్‌లో దూకుడు పెంచిన స్పెయిన్..గోల్ లక్ష్యంగా భారత్‌పై దాడులు ముమ్మరం చేసింది. గోల్ కోసం బంతిని అందుకుని వేగంగా వెళుతున్న క్రమంలో స్పెయిన్ ప్లేయర్ అడ్డుతగలడంతో హార్దిక్‌సింగ్ భుజానికి గాయమైంది. అయితే కొద్ది విరామం తర్వాత తిరిగి అతను మైదానంలోకి వచ్చాడు.

ఆఖర్లో హోరాహోరీ:

భారత్, స్పెయిన్ మ్యాచ్‌లో ఆఖరి క్షణాలు నరాలు తెగే ఉత్కంఠ మధ్య సాగాయి. చివర్లో ఒత్తిడికి గురై ప్రత్యర్థికి గోల్స్ సమర్పించుకునే లక్షణమున్న భారత్ ఈసారి ఆ తప్పును పునరావృతం చేయలేదు. మ్యాచ్ మరో 40 సెకన్లలో అయిపోతుందన్న తరుణంలో హర్మన్‌ప్రీత్‌సింగ్ ఫౌల్‌తో దక్కిన వరుస పెనాల్టీ కార్నర్లను స్పెయిన్ వినియోగించుకోలేకపోయింది. ఓవైపు బలమైన రక్షణ శ్రేణికి తోడు గోల్‌కీపర్ శ్రీజేష్ అడ్డుగోడలా నిలువడంతో భారత్‌కు చిరస్మరణీయ విజయం ఖరారైంది. మ్యాచ్ ముగిసిన తర్వాత శ్రీజేశ్ బొక్కాబోర్లా పడుకుని గోల్‌పోస్ట్‌కు దండం పెట్టాడు. మరోవైపు సహచరుల అంతా శ్రీజేష్‌కు గార్డ్ ఆఫ్ హానర్ తరహాలో సెల్యూట్ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఇక తన ట్రేడ్‌మార్క్ స్టయిల్‌లో శ్రీజేష్ గోల్‌పోస్ట్‌పై ఎక్కి అభిమానులకు అభివాదం చేయడం కనులవిందు చేసింది.

పతకాల పట్టిక

	దే	స్వ	ర	కా	మొ
1	యూఎస్‌ఏ	30	38	35	103
2	చైనా	28	25	19	72
3	ఆస్ట్రేలియా	18	14	12	44
4	ఫ్రాన్స్	14	18	21	53
5	బ్రిటన్	13	17	21	51
6	కొరియా	13	8	7	28
63	భారత్	0	1	4	5

దే: దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

ఒక ఒలింపిక్స్‌లో అత్యధిక గోల్స్

సురేందర్‌సింగ్	14 గోల్స్	మాస్కో 1980
హర్మన్‌ప్రీత్‌సింగ్	10 గోల్స్	పారిస్ 2024

గోల్‌కీపర్‌గా శ్రీజేష్ ప్రదర్శన

ఎదుర్కొన్న షాట్స్	62
సేవ్ చేసిన షాట్స్	50

హాకీ జట్టుకు నజరానా

పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకంతో మెరిసిన భారత హాకీ జట్టుకు హాకీ ఇండియా(హెచ్‌ఐ) నజరానా ప్రకటించింది. గురువారం స్పెయిన్‌తో జరిగిన కాంస్య పతక పోరులో భారత్ చిరస్మరణీయ విజయం సాధించిన నేపథ్యంలో హెచ్‌ఐ ఈ నిర్ణయం తీసుకుంది. వరుసగా రెండో విశ్వక్రీడల్లో పతకాన్ని అందించిన ప్లేయర్లు ఒక్కొక్కరికి రూ.15లక్షలు, సహాయక బృందంలో ఒక్కొక్కరికి రూ.7.5 లక్షల చొప్పున నగదు ప్రోత్సాహం ప్రకటించింది. ఈ విషయాన్ని హెచ్‌ఐ తమ అధికారిక ఎక్స్ ద్వారా వెల్లడించింది.

శ్రీజేశ్ అల్విదా..

పరట్టు రవీంద్రన్ శ్రీజేశ్..క్లుప్తంగా పీఆర్ శ్రీజేశ్. భారత హాకీకి పెట్టని కోట గోడగా పేరొందిన శ్రీజేశ్ తన 18 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌కు చిరస్మరణీయ విజయంతో వీడ్కోలు పలికాడు. స్పెయిన్‌తో జరిగిన కాంస్య పతక పోరులో చిరస్మరణీయ విజయం ద్వారా భారత్‌కు ఆఖరి ఆడ ఆడేశాడు. 2006లో జాతీయ జట్టు తరఫున అరంగేట్రం చేసిన శ్రీజేశ్ 328 మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహించాడు. ఇన్నేండ్ల సుదీర్ఘ ప్రయాణంలో భారత చారిత్రక విజయాల్లో శ్రీజేశ్‌ది కీలక పాత్ర. ప్రత్యర్థి జట్ల ప్లేయర్ల దాడులను కాచుకు కూర్చుంటూ గోల్‌పోస్ట్ ముందు గోడలా గోల్స్ అడ్డుకోవడంలోఅతనికి అతడే సాటిగా నిలిచాడు. నాలుగు దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ టోక్యోలో భారత్ కాంస్యం గెలువడంలో అతను అన్నీతానై వ్యవహరించాడు. కీలకమైన సమయాల్లో సహచరుల్లో స్ఫూర్తిని నింపుతూ ప్రత్యర్థులకు సవాళ్లు విసరడంలోఅతని తర్వాతే ఎవరైనా. కోచింగ్ కోసం పెంచుకున్న ఆవును అమ్మిన అమ్మ.. శ్రీజేశ్ కెరీర్‌ను అద్భుతంగా తీర్చిదిద్దింది. 1988, మే 8న కొచ్చిలో రవీంద్రన్, ఉష దంపతులకు జన్మించిన శ్రీజేశ్ అంచలంచెలుగా ఎదిగాడు. 2004లో భారత అండర్-21 జట్టుకు ఎంపికైన అతను ఆ తర్వాత రెండేండ్ల వ్యవధిలో జాతీయ జట్టులోకి దూసుకొచ్చాడు. ఇక అక్కణ్నుంచి వెనుదిరిగి చూసుకోని శ్రీజేశ్ ప్రపంచంలోనే అత్యుత్తమ గోల్‌కీపర్‌గా మన్ననలు పొందాడు.



వినేశ్ వీడ్కోలు

రిటైర్మెంట్ ప్రకటించిన స్టార్ రెజ్లర్

'కుస్తీ గెలిచింది నేను ఓడిపోయాను' అంటూ ట్వీట్



పారిస్: భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. ఒలింపిక్ పతకం గెలవాలన్న తన కల నెరవేరకుండానే ఆమె ఆటపై 'పట్టు' సడలించింది. పారిస్‌లో సెమీఫైనల్స్ గెలిచి ఫైనల్స్‌కు అర్హత సాధించినా తుది పోరుకు కొద్దిగంటల ముందు వంద గ్రాములు అదనపు బరువుతో 'అనర్హత' వేటు ఎదుర్కొన్న ఆమె గురువారం 'ఎక్స్' వేదికగా తన తల్లిని ఉద్దేశిస్తూ.. 'అమ్మా, కుస్తీ నా మీద గెలిచింది. నేను ఓడిపోయాను. నన్ను క్షమించు. నీ ఆశలు, నా ధైర్యం అన్ని విచ్ఛిన్నమయ్యాయి. ఇక నాకు పోరాడే బలం లేదు. 2001 నుంచి 2024 దాకా సాగిన నా రెజ్లింగ్ ప్రయాణానికి వీడ్కోలు. మీ అందరికీ రుణపడి ఉంటాను. నన్ను క్షమించండి' అని రాసుకొచ్చింది. ఐవోసీ విధించిన అనర్హత వేటుకు సంబంధించిన విచారణ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ (సీఏఎస్) వద్ద విచారణకు ఉండగానే వినేశ్ తీసుకున్న ఈ నిర్ణయంతో దేశ క్రీడాభిమానులు మరోసారి నివ్వెరపోయారు. తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దని ఆమెకు సూచించారు. ఫోగాట్ పెద్దనాన్న మహావీర్ ఫోగాట్, భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు సంజయ్ సింగ్ ఆమె నిర్ణయాన్ని పున:సమీక్షించుకోవాలని కోరారు.

వినేశ్ ప్రొఫైల్

పేరు: వినేశ్ ఫోగాట్
పుట్టిన తేదీ (25-08-1994)

కామన్వెల్త్

2014 (గ్లాస్గో)లో	స్వర్ణం
2018 (గోల్డ్ కోస్ట్)లో	స్వర్ణం
2022 (బర్మింగ్‌హామ్)లో	స్వర్ణం

ఆసియాగేమ్స్

2014(ఇంచియాన్)	కాంస్యం
2018(జకార్తా)	స్వర్ణం

వరల్డ్ చాంపియన్స్

2019లో	కాంస్యం
2022లో	కాంస్యం

నేడు కేసు విచారణ

ఐవోసీ విధించిన 'అనర్హత' వేటుపై అంతర్జాతీయ క్రీడా న్యాయస్థానం(సీఏఎస్)ను ఆశ్రయించిన వినేశ్ ఫోగాట్‌కు భారీ ఊరట దక్కింది. ఆమె అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న సీఏఎస్.. శుక్రవారం విచారణ జరుపనుంది. వినేశ్ తరఫున నలుగురు న్యాయవాదులతో కూడిన బృందం వాదనలు వినిపించనుంది. వారిలో ప్రముఖ న్యాయవాది హరీష్ సాల్వే, విధుష్పత్ సింఘానియా కూడా ఉన్నారు. గురువారం మధ్యాహ్నం విచారణకు రానున్న ఈ కేసులో ఇదే రోజు తీర్పు వెలువడే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహించవద్దు: హైకోర్టు



హైదరాబాద్, ఆగస్టు8 (నమస్తే తెలంగాణ): క్రికెట్ లీగ్ నిర్వహణకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అపెక్స్ కౌన్సిల్ రాసిన లేఖను ప్రామాణికంగా తీసుకుని ఏవిధమైన మ్యాచ్‌లను నిర్వహించరాదని హెచ్‌సీఏకు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆటగాళ్ల ఎంపిక నిమిత్తం లీగ్ మ్యాచ్‌లను నిర్వహించేందుకు హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ రాసిన లేఖను సవాలు చేస్తూ హైదరాబాద్ చార్మినార్ క్రికెట్ క్లబ్ పిటీషన్ వేసింది. దీనిని గురువారం జస్టిస్ నగేష్ భీమపాక విచారణ జరిపి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమిక ఆధారాల ప్రకారం అపెక్స్ కౌన్సిల్ రాసిన లేఖ అంబుడ్స్‌మన్ ఆదేశాలకు, బైలాస్‌కు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. అందుకే లీగ్ మ్యాచ్‌లను నిర్వహించరాదని హెచ్‌సీఏకు మధ్యంతర ఆదేశాలు చేస్తున్నట్లు వివరించారు. హెచ్‌సీఏ కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసి విచారణను వాయిదా వేశారు. పిటీషనర్ తరఫు న్యాయవాది వాదనలను వినిపిస్తూ, క్రికెట్ ఆటగాళ్ల ఎంపిక నిమిత్తం లీగ్ మ్యాచ్‌లు నిర్వహించాలంటూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ జూలై 2న రాసిన లేఖ అంబుడ్స్‌మన్ జూన్ 14న ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకమన్నారు. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు విచారణను వచ్చే నెల 5కి వాయిదా వేసింది.

మరో ఇద్దరు ఆటో డ్రైవర్ల బలవన్మరణం



హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ)/భిక్కనూరు: మహిళల ఉచిత బస్సు పథకంతో గిరాకీ లేక, నెలవారీ కిస్తీలు చెల్లించలేక మనస్తాపం చెందిన మరో ఇద్దరు ఆటో డ్రైవర్లు తనువు చాలించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మౌలాలి హౌసింగ్ బోర్డు పరిధిలో కైలాసగిరికి చెందిన ఆటో డ్రైవర్ శ్రీవన్ (24) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం రామేశ్వరపల్లికి చెందిన ఆటో డ్రైవర్ తుమ్మ శ్రీధర్ (38) ఈ నెల ఒకటిన గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలన్నింటికీ కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని టీఏటీయూ అధ్యక్షుడు వేముల మారయ్య హెచ్చరించారు.

అప్పుల బాధతో రైతు ..



జక్రాన్‌పల్లి, ఆగస్టు 8: నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌కు చెందిన రైతు కుంట రాజేశ్ (30)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్నాడు. పంట దిగుబడి సరిగా రాక.. పెట్టుబడి డబ్బులు మీదపడి రాజేశ్ అప్పుల పాలయ్యాడు. అప్పు తీర్చేందుకు మూడెకరాల భూమిని అమ్మాలనుకున్నాడు. ఆ భూమి ధరణిలో ఎక్కకపోవడంతో తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక రాజేశ్ తన వ్యవసాయ భూమిలో చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆత్మహత్యకు ముందు.. అర్గుల్ గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో వాయిస్ మెసేజ్ పెట్టాడు. భూమి తన పేరిట పట్టా కాలేదని, విక్రయానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఫలితంగా అప్పులు కట్టలేని పరిస్థితి వచ్చిందని, దీంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని తెలిపాడు. ఎస్సై తిరుపతి కేసు దర్యాప్తు చేపట్టారు.



మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవో 33 బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు

'స్థానికత'పై ప్రభుత్వం మేల్కోవాలి

- ఇప్పటికైనా సమగ్ర విధానం రూపొందించాలి
- జీవో 33పై అవసరమైతే న్యాయపోరాటం చేస్తాం
- పంచాయతీలకు వెంటనే నిధులు విడుదల చేయాలి
- మాజీ మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్, ఆగస్టు 7 (నమస్తే తెలంగాణ): విద్యాలయాల్లో ప్రవేశాలకు సంబంధించి స్థానికతను నిర్ధారించడంపై ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కోవాలని మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు ప్రభుత్వం జీవో 33 విడుదల చేసిన నేపథ్యంలో.. బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం హైదరాబాద్‌లో హరీశ్‌రావును కలిశారు. ప్రభుత్వ అనాలోచిత జీవో వల్ల తమ పిల్లలు వైద్య విద్య చదివే అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేండ్ల నిబంధనవల్ల తెలంగాణలో పుట్టిన పిల్లలు సొంత రాష్ట్రంలోనే నాన్ లోకల్ కావడం బాధగా ఉన్నదని గోడు వెల్లబోసుకున్నారు. న్యాయం జరిగేలా ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలని హరీశ్‌రావును కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు తీవ్రనష్టం చేస్తున్న జీవో 33పై పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చెందవద్దని.. బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా అడ్మిషన్ల కోసం స్థానికతను నిర్ధారించుకోడానికి కొత్త సమగ్ర విధానం రూపొందించాని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నతాధికారులతో అత్యున్నత స్థాయి కమిటీని వేసి తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడాలని సూచించారు.

ఉన్నమాటంటే ఉలుకెందుకు?

కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, పెండింగ్ బిల్లులు చెల్లించకపోవటంతో పారిశుద్ధ్య నిర్వహణ కష్టంగా మారిందని చెప్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఉలిక్కి పడుతున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన 9 నెలల్లో గ్రామ పంచాయతీలకు 9 పైసలు కూడా చెల్లించలేదనేది అబద్ధమా? కేంద్రం నుంచి ఉపాధిహామీ, హెల్త్ మిషన్ పథకాల కింద వచ్చిన రూ.2,100 కోట్ల నిధులను గ్రామాలకు ఇవ్వకుండా దారి మళ్లించింది అబద్ధమా? 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.500 కోట్లు గ్రామ పంచాయతీలకు ఇవ్వకుండా ఆపింది అబద్ధమా? మాజీ సర్పంచ్‌లు పెండింగ్ బిల్లుల కోసం చలో సచివాలయం పిలుపునిస్తే వారిని పోలీస్ స్టేషన్లలో నిర్బంధించింది అబద్ధమా? పారిశుద్ధ్య లోపంతో సీజనల్ రోగాలు ప్రబలడం అబద్ధమా? రెండు నెలలుగా పారిశుద్ధ్య కార్మికుల జీతాలు, 8 నెలలుగా జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వకపోవడం అబద్ధమా? బీఆర్‌ఎస్ హయాంలో జీపీలకు నెల నెలా రూ.275 కోట్లు, సంవత్సరానికి రూ.3,300 కోట్ల నిధులు విడుదల చేసింది నిజం కాదా? అని ప్రభుత్వాన్ని ఎండగట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని గ్రామ పంచాయతీలకు వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

స్థానిక విద్యార్థులకు దారుణ అన్యాయం: చాడ

జీవో 33 వల్ల స్థానికత కోల్పోతున్న తెలంగాణ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి గురువారం వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహకు లేఖ రాశారు. ప్రభుత్వ నిర్ణయంతో తెలంగాణలో పుట్టి, పెరిగిన విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని, 12 ఏండ్లు కష్టపడి చదివి ర్యాంకు సాధించిన విద్యార్థులకు నష్టం జరుగుతుందని వెల్లడించారు. 6 నుంచి 12వ తరగతి వరకు 7 ఏండ్ల కాలంలో గరిష్ఠంగా నాలుగేండ్లు ఎక్కడ చదివితే దానినే స్థానికతగా పరిగణించాలని సూచించారు. స్థానికత విషయంలో రాష్ట్ర విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు.

ఢిల్లీకి వస్తే పార్టీని విలీనం చేసినట్టా?

- కోడిగుడ్డుమీద ఈకలు పీకడం ఇకనైనా ఆపండి
- భూమి ఉన్నంత వరకు బీఆర్‌ఎస్ ఉంటుంది
- ఢిల్లీలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వ్యాఖ్యలు



హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): 'మేము ఢిల్లీకి వస్తే మా పార్టీని బీజేపీలో విలీనం చేసినట్టా? ఢిల్లీకి మేం రాకూడదా?' అంటూ బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. ఢిల్లీలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేల అనర్హత అంశంపై సుప్రీంకోర్టులో పోరాటం కోసం ఢిల్లీకి వచ్చామని, ఇకనైనా కోడిగుడ్డుపై ఈకలు పీకినట్టు నోటికొచ్చింది ప్రసారం చేయడం ఆపాలని కొన్ని టీవీ చానళ్లకు హితవు పలికారు. ఊహాజనితంగా కథనాలు రాయడం జర్నలిజానికి మంచిది కాదని, ఇలాంటి కథనాలు రాస్తున్నది.. ప్రసారం చేస్తున్నది ఎవరో కూడా అందరికీ తెలుసునని అన్నారు. 'ఇద్దరు ఎంపీలతో బీజేపీ ప్రస్థానం మొదలైంది. అలాగని ఆ పార్టీ అక్కడితో ఆగిపోయిందా? ఇప్పుడు మా పార్టీ కూడా అంతే. కొందరు డబ్బుకు ఆశపడి వెళ్లినంత మాత్రాన పార్టీ పని అయిపోయినట్టు కాదు' అని చెప్పారు. 'ఏ పార్టీకి అధికారం శాశ్వతం కాదు. ఆ మార్పు కూడా శాశ్వతం కాదు' అని వ్యాఖ్యానించారు.

భూమి ఉన్నంతకాలం బీఆర్‌ఎస్

బీఆర్‌ఎస్ బలహీనపడిందని వస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. ప్రజలు 39 సీట్లు ఇవ్వడం అంటే బలహీనమైనట్టు కాదని అన్నారు. ఇటీవల మహబూబ్‌నగర్‌లో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ గెలుచుకున్నామని తెలిపారు. 'సూర్యచంద్రులు కిందమీదైనా బీఆర్‌ఎస్ పార్టీ ఉంటుంది. భూమి ఉన్నంత వరకు బీఆర్‌ఎస్ ఉంటుంది. మాకేంకాదు.. మేం ప్రజల తరపున కొట్లాడుతూనే ఉంటాం' అని స్పష్టంచేశారు. నాడు ఎమ్మెల్యేలు 'జై తెలంగాణ' అని ఉచ్చరించడానికి భయపడిన రోజుల్లో నికార్సైన ఉద్యమకారులుగా తామే గొంతెత్తి నినదించినట్టు గుర్తుచేశారు. ఇప్పటికీ ఎప్పటికీ బీఆర్‌ఎస్ బీజేపీలో విలీనం కాదనే విషయం గుర్తు పెట్టుకోవాలని, మీడియా ముసుగులో బట్టకాల్చి మీదెయ్యొద్దని, జర్నలిస్టులు విలువగల వ్యక్తులని, ఇలా పలుచన కావొద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్ వెంట పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

గీత కార్మిక కుటుంబాలను ఆదుకోండి

కర్ణాటకలోని సిర్సి పట్టణం వద్ద కొండచరియలు విరిగిపడి మృతిచెందిన ఏడుగురు గీత కార్మికులను, వారి కుటుంబాలను ఆదుకోవాలని మాజీ ప్రధాని దేవెగౌడను శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఢిల్లీలో దేవెగౌడను కలుసుకున్న శ్రీనివాస్‌గౌడ్ మృతుల కుటుంబసభ్యులకు ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బాలరాజు గుత్తేదార్, పర్వానంద స్వామి, బాధిత కుటుంబసభ్యులు ఉన్నారు.

- జీతాల కోసం ఉపాధ్యాయుల నిరసన



ఒకటో తారీఖున జీతాలు కలగానే మిగిలిపోయాయని పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం దర్యాపూర్ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తంచేశారు. సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం మధ్యాహ్నం భోజన సమయంలో నిరసనకు దిగారు. ఇంతవరకు జీతాలు రాలేదని వాపోయారు. – ముత్తారం

ఒకటినే వేతనాలు ఉత్తిమాటే!

- మార్పు పేరిట కాంగ్రెస్ మోసం
- రేవంత్‌కు పాలనపై పట్టు లేదు
- బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): ఒకటో తేదీన ప్రభుత్వ చిరుద్యోగుల వేతనాలు ఇస్తున్నామన్న ప్రభుత్వ మాటలు ఉత్తిమాటలేనని బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. కొన్ని శాఖల్లోని చిరుద్యోగులకు నెలలుగా వేతనాలు అందడం లేదని, కనీసం ఆగస్టు 15 నాటికైనా వేతనాలు చెల్లించాలని, ఒక నెల వేతనం బోనస్‌గా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలు, పీఆర్సీలను అమలు చేయాలని కోరారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ సిబ్బంది పరిస్థితి దయనీయంగా మారిందని, ఏడు నెలల నుంచి వారికి జీతాలే రావడం లేదని ధ్వజమెత్తారు. మధ్యాహ్న భోజన సిబ్బందికి ఏడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, మాడల్ స్కూల్ టీచర్లకు జీతాలు ఇవ్వడమే లేదని తెలిపారు. జూనియర్ కళాశాలల అధ్యాపకులు, డిగ్రీ కాలేజీ గెస్ట్ లెక్చరర్లు జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. జీతాలు పెంచాలని ఆశ వర్కర్లు కొన్నిరోజులుగా ఆందోళనలు చేస్తున్నారని చెప్పారు. చిరుద్యోగులంటే ప్రభుత్వానికి చిన్నచూపుగా మారిందని, సీఎం రేవంత్‌రెడ్డికి పాలనపై పట్టు రాలేదని ధ్వజమెత్తారు. మంత్రులకు తమ శాఖల బాధ్యతలే తెలియదని, మార్పు అంటూ కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. చిరుద్యోగుల వేతనాల విషయంలో ప్రభుత్వం స్పందించకుంటే వారి పక్షాన కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.

తమ్ముడి కంపెనీతో ఒప్పందం తప్పెట్లయితది?

- అధికారిక మీటింగ్‌లో రేవంత్ అన్న తిరుపతిరెడ్డి బరాబర్ కూర్చుంటడు
- ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్



హైదరాబాద్, ఆగస్టు 8(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనపై బీఆర్‌ఎస్ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ మండిపడ్డారు. గురువారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ... అమెరికాలో సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన సొంత తమ్ముడు జగదీశ్వర్‌రెడ్డి కలిస్తే కూడా తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. ఆయనకు స్వచ్ఛ్ బయో కంపెనీ ఉందని, అ కంపెనీ ప్రారంభమై పదైదు నెలలు కూడా కాలేదని విమర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా ఏబీసీడీ కూడా మొదలు కాలేదని, పెట్టుబడులు రానేలేదని తెలిపారు. వాళ్లే వచ్చి తెలంగాణలో పెట్టుబడులు పెడుతా అన్నారే తప్పా.. తెలంగాణ ఆస్తి మొత్తాన్ని దోచుకుంటామని అనలేదని పేర్కొన్నారు. దీనికి లేనిపోని అభూత కల్పనలు జోడించి సొంత తమ్ముడు కూడా ఉండకూడదనే విధంగా కుట్ర పూరిత ఆలోచనలు చేస్తున్నారని విమర్శించారు. మరో తమ్ముడు కొండల్‌రెడ్డి ఆస్ట్రేలియా పర్యటనపైనా బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అది అధికారిక కార్యక్రమం కాదని, అయినప్పటికీ ఆ చైర్‌లో కూర్చుకున్నారు, ఈ చైర్‌లో కూర్చున్నారని విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అన్న తిరుపతిరెడ్డి మీటింగ్ పాల్గొనడం సర్వసాధారణమని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా బరాబర్ పాల్గొంటారని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరులపై బీఆర్‌ఎస్ అనవసర ఆరోపణలు చేస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక 8 నెలల్లో ఒక్కరోజైనా, ఒక్క చోటైనా సీఎం రేవంత్‌రెడ్డి తన సోదరులను ఇన్వాల్వ్ చేసినట్టు చూపితే అన్నింటికీ బాధ్యత వహిస్తా అని సవాల్ విసిరారు.

సర్కారుకు 'స్వచ్ఛ' సెగ!

- రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందాలపై అనేక అనుమానాలు
- కంపెనీల సమాచారాన్ని ఇవ్వని సీఎంవోపై విమర్శలు
- అమెరికా పర్యటనపై ఐఏఎస్‌లతో ప్రకటనలు
- నెట్టింట్లో వైరల్‌గా నమస్తే తెలంగాణ కథనం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)



'స్వచ్ఛ్ బయోగ్రీన్ ప్రైవేట్ లిమిటెడ్'తో రేవంత్ ప్రభుత్వం ఒప్పందం.. ఫొటోలో కంపెనీ వాటాదారు హర్ష పసునూరి (మంత్రి శ్రీధర్‌బాబు పక్కన), సుగనిత్ సంస్థ ప్రెసిడెంట్ ప్రవీణ్ పరిపాటి (ఫైల్)

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి బృందం పెట్టుబడుల పేరిట ప్రకటిస్తున్న కంపెనీలపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా ప్రఖ్యాత కంపెనీలను మాత్రమే ప్రభుత్వాలు ప్లాంట్ల ఏర్పాటుకు రాష్ట్రాలకు ఆహ్వానిస్తాయి. దానికి భిన్నంగా.. నిన్నమొన్న ఏర్పాటు చేసిన అనామక కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకొంటున్నది. షేర్ క్యాపిటల్ లక్షల్లో కూడా లేని కంపెనీలు.. రూ. వేల కోట్లు పెట్టుబడులను పెట్టబోతున్నట్టు ఊదరగొడుతున్నది. ఇదే ప్రజల్లో సందేహాలు పెరుగడానికి కారణమైంది. ముఖ్యంగా సీఎం సోదరుడు జగదీశ్వర్‌రెడ్డికి చెందిన స్వచ్ఛ్ బయోగ్రీన్‌తో సర్కారు ఒప్పందం చేసుకోవడం, ఆ కంపెనీ వివరాలను మార్చేసి మరో కంపెనీగా సీఎం కార్యాలయం చిత్రీకరించడం, 17 రోజుల కిందటే ఏర్పడిన కంపెనీ రూ. వెయ్యి కోట్ల పెట్టుబడులను పెడుతామని సర్కారుతో ఒప్పందం చేసుకోవడం.. పెను దుమారానికి దారితీసింది. బోగస్ కంపెనీలతో సర్కారు ఒప్పందాలు చేసుకున్నట్టున్నదని నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపించారు. పరువు కాపాడుకోవడానికి సర్కారు.. ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ వంటి ఐఏఎస్‌లతో ప్రకటనలను గుప్పిస్తున్నది. తెలంగాణ అభివృద్ధికి దోహదపడే పెట్టుబడులను రాబట్టడంలో అమెరికా పర్యటన సజావుగా సాగుతున్నదని, ఒప్పందాలు, మీటింగ్‌లపై అపోహలేమీ పెట్టుకోవద్దని జయేశ్‌రంజన్ వివరణ ఇవ్వడమే దీనికి రుజువు.

సీఎంవో తీరుపై మండిపాటు

సీఎం రేవంత్ సోదరుడికి చెందిన స్వచ్ఛ్ బయోగ్రీన్‌తో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం చేసుకొన్నది. ఆ వివరాలను దాచిపెట్టిన సీఎంవో.. 'స్వచ్ఛ్ బయోగ్రీన్' స్థానంలో 'స్వచ్ఛ్‌బయో' అనే అసలు ఉనికిలోనే లేని కంపెనీని తెరమీదకు తీసుకొచ్చి, ప్రభుత్వం ఒప్పందం చేసుకొన్నట్టు వెల్లడించింది. ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకొన్న కంపెనీల సమాచారాన్ని అధికారికంగా ప్రకటించాల్సిన సీఎంవో అరకొర వివరాలతో సమాచారాన్ని ఇవ్వడంపై నెటిజన్లు మండిపడుతున్నారు. పెట్టుబడుల ప్రక్రియలో తప్పులు జరుగకుంటే సీఎంవో ఎందుకు నిజమైన కంపెనీల పేర్లను వెల్లడించడంలేదని ప్రశ్నిస్తున్నారు.

నెట్టింట్లో 'నమస్తే' కథనం వైరల్

'తమ్ముడి పెట్టుబడి.. అన్న అగ్రిమెంట్' పేరుతో 'స్వచ్ఛ్‌బయో' కంపెనీ వెనకున్న చీకటి కోణాన్ని గురువారం 'నమస్తే తెలంగాణ' ఆధారాలతో బయటపెట్టింది. ఈ కథనంపై నెట్టింట పెద్దఎత్తున చర్చ జరిగింది. ఈ క్లిపింగ్స్‌ను సోషల్‌మీడియాలో పలువురు వైరల్ చేశారు. పెట్టుబడులపై రేవంత్ ప్రభుత్వం చెప్తున్న అబద్ధాలను కామెంట్ల రూపంలో ఎండగట్టారు.


పెట్టుబడుల కోసమే సీఎం పర్యటన: మంత్రి పొన్నం

భీమదేవరపల్లి, ఆగస్టు8: తెలంగాణ ప్రయోజనాల కోసమే సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా టూర్ వెళ్లారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారికంగా అమెరికాకు వెళ్తే బీఆర్‌ఎస్ నేతలకు కండ్లు మండుతున్నాయని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు చీఫ్ సెక్రటరీ, ఫైనాన్స్ సెక్రటరీ, ఐటీ, పరిశ్రమల శాఖ అధికారులు రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకే అమెరికాకు వెళ్లారని తెలిపారు. ప్రజాపాలన పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి దేశ ఎల్లలు దాటి వెళ్తే కుటుంబపరమైన అంశాలను ప్రస్తావిస్తూ బీఆర్‌ఎస్ చులకన చేసే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్, బీజేపీలు వేరు కాదని, ప్రజలు కూడా గమనిస్తున్నారని తెలిపారు.

హైదరాబాద్‌కు చార్లెస్‌స్క్వాబ్

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): ఆర్థిక సేవల్లో పేరుపొందిన చార్లెస్‌స్క్వాబ్ కంపెనీ హైదరాబాద్‌లో టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. అమెరికా పర్యటనలో భాగంగా డల్లాస్‌లో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో ఆ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు డెన్నిస్‌హోవార్డ్, రామబొక్కా, ప్రతినిధులు సమావేశమై ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. చార్లెస్ స్క్వాబ్ కంపెనీ భారత్‌లో నెలకొల్పనున్న తొలి కేంద్రం ఇదే. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో రూ.400 కోట్ల పెట్టుబడితో ఇంజెక్టబుల్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు వివింట్ ఫార్మా కంపెనీ ముందుకొచ్చింది. తద్వారా వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ విషయమై వివింట్ ఫార్మా ప్రతినిధులు సీఎం రేవంత్ బృందంతో చర్చలు జరిపారు. కంపెనీ విస్తరణకు మద్దతు ప్రకటించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీఎం, మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి కలిసి డల్లాస్‌లోని మహాత్మాగాంధీ మెమోరియల్ ప్లాజాను సందర్శించారు. అక్కడ గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- కాళేశ్వరంలో కొనసాగుతున్న ఎత్తిపోతలు



కాళేశ్వర గంగ పరవళ్లు తొక్కుతున్నది. ఎల్లంపల్లి నుంచి తరలివస్తున్న జలాలు మధ్యమానేరు మీదుగా అన్నపూర్ణ, సిద్దిపేట జిల్లా రంగనాయనాయక సాగర్‌కు పరుగులు తీస్తున్నాయి. దిగువన కాళేశ్వరం ప్రాజెక్ట్ లింక్-2లోని నంది, గాయత్రీ పంప్‌హౌస్‌లలో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా పెద్దపల్లి జిల్లాలోని నంది పంప్‌హౌస్‌కు జలాలు చేరుతుండగా, 3, 5 మోటర్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుంచి జంట సొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లాలోని గాయత్రీ పంప్‌హౌస్‌కు తరలిపోతున్నాయి. –ధర్మారం/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట

మల్లన్నసాగర్‌లోకి కాళేశ్వరం జలాలు

కొండపోచమ్మసాగర్‌లోకి నీటి పంపింగ్.. కేటీఆర్, హరీశ్‌రావు పోరాటంతో గోదావరి పరుగులు

తొగుట/మర్కూక్, ఆగస్టు 8: మల్లన్నసాగర్ ప్రాజెక్టులోకి మళ్లీ గోదావరి పరవళ్లు మొదలయ్యాయి. బీఆర్‌ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కృషితో కాళేశ్వరం నీళ్లు కదిలొచ్చాయి. ఇటీవలె బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు వెళ్లిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. కేసీఆర్‌ను బద్నాం చేయాలనే ఆలోచనను పక్కన పెట్టాలని.. కాళేశ్వరం జలాలను పంపింగ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకు గడువు ఇస్తున్నామని, అప్పటికీ లక్ష్మీ పంప్‌హౌస్ నుంచి నీటి విడుదల చేయకుంటే 50వేల మంది రైతులతో వచ్చి తామే మోటర్లను ఆన్ చేస్తామని హెచ్చరించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా రాజకీయాలు కాకుండా రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రంగనాయకసాగర్, మల్లన్న సాగర్‌లోకి నీటిని విడుదల చేయాలని సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి లేఖ రాశారు. ఆ వెంటనే మల్లన్నసాగర్‌కు నీటిని విడుదల చేస్తామని సాగునీటి పారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్‌బొజ్జా ప్రకటించారు. లక్ష్మీ పంప్‌హౌస్ నుంచి గోదావరి జలాలు అనంతరగిరి రిజర్వాయర్, రంగనాయకసాగర్‌కు చేరుకున్నాయి. గురువారం తుక్కాపూర్ పంప్‌హౌస్ నుంచి అధికారులు నాలుగు పంపులను ఆన్‌చేసి నీటిని ఎత్తిపోస్తున్నారు. ఒక్కో పంప్ నుంచి 0.432 టీఎంసీల నీటిని మల్లన్నసాగర్‌లోకి పంపిస్తున్నారు. అలాగే మల్లన్నసాగర్ నుంచి గురువారం ఒక మోటరును ఆన్ చేయడంతో గోదావరి జలాలు కొండపోచమ్మ సాగర్‌లోకి పరుగులు పెట్టాయి.



మల్లన్న సాగర్ నుంచి దిగువకు పారుతున్న జలాలు

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
NAMASTE TELANGANA
హైదరాబాద్, శుక్రవారం 9 ఆగస్టు 2024 | HYDERABAD | పేజీలు : 8

శ్రావణం.. సర్వశ్రేష్ఠం

సకల సంపదలకు ప్రతీక లక్ష్మీదేవి



సిరులు కురిపించే శ్రీలక్ష్మి..పసిపాపల చిరునవ్వుల్లో సంతాన లక్ష్మి... ఇల్లాలి ఆలనలో గృహలక్ష్మి.. ఇలా అష్టలక్ష్మీలను తనలో ఆవాహన చేసుకుని వరలక్ష్మీగా అవతరించిన మాసం..అవని తరించిన మాసం... శ్రావణం. ఈ శ్రావణ లక్ష్మి ఊరూరికీ ఊరికే రాదు.. ఆషాఢంలో ఊరించిన మేఘాలను.. ఉరుములు మెరుపులతో కురిపిస్తూ వస్తుంది. శ్రావణ మేఘాలు.. హర్షాతిరేకాలకు ప్రతీకలని చెబుతారు.. అందుకే శ్రావణ లక్ష్మి ఆగమించిన మాసంలో ప్రతిరోజూ ఓ వ్రతం పలకరిస్తుంది. ప్రతి వారం ఓ విశేషం కనిపిస్తుంది. ప్రతి ఇంటా సంతోషం వెల్లువిరుస్తుంది. ప్రతి ఇల్లాలూ సౌభాగ్యలక్ష్మీగా వాయినం ఇస్తుంది.

ఎవరీ లక్ష్మి

పుణ్యాల రాశీ శ్రీలక్ష్మి. సర్వజగత్తుకు కల్పవల్లి. దారిద్ర్య నాశిని. సౌభాగ్య దాయిని. పాలసంద్రంలో పుట్టిన బంగారం ఆ తల్లి. లోకంలో కన్నీటి శోకాలను తుడిచేస్తుంది. వానజల్లులతో పన్నీటిని చిలకరిస్తుంది. లక్ష్మీదేవి సకల సంపదలకు ప్రతీక. సకల సౌభాగ్యాలకూ అధిదేవత. లక్ష్మి ఎవరింట ఉంటుందో.. అక్కడ శ్రీహరి కూడా కొలువుదీరుతాడు. మనిషి మనుగడ సజావుగా సాగాలంటే.. లక్ష్మి అనుగ్రహం తప్పనిసరి. సదాచార సంపన్నులు, సత్కర్మలలో పాలుపంచుకునేవాళ్లు, నీతిమంతులను అమ్మవారు అనుగ్రహిస్తుంది. వ్యసనాలకు లోబడే వారిని, మానసిక శుద్ధి లేనివారిని, దుష్టబుద్ధి కలవారిని శ్రీమహాలక్ష్మి విడిచి వెళ్లిపోతుందని జైమినీ భారతం చెబుతున్నది. అందుకే, డబ్బుకన్నా.. సద్గుణాలను ప్రసాదించమని అమ్మను ప్రార్థించాలి.

దీక్షగా కొలిస్తే..

'దారిద్ర్య ధ్వంసినీం దేవీం సర్వ ఉపద్రవ వారిణీమ్' అని వేదోక్తి. లోకంలోని సకల దారిద్ర్యాలను పారదోలే దేవత మహాలక్ష్మి. సర్వ ఉపద్రవాలనూ నివారించే శక్తి ఆమెది. అందుకే శంకరాచార్యులు అమ్మవారిని 'సంపత్కారిణి' అని కీర్తించారు. ధర్మ సమ్మతమైన ఏ వరం కోరినా.. అనుగ్రహించే దైవం కాబట్టి.. శ్రావణ లక్ష్మిని 'వరలక్ష్మి' అని సంబోధించారు. ఆ తల్లి కరుణా కటాక్షాలను పొందడానికి ఉద్దేశించినదే 'వరలక్ష్మీ' వ్రతం. అమ్మవారు ఆవిర్భవించిన శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం ఈ వ్రతం ఆచరించాలని శాస్త్ర నియమం. వ్రతం అంటే.. అలంకారాలు, పూలు, పండ్లు ఈ తంతు కాదు. 'వ్రతవ్యే అనేత అనయావా ఇతి వ్రతం..' అంటే.. జీవితంలో ఒక దీక్షగా దేనిని పాటిస్తామో అది వ్రతం. సిరులిచ్చే వరలక్ష్మిని సాక్షాత్కరింపజేసుకునే అరుదైన అవకాశం ఈ వ్రతం. పూజలు, స్తోత్రాలు ఇందుకు ఉపకరిస్తాయి.

వరలక్ష్మీ అవతరించిన మాసం.. శ్రావణ శుక్రవారం
అష్ట ఐశ్వర్యాల ప్రదాయిని సర్వజగత్తుకు కల్పవల్లి
ప్రతి ఇంటా వెల్లువిరిసే సకల సౌభాగ్యం

లక్ష్మీ నివాసం

'యా దేవీ సర్వ భూతేషు.. లక్ష్మీ రూపేణ సంస్థితా' అని వేదోక్తి. సృష్టిలోని ప్రతి పదార్థమూ లక్ష్మీ స్వరూపమే! అయితే, ఆ పదార్థాన్ని వినియోగించుకునే బుద్ధి ఉన్నప్పుడే లక్ష్మీ సిద్ధి కలుగుతుంది. ఎండిన గట్టిపోచ నుంచి ఉష్ణశక్తిని పొందొచ్చు. వాడిన పూల నుంచి సుగంధ ద్రవ్యాలు పుట్టించొచ్చు. సృష్టిలో ప్రతి పదార్థమూ ప్రత్యేకమైన శక్తి కలిగినదే! వాటిని సద్వినియోగం చేసుకోవడమే లక్ష్మీతత్వం. ఉదాహరణకు బంగారంతో ముచ్చటైన ఆభరణాలు చేసుకోవచ్చు. అదే బంగారం నుంచి స్వర్ణభస్మం అనే దివ్యమైన ఔషధాన్నీ తయారు చేయొచ్చు. వేటికవే ప్రత్యేకమైనవి. లక్ష్మీదేవి సదా నిలిచి ఉండే వస్తువుల్లో స్వర్ణం కూడా ఒకటి. లౌకికంగా చూసినా.. బంగారం విలువ పడిపోయిన దాఖలాలు కనిపించవు. బంగారంపై పెట్టుబడి బంగారమంటి అవకాశంగా భావిస్తారు. అత్యవసర సమయాల్లో అరక్షణంలో బంగారంపై రుణం దొరుకుతుంది. అందుకే కాబోలు.. లక్ష్మీదేవి బంగారం రూపంలో కొలువుదీరింది.

ప్రకృతి స్వరూపం

పరిశుభ్రత ఉన్న నెలవులో లక్ష్మీదేవి కొలువై ఉంటుంది. దేహం మాత్రమే కాదు.. మనసూ పవిత్రంగా, పరిశుభ్రంగా ఉండాలి. మన చుట్టూ ఉన్న ప్రకృతి కూడా లక్ష్మీదేవి ప్రతిరూపమే. ఆ తల్లిని 'ప్రకృత్యై నమః' అని స్తుతించారు. ప్రకృతిలోని ప్రతి సంపదా తనే. పాంచభౌతిక శక్తులైన భూమి, జలం, అగ్ని, వాయువు, ఆకాశాలను సమన్వయపరిచి పుడమిపై నివసించే ప్రాణులకు రక్షణ కల్పించే శక్తి లక్ష్మి. పంటపొలాల్లోనే కాదు, పచ్చని చెట్లలోనూ ఆమె నివసిస్తుంది. ముఖ్యంగా బిల్వ వృక్షాలు లక్ష్మి నివాసాలని శ్రీసూక్తం చెబుతున్నది. చెట్లు నాటేవారిని ఆమె అనుగ్రహిస్తుందట. తొలి సంధ్య కిరణాల్లోని లక్ష్మీశక్తి భూమిలో ఖనిజాలను సృష్టిస్తుందని వేదమంత్రాలు చెబుతున్నాయి.

ఏమిటీ శ్రావణం..

స్కాంద పురాణంలో శ్రావణ వైభవాన్ని పరమేశ్వరుడు స్వయంగా ప్రకటించాడు. 'ద్వాదశేష్వపి మాసేషు, శ్రావణః శివరూపకః' అంటే 'పన్నెండు నెలల్లో శ్రావణ మాసం శివ



రూపం, సాక్షాత్తు నేనే శ్రావణ మాసం' అని సనత్కుమార మహర్షికి చెబుతాడు పరమేశ్వరుడు. మహర్షి కోరిక మేరకు శ్రావణమాస మాహాత్మ్యాన్ని 24 అధ్యాయాల్లో వివరించాడు పరమశివుడు. తన స్వరూపమైన శ్రావణ శోభను చూసి తరించేందుకు నాలుగు ముఖాలతో బ్రహ్మ, వెయ్యి కండ్లతో ఇంద్రుడు సిద్ధంగా ఉంటారని శివుడు పేర్కొన్నాడు. అంతే కాదు, ఆదిశేషుడు వెయ్యి నాలుకలతో మహేశ్వరుడి గొప్పదనాన్ని శ్లాఘిస్తూ ఉంటాడట.

ప్రతిరోజూ వ్రతమే


శ్రావణంలో వ్రతం లేని రోజు లేదు. ప్రతివారమూ పవిత్రమైందే. ప్రతి తిథి విశేషమైందే. అనుక్షణం భగవానుడి చింతన తప్ప మరొకటి ఉండదు ఈ నెలలో. వరలక్ష్మీ వత్రం, మంగళగౌరీ వ్రతం, శ్రావణమాస వ్రతం, శివవ్రతం, జీవంతికాదేవీ వ్రతం, నారసింహ వ్రతం, ఆంజనేయ వ్రతం.. ఇలా వివిధ తిథి, వారాల్లో నెల పొడవునా నిత్యం ఏదో ఒక వ్రతం ఉంటుంది. ఈ వ్రతాల ఉద్దేశం పారమార్థిక చింతనే! దేవుడిపై భక్తి విశ్వాసాలు ఏర్పడే ఉద్దేశంతో ఇలా వ్రతాలు ఏర్పాటు చేశారు. శ్రావణమాస విశిష్టతను, వివిధ వ్రతాల గురించి వివరించిన పరమేశ్వరుడు 'ఈ శ్రావణమాసం గురించి నేను గొప్పలు చెప్పడం లేదు. 'అర్థవాదోన చాత్రహి' ఈ విషయాలన్నీ సత్యాలే' అని పేర్కొన్నాడు. అందుకే శ్రావణ మాసం కన్నా గొప్ప నెల లేదంటాడు.

బంధం బలపడటానికి..

వేదాలు శ్రావణాన్ని నభో మాసమని పేర్కొన్నాయి. నభం అంటే ఆకాశమని అర్థం. వర్షాలు విశేషంగా కురిసే మాసం కావడంతో దీనిని 'నభో మాసం'గా పిలిచారు పెద్దలు. అధిక వర్షపాతం వల్ల ప్రకృతిలోని పంచభూత శక్తులు ప్రబలంగా మారుతాయి. కొన్ని సందర్భాల్లో ఇవి విపరీత పరిస్థితులూ కల్పిస్తుంటాయి. ఆ సమయంలో శరీరంలో రోగ నిరోధకశక్తి కుంటుపడుతుంది. ఫలితంగా అంటు రోగాలు విజృంభిస్తుంటాయి. అందుకే, ప్రకృతిలో వచ్చే వేర్వేరు మార్పులకు అనుగుణంగా, మన శరీరాన్ని మార్చుకునే దిశగా పలు మార్గాలు సూచించారు మన పెద్దలు. అందులో భాగంగా నిర్దేశించినవే వ్రతాలు.

పెండ్లిసందడి

శ్రావణం వచ్చిందంటే.. ఊరూరా పెండ్లిసందడి మొదలవుతుంది. జ్యేష్ఠం తర్వాత వివాహాలకు అనువైన మాసం శ్రావణమే. ఈ ఏడాది చైత్రం, వైశాఖం, జ్యేష్ఠ మాసాలు మూఢాలు ఉండటంతో.. శ్రావణంలో వివాహ ముహూర్తాలు విశేషంగా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది జంటలు జట్టుకడుతున్నాయి. ఈ క్రమంలో బంగారం దుకాణాల్లో, వస్త్రాలయాల్లో లక్ష్మీదేవి ఆనంద నర్తనం చేయనున్నది. పెండ్లి మంటపాలు, వాటిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న కార్మికులు, కళాకారులు అందరికీ ఈ నెల లక్ష్మీప్రదం అవుతున్నది. శుభకరమైన శ్రావణంలో కొత్త జీవితానికి శ్రీకారం చుడుతున్న నవ వధూవరులు వరలక్ష్మి అనుగ్రహం అదనంగా పొందుతారనడం ఖాయం. కొత్తగా పెండ్లయిన ఆడపిల్లలు మొదటి ఐదేండ్ల పాటు శ్రావణమాసం మంగళవారాల్లో మంగళగౌరీ వ్రతాన్ని ఆచరించే సంప్రదాయం ఉంది. సర్వమంగళ స్వరూపం ప్రకృతి శక్తిని ఆరాధించే విధానం మంగళగౌరీ వ్రతం. వివాహం తర్వాత స్త్రీల శారీరక ప్రకృతుల్లో వచ్చే మార్పులను సమన్వయం చేసుకోవడానికి ఈ వ్రతం ఒక అవకాశం. దాంపత్య సుఖాన్ని పెంచుకునే మార్గాన్ని సుగమం చేస్తుంది. వైవాహిక బంధం పవిత్రమై, శాశ్వతం కావడానికి ఈ వ్రతం తోడ్పడుతుంది. అంతేకాకుండా, శరీరంలో సంతాన శక్తిని పెంచుతుంది. ఇక శుక్రవారం చేసే వరలక్ష్మీ వ్రతం కష్టనష్టాల్ని రూపుమాపి.. సకల ఐశ్వర్యాలనూ ప్రసాదిస్తుంది.



తప్పయితే దాచెయ్.. దబాయించెయ్!

‘సుంకిశాల’పై ఇరకాటంలో కాంగ్రెస్ • బీఆర్ఎస్ సర్కారుపై నెట్టేసే కుట్ర • వేళ్లన్నీ రేవంత్ ప్రభుత్వం వైపే

మేడిగడ్డ ఘటనపై గంటల్లోనే స్పందించిన కేసీఆర్ ప్రభుత్వం • సుంకిశాల ఘటనను వారం రోజులపాటు దాచిన కాంగ్రెస్ సర్కారు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): చెడు జరిగితే గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాపం.. మంచి జరిగితే ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఘన కార్యం.. లేదా ప్రస్తుత రేవంత్ సర్కారు గొప్పతనం.. ఇదీ ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సర్వరోగ నివారిణిగా ఎంచుకున్న మంత్రం. అందుకే నిన్నటిదాకా తేలు కుట్టినట్టుగా వ్యవహరించిన ప్రభుత్వం సుంకిశాల ఘటన బయటికి రాగానే ఈ మంత్రాన్ని జపిస్తున్నది. ఇది బీఆర్ఎస్ ప్రభుత్వ పాపమేనంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మరో మంత్రి పొన్నం ప్రభాకర్ సెలవిచ్చారు. హైదరాబాద్ మహా నగరం పదేండ్లలో గణనీయమైన అభివృద్ధిని సాధించిందనే ప్రశంసలు వస్తే మాత్రం అది ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కాగితాలెక్కిన ఓఆర్ఆర్, శంషాబాద్ విమానాశ్రయాల పుణ్యమట. 24 గంటల కరెంటుకు చంద్రబాబు ఆద్యుడట. రేవంత్ ప్రభుత్వ హయాంలో గేట్లు బిగించి తప్పుడు అంచనాలతో సొరంగం తెరిచి రక్షణ గోడ విధ్వంసం జరిగితే మాత్రం దానికి కేసీఆర్ ప్రభుత్వం కారణమట! చెప్పేవారికి వినేవాళ్లు లోకువన్నట్టు ప్రభుత్వ పెద్దలు నోటికొచ్చినట్టు మాట్లాడుతూ పూట గడుపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుంకిశాల ఘటనపై గురువారం ప్రభుత్వ పెద్దల స్పందనే ఇందుకు నిదర్శనంగా చెప్తున్నారు. సుంకిశాల పాపం నిజంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనైతే మరి ఈ ప్రశ్నలకు సమాధానమేది?

- గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనుల వల్లనే ఈ ఘటన జరిగిందనుకుంటే, రిటెయినింగ్ వాల్ నిర్మాణం ఏడాది క్రితమే పూర్తయింది. ఆ తర్వాత కాలంలో ఘటన జరిగిన రోజు కంటే ఎక్కువ నీటిమట్టం నాగార్జునసాగర్‌లో కొన్ని నెలల పాటు ఉంది. అయినా చుక్క నీరు వాల్ వరకు ఎందుకు రాలేదు? అప్పుడు అది ఎందుకు కూలిపోలేదు?
- వారం రోజుల క్రితం సుంకిశాల ఘటన జరిగితే ‘నమస్తే తెలంగాణ’ కథనం వచ్చే వరకు ప్రభుత్వం ఎందుకు స్పందించలేదు?
- ఘటన జరిగిన రోజు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. నిజంగా ఇది బీఆర్ఎస్ పాపమే ఇది అయితే ప్రభుత్వ పెద్దలు అధికారికంగా అసెంబ్లీ వేదికగానే ఈ విషయాన్ని బయటపెట్టొచ్చు కదా! ‘నమస్తే తెలంగాణ’ బయటపెట్టిన తర్వాత ఈ విషయాన్ని ఎందుకు చెబుతున్నారు? అంటే బీఆర్ఎస్ పాపాన్ని ఏమైనా దాచాలనుకున్నారా? ఆ పార్టీని కాపాడాలనుకుంటున్నారా?
- ఘటన జరిగి వారం రోజులైనా జలమండలి ఉన్నతాధికారులుగానీ, ప్రభుత్వ పెద్దలుగానీ ప్రమాదంపై విచారణకు ఎందుకు ఆదేశించలేదు? ప్రతి అంశానికీ జ్యుడీషియల్ కమిటీ అంటూ ప్రకటనలు చేసే ప్రభుత్వ పెద్దలు దీనికి కమిటీ ఎందుకు వేయలేదు? ‘నమస్తే’ కథనం వచ్చిన తర్వాతనే మంత్రి పొన్నం ప్రభాకర్ దీనిపై విచారణ కమిటీ వేస్తున్నామని ఎందుకు ప్రకటించారు?
- మేడిగడ్డలో 280 పిల్లర్ల బరాజ్‌లో ఒక పిల్లర్ కుంగితేనే రాహుల్‌గాంధీని హెలిక్యాప్టర్‌లో తీసుకెళ్లి హడావుడి చేసిన కాంగ్రెస్ ఒకటికి ఐదుసార్లు. మీడియా పర్యటనలు ఏర్పాటు చేసిన మంత్రులు.. మరి, సుంకిశాల బీఆర్ఎస్ పాపమైతే 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న సుంకిశాలకు వారం రోజుల్లో పర్యటనలు ఏర్పాటు చేసి, హడావుడి ఎందుకు చేయలేదు?

గోప్యతలోనే ఉంది అసలు పాపం

సుంకిశాల బీఆర్ఎస్ పాపం అంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారు. కానీ ‘వారం రోజుల పాటు ప్రభుత్వం గోప్యత పాటించడం’తోనే అసలు పాపం ఎవరిదో తెలంగాణ సమాజం అర్థం చేసుకుంది. అంతేకాదు, గత ఎనిమిది నెలలుగా కమిటీలు, కమిషన్లు అంటూ ప్రకటనలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై ఎందుకు నోరు విప్పలేదనే ప్రశ్న కూడా తలెత్తుతున్నది.

బీఆర్ఎస్‌కు.. కాంగ్రెస్‌కు ఎంత తేడా?

- **మేడిగడ్డ ఘటనలో వాస్తవాలు వెల్లడించిన బీఆర్ఎస్ ప్రభుత్వం**
- **సుంకిశాల దుర్ఘటనను దాచే ప్రయత్నం చేసిన కాంగ్రెస్ సర్కార్**

మేడిగడ్డ ఘటన జరిగినపుడు బీఆర్ఎస్ ప్రభుత్వం స్పందించిన తీరు ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. ఘటన జరిగిన నిమిషాల వ్యవధిలోనే మీడియాకు సమాచారం ఇచ్చింది. తదుపరి ఎలాంటి ప్రమాదం జరగకుండా ఉండేందుకు బరాజ్‌పై రాకపోకలు నిలిపివేసింది. ఘటనపై బీఆర్ఎస్ ప్రభుత్వం వెంటనే స్పందించింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎల్అండ్‌టీ సంస్థతో అధికారికంగా ప్రకటన చేయించింది. వాస్తవాన్ని అందులో పొందుపరచడంతో పాటు ప్రభుత్వంపై భారం లేకుండా బరాజ్ పునరుద్ధరణ పనులు చేపడతామంటూ ఏజెన్సీ అందులో స్పష్టం చేసింది. ఒకవిధంగా ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి అది ప్రతికూల పరిణామం. అయినప్పటికీ విషయాన్ని దాచి పెట్టకుండా, జరిగిన వాస్తవాల్ని ప్రజల ముందు ఉంచింది. ఎక్కడా ఘటన జరగలేదంటూ గోప్యత పాటించలేదు. కానీ సుంకిశాల ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా వారం రోజుల పాటు గోప్యత పాటించింది. ‘నమస్తే తెలంగాణ’ వెలుగులోకి తెస్తే తప్పు జరిగిన వాస్తవాన్ని అంగీకరించలేదు. పైగా ఎదురుదాడికి ప్రయత్నిస్తున్నది.

రెండు ఘటనల వెనుక వైరుధ్యమిదీ..

మేడిగడ్డ ఘటన అనేది ఎవరూ ఊహించనిది. శబ్దం వచ్చే వరకు అది ఎవరికీ తెలియలేదు. కానీ సుంకిశాల ఘటన అలా కాదు. షిఫ్టు మార్పు అనేది ప్రాణనష్టం జరగకపోవడానికి ఒక కారణమైనప్పటికీ అదే పూర్తి కారణం కాదు. ‘నమస్తే తెలంగాణ’ ఇంకా లోతైన విచారణ చేసిన సందర్భంగా మరో వాస్తవం కూడా బయటపడింది. గేటు అమర్చి, సొరంగాన్ని పూర్తిగా ఓపెన్ చేసిన తర్వాత నీటి ఒత్తిడికి గేటు క్రమంగా వంగిపోవడం అనేది నెమ్మదిగా జరిగింది. ఆ విషయాన్ని ముందుగానే కార్మికులు, ఇంజినీర్లు పసిగట్టారు. ఈ క్రమంలో ముందుగా లీకేజీ ప్రారంభమైంది. దీంతో ఆరు గంటల షిఫ్టు ముగించుకొని కార్మికులు అందరూ వాహనంలో పంపుహౌస్ బయటికి వచ్చేశారు. షిఫ్టు ముగిసినప్పటికీ కొందరు అక్కడే ఉండడం, ఇతరులతో మాట్లాడుతుండడం చేయడం సహజం. కానీ లీకేజీ మొదలైనందున అది కుప్పకూలిపోతుందని పసిగట్టే కార్మికులతో పాటు టెక్నీషియన్లు, సైట్ ఇంజినీర్లు అందరూ బయటికి వచ్చేశారు. ఆ క్రమంలోనే కొందరు వాహనంలో పైకి వస్తూ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. అందుకే, బయటికొచ్చిన వీడియోలో ‘టూట్ గయా’ (విరిగిపోతుంది) అంటూ కార్మికులు అరవడం వినిపించింది. అంటే అది విరిగిపోనుందనే విషయం ముందుగానే పసిగట్టారు. నాసిరకం నిర్మాణమో, డిజైన్ లోపమో అయితే అనూహ్య ప్రమాదం జరగాలి. కానీ, వాల్ కూలిపోతున్నదని కార్మికులు ముందే గుర్తించారు. అంటే అంతకుముందు తమ కున్న చర్య (సొరంగం తెరవడం) వల్ల ఇది జరుగుతున్నదనే సంగతిని వారు పసిగట్టి జాగ్రత్తపడ్డారు. దీంతో మేడిగడ్డ మాదిరిగా ఇది అనుకోని ఘటన కాదు.

అసలేం జరిగిందంటే..

మొదటిపేజీ తరువాయి...


వరదతో నీటిమట్టం క్రమంగా పెరుగుతూ ఎలాంటి ఆధారంలేని గేటును తన్నుకుంటూ జలాలు రిటెయినింగ్ వాల్‌ను నిలువునా కుప్పకూల్చాయి. అయితే, ఈ నెపాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెట్టి వేసేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రయత్నించినప్పటికీ, కొన్ని గంటల వ్యవధిలో జలమండలి అధికారికంగా ఇచ్చిన వివరణతో అసలు నిజం ఏంటనేది తేలిపోయింది. ఈ నేపథ్యంలో వాస్తవంగా ఏం జరిగింది? సుంకిశాల లోగుట్టు ఏందని ఓసారి పరిశీలిస్తే..

జరగాల్సింది ఇదీ..

సుంకిశాల పథకంలో భాగంగా నాగార్జునసాగర్ జలాశయం ఫోర్‌షోర్ నుంచి పంపుహౌజ్ వరకు మూడు సొరంగ మార్గాలను నిర్మించారు. నాగార్జునసాగర్ నీటిమట్టాన్ని ప్రామాణికంగా తీసుకొని వీటిని తవ్వారు. ఇందులో కింది భాగంలోని సొరంగం 137 మీటర్ల వద్ద ఏర్పాటు చేశారు. దాని వ్యాసం 8 మీటర్లు అయినందున సొరంగం 137-145 మీటర్ల వరకు ఉంటుంది. అదేవిధంగా మధ్యస్థ సొరంగాన్ని 157 మీటర్ల వద్ద ప్రారంభించారు. దీని వ్యాసం కూడా 8 మీటర్లు అయినందున ఇది 157-165 మీటర్ల వరకు ఉంటుంది. దీనిపై మరో సొరంగాన్ని నిర్మించారు. నాగార్జునసాగర్‌లో నీటిమట్టం ఆధారంగా ఆయా సొరంగాలను ఓపెన్ చేసి, నీటిని పంపుహౌజ్‌లోకి తరలిస్తారు. అయితే నిర్మాణ సమయంలో మాత్రం సొరంగ మార్గాలను పూర్తిస్థాయిలో తవ్వరు. పంపుహౌజ్ నుంచి నాగార్జునసాగర్ జలాశయం వరకు ఉండే సొరంగ మార్గంలో జలాశయం వైపు మాత్రం కొంత భాగాన్ని తవ్వకుండా అలాగే ఉంచుతారు. దీని వల్లనే సాగర్‌లోని నీళ్లు సొరంగంలోకి రాకుండా ఉంటాయి. అన్ని పనులు పూర్తయిన తర్వాత, పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన తర్వాతనే ఈ సొరంగాన్ని ఓపెన్ చేస్తారు. కొన్ని సందర్భాల్లో నీళ్లలోనే పేలుళ్ల ద్వారా (వాటర్ బ్లాస్టింగ్) సొరంగంలో తవ్వని భాగాన్ని ఓపెన్ చేస్తారు. ముఖ్యంగా సొరంగంలో గేట్లు ఏర్పాటు చేసి, పంపుహౌజ్ స్లాబ్ వేసి.. ఆ స్లాబ్ నుంచి టైబీమ్స్‌ను గేటు వరకు ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా నీటి ఒత్తిడికి గేటు కదలకుండా టైబీమ్స్ అదిమి పడతాయి. అదేవిధంగా నాగార్జునసాగర్‌లో నీటిమట్టం అనుకూలంగా ఉన్నపుడు ఈ సొరంగ మార్గాలను ఓపెన్ చేయాలి.

జరిగింది ఇదీ...

పంపుహౌజ్‌లో మోటార్లు ఏర్పాటు చేసేందుకు కొన్నిరోజుల క్రితమే సివిల్ పనులు మొదలపెట్టారు. అందుకోసం భారీ క్రేన్‌తో పాటు వంద మందికిపైగా కార్మికులు పంపుహౌజ్‌లో నిత్యం పని చేస్తున్నారు. పంపుహౌజ్ స్లాబ్ పనులు పురోగతిలో ఉన్నాయి. గత నెలలో మధ్యస్థ సొరంగంలో గేటు అమర్చినప్పటికీ స్లాబ్ నుంచి టైబీమ్ ఇంకా నిర్మించలేదు. మరోవైపు నాగార్జునసాగర్‌కు ఎగువ నుంచి లక్షల క్యూసెక్కుల వరద మొదలైంది. ఈ సమయంలో సొరంగాన్ని ఓపెన్ చేయడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణం. మొత్తంగా చెప్పాలంటే ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువవడం, కృష్ణా ప్రవాహంపై తప్పుడు అంచనాలు, ప్రొటోకాల్ పాటించకపోవడం వంటి కారణాలతోనే సుంకిశాల ఘటన సంభవించిందని తేటతెల్లమైంది.



నీళ్లు నిండక ముందు పంప్ హౌస్(ఫైల్)



ప్రస్తుతం నీటితో నిండిపోయిన సుంకిశాల పంప్ హౌస్


‘సుంకిశాల’ మరో ఏడాది ఆగాల్సిందేనా?

అనాలోచిత నిర్ణయంతో వందల కోట్ల నష్టం! • ప్రత్యామ్నాయ చర్యల దిశగా మెట్రోబోర్డు

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 8: అతిత్వరగా జంటనగరాలకు నీరు అందించాలనే రేవంత్ సర్కారు తొందరపాటు నిర్ణయం.. ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయల నష్టాన్ని తేవడమేకాకుండా సుంకిశాల నీటి తరలింపును మరో ఏడాది వాయిదా వేసేలా చేసింది. నల్లగొండ జిల్లాలోని సుంకిశాల నుంచి కోదండపురం వరకు పైపులైన్ పనులు పూర్తి కావడంతో రెండు నెలల్లో ట్రయల్ రన్ చేసే దిశగా ప్రయత్నాలు ప్రారంభించగా.. అవి ఆదిలోనే విఫలమై, పంప్‌హౌస్ జల దిగ్బంధంలో చిక్కుకున్నది. ఏఎమ్మార్పీ నుంచి కాకుండా జంటనగరాలకు సాగర్ డెడ్ స్టోరేజీ నుంచి తాగునీరు అందించే పథకంలో భాగంగా పెద్దవూర మండల జయరాం తండా సుంకిశాల వద్ద రూ.2000 కోట్లతో పంప్‌హౌస్ పనులకు గత సంవత్సరం శ్రీకారం చుట్టారు. ఇక్కడి నుంచి కోదండపురం ప్లాంట్ వరకు మూడు పైపులైన్ల ద్వారా ఏఎమ్మార్పీతో సంబంధం లేకుండా నేరుగా సాగర్ నుంచే నీటిని తరలించేందుకు పనులు జరుగుతున్నాయి. పంప్‌హౌస్‌తోపాటు ఇన్‌టేక్ వెల్‌లో మూడు సొరంగ నిర్మాణపు పనులను ప్రారంభించారు. సాగర్ బ్యాక్ వాటర్ నుంచి మూడు లెవల్స్ ద్వారా నీటిని తీసుకునేందుకు మూడు సొరంగాలు తవ్వారు. మధ్య సొరంగానికి గేట్‌ను అమర్చి రిటైనింగ్ వాల్ ఏర్పాటుచేశారు. లోపలి భాగంలో టన్నెల్ ఇన్‌లెట్‌ను తెరవడంతో నీటి ఉధృతికి టన్నెల్ గేట్‌తోపాటు రక్షణ గోడ కూడా కుప్పకూలాయి. బయటి ప్రపంచానికి తెలియకుండా వారంపాటు పంప్‌హౌస్ పనులు నిలిపి వేసి ప్రత్యామ్నాయ చర్యల దిశగా అధికారులు అడుగులు వేస్తున్నా సాధ్యపడలేదు. బుధవారం జలమండలి సీజీఎం, డీఎం, డీజీఎం ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై కోదండపురం అతిథి గృహంలో చర్చించారు. ప్రస్తుతం పంప్‌హౌస్‌లో నీటిని తరలించే పరిస్థితి లేకపోవడంతో టన్నెల్‌కు పైభాగంలోనే పనులు చేయాల్సిన దుస్థితి వచ్చింది.

నిజాలను త్వరలోనే నిగ్గు తేల్చుతాం

- **సుంకిశాల పాపం బీఆర్ఎస్‌దే**
- **విరిగిపడ్డ గోడపై విచారణకు ఆదేశం**
- **మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్**
- **‘నమస్తే తెలంగాణ’ కథనంపై ఫైర్**



భీమదేవరపల్లి, ఆగస్టు8: విరిగిపడిన సుంకిశాల ప్రాజెక్టు గోడపై నిజాలను త్వరలోనే నిగ్గు తేల్చుతామని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం ‘నమస్తే తెలంగాణ’ దినపత్రికలో ప్రచురితమైన ‘విరిగిపడ్డ సుంకిశాల గోడ, తప్పిన పెను ప్రమాదం’ కథనంపై తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన మేరకు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా హైదరాబాద్‌కు నీళ్లు తీసుకొచ్చే ప్రక్రియలో భాగంగా హెచ్ఎండీఏ, మెట్రోవర్క్స్ అధికారులను విచారణకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. గోడ కూలిన పాపం బీఆర్ఎస్‌దేనని విమర్శించారు. ఒక వార్త రాసి ప్రజలను తప్పుదోవ పట్టించే యత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బట్టకాల్చి మీద వేసే ప్రయత్నం బీఆర్ఎస్ చేస్తున్నదని, తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. సుంకిశాలపై దర్యాప్తు ప్రాథమిక రిపోర్టు రాగానే ప్రజల ముందు ఉంచుతామని తెలిపారు.

అనూహ్య ప్రవాహంతోనే కూలిన గోడ

- **సొరంగం వద్ద నీటి ఒత్తిడి పెరిగి గేటు కూడా ధ్వంసం**
- **సైడ్‌వాల్ పునఃనిర్మాణానికి రూ.20 కోట్లు ఖర్చు అంచనా**
- **ఈ ఖర్చు నిర్మాణ సంస్థనే భరిస్తుంది**
- **పనులు 2 నెలలు ఆలస్యమవుతాయి**
- **ఘటనపై విచారణ కమిటీ**
- **‘సుంకిశాల’పై జలమండలి వివరణ**

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 08 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్‌లో అనూహ్యంగా నీటి ప్రవాహం పెరగడం వల్లనే సుంకిశాలలో టన్నెల్‌గేట్ ధ్వంసమైందని, సైడ్‌వాల్ కుప్పకూలిందని హైదరాబాద్ జలమండలి తెలిపింది. ఇప్పుడున్న నీటి లెవల్ తగ్గిన తరువాత సైడ్‌వాల్ పునఃనిర్మాణ పనులు చేపడతామని, ఇందుకు రూ.20 కోట్లు ఖర్చవుతుందని పేర్కొంది. ఈ ఖర్చును నిర్మాణ సంస్థనే భరిస్తుందని జలమండలి అధికారులు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే వేసవిలోగా హైదరాబాద్ జంటనగరాలకు తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో సుంకిశాల మిడిల్ టన్నెల్ పూర్తిచేయాలని నిర్ణయించామని తెలిపారు. రిజర్వాయర్‌కు వరద ఆలస్యంగా వస్తుందని, ఈ నెలాఖరులోగా మధ్య టన్నెల్ స్థాయికి నీటి స్థాయి పెరుగుతుందన్న అంచనాతో పనులు చేపట్టామని వివరించారు. వరద ప్రవాహం పెరిగేలోగా టన్నెల్‌కు అవసరమైన టై భీమ్‌లను పూర్తిచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని, అందులో భాగంగానే గత నెల 29, 30, 31 తేదీల్లో మధ్య సొరంగానికి గేట్‌ను అమర్చామని తెలిపారు. రిజర్వాయర్ వైపు ఉన్న మట్టిని తొలగించి, సివిల్ వర్క్స్ టీమ్‌లు సైడ్‌వాల్స్ మధ్య.. టై బీమ్ కనెక్టివిటీని కాస్టింగ్ చేసే పనిలో ఉండగా.. ఇంతలోనే సాగర్‌కు ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగిందని పేర్కొన్నారు. దాదాపు 3.5 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అకస్మాత్తుగా బ్యాక్‌క్లోజ్ వేవ్ యాక్షన్ పెరిగి నీళ్లు టన్నెల్లోకి తన్నుకువచ్చాయని వివరించారు. దీంతో టన్నెల్ గేటు ధ్వంసమై..దానికి అనుసంధానంగా ఉన్న సైడ్‌వాల్ కూలిపోయిందని, ఇదంతా ఐదు నిమిషాల స్వల్ప వ్యవధిలోనే జరిగిందని తెలిపారు. సైడ్‌వాల్ పొడవు 270 మీటర్లు. వెల్ లోపల నిర్మించిన మొత్తం గోడల పొడవు సుమారు 1020 మీటర్లు ఉండగా.. ఇందులో ప్రస్తుతం 50 మీటర్ల మేర గోడ కూలిందని పేర్కొన్నారు. ఈ పనులన్నీ 2022 జూలైలో ప్రారంభమై 2023లో పూర్తయ్యాయని తెలిపారు. సైడ్‌వాల్ మొత్తం పొడవులో.. మూడు బ్లాకుల్లో కేవలం మధ్యలో ఉన్న గేటు టన్నెల్ మాత్రమే కూలిందని, ఎదురుగా ఉన్న పంప్‌హౌస్ భాగం ఇప్పటికే సాగర్ లెవల్‌కు చేరుకున్నదని అధికారులు పేర్కొన్నారు.



60 శాతం పనులు పూర్తి

సుంకిశాల ప్రాజెక్టు పనులు 2021 జూలైలో ప్రారంభం కాగా.. ఇన్‌టేక్ వెల్ పనులు 2022 మార్చిలో, సైడ్‌వాల్ నిర్మాణ పనులు అదే ఏడాది జూలైలో మొదలుపెట్టామని వివరించారు. టన్నెల్ వైపున్న సైడ్‌వాల్స్ 2023 జూలైలోనే పూర్తి చేశామని తెలిపారు. 2023 డిసెంబరు నాటికి మొత్తం 4 సైడ్‌వాల్ బ్లాకుల్లో మూడు.. రిజర్వాయర్ పూర్తిస్థాయి ఎత్తు (180 మీటర్లు) వరకు పూర్తయ్యాయని తెలిపారు. సంపు ఫ్లోర్ లెవల్ 137 మీటర్లు ఉండగా.. ఈ కాలంలో 43 మీటర్ల నిర్మాణం పూర్తిచేశామని వివరించారు. ఈ ఏడాది జనవరి నాటికి నాలుగో సైడ్‌వాల్ బ్లాక్ పనులు రూఫ్ స్లాబ్ లెవల్ వరకు జరిగాయని, 2023 డిసెంబరు నాటికి అన్ని రకాల పనులు 60 శాతం పూర్తయ్యాయని తెలిపారు. సుంకిశాలలో సైడ్‌వాల్ కూలిన ఘటనపై జలమండలి ఈడీ సత్యనారాయణ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్‌తో విచారణ కమిటీని వేసినట్టు తెలిపారు.

20 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా

పంప్‌హౌస్‌లోకి నీటిని ఎత్తిపోయడానికి ప్రతిపాదించిన మూడు సొరంగాల పనులు 90శాతం పూర్తయ్యాయని జలమండలి అధికారులు తెలిపారు. ప్రత్యేక నైపుణ్య కార్మికులతో ఈ పనులు జరుగుతున్నాయని, నీటి లెవల్ తగ్గిన తర్వాత.. దెబ్బతిన్న సైడ్‌వాల్ పునఃనిర్మాణం చేపడతామని స్పష్టం చేశారు. దీనికి సుమారు 20 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశామని, ఈ మొత్తాన్ని సదరు నిర్మాణ సంస్థనే భరిస్తుందని తెలిపారు. ఇప్పటివరకు సుంకిశాల ప్రాజెక్టు ఇన్‌టేక్ వెల్ పనులు 60 శాతం, పంపింగ్ మెయిన్ పనులు 70 శాతం, ఎలక్ట్రో మెకానికల్ పనులు 40 శాతం పూర్తయ్యాయని తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

శుక్రవారం FRIDAY 9.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 65 ‖ వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

రూపాయీ.. జర భద్రం



రిజర్వ్ బ్యాంకుకే దడ పుట్టిస్తున్న దేశీయ కరెన్సీ

రూపీకి పోటీగా ట్రేడింగ్ పొజిషన్లు పెంచుకోవద్దు

బ్యాంకులపై ఆర్బీఐ ఒత్తిడి › 10

నీరజత చోప్రా



పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు సిల్వర్ మెడల్

జావెలిన్‌త్రోలో 89.45 మీటర్లతో రెండో స్థానం

› 11



మల్లన్నసాగర్‌లో కాళేశ్వర పరవళ్లు

కాళేశ్వర జలాలతో కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్ నింపాలంటూ బీఆర్‌ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు చేసిన హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చింది. సిద్దిపేట జిల్లా మల్లన్నసాగర్ ప్రాజెక్టులోకి గోదావరి పరవళ్లు మొదలయ్యాయి. గురువారం తుక్కాపూర్ పంప్‌హౌస్ నుంచి నాలుగు పంపులను ఆన్‌చేసి నీటిని ఎత్తిపోస్తున్నారు.

ఇద్దరు ఆటోడ్రైవర్ల బలవన్మరణం

ఉచిత బస్సుతో గిరాకీ లేక, కిస్తీలు చెల్లించలేక మనస్తాపం › 5

మేడ్చల్, కామారెడ్డి జిల్లాల్లో ఘటనలు

కాంగ్రెస్ మూల్యం చెల్లించక తప్పదు

టీఏటీయూ అధ్యక్షుడు మారయ్య

అప్పల బాధతో రైతు ఆత్మహత్య

మూడెకరాలున్నా అమ్ముకోలేని స్థితిలో ఉరేసుకుని బలవన్మరణం

నిజామాబాద్ జిల్లాలో ఘటన › 5

ఆస్తిపన్ను మోత మోగుడే!

జీహెచ్‌ఎంసీ చేపడుతున్న జీఐఎస్ సర్వే మతలబు ఇదే

- గత ప్రభుత్వ హయాంలోనే తెరపైకి వచ్చిన ప్రతిపాదన
- పేద, మధ్యతరగతిపై అదనపు భారం వద్దని తిరస్కరణ
- కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మళ్లీ తెరపైకి ప్రతిపాదన
- మరో 3 వేల కోట్ల పన్ను లక్ష్యంగా సర్కార్ గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి/సిటీబ్యూరో, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆస్తుల నుంచి వాటి కొలతల ప్రకారం పూర్తి పన్ను వసూలుకు రంగం సిద్ధమవుతున్నది. ఇప్పటివరకు తమ ఆస్తులను సెల్ఫ్ అసెస్‌మెంట్ (స్వీయ మదింపు) చేసుకొని పన్ను చెల్లిస్తున్న ఇండ్ల యజమానులు ఇకపై జీహెచ్‌ఎంసీ నిర్ణయించే మొత్తాన్ని చెల్లించాల్సి వస్తుంది. ఇందుకోసం నగరంలో జీఐఎస్ (జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం) సర్వే చేపట్టినట్టు తెలుస్తున్నది. ఇది కార్యరూపం దాలిస్తే హైదరాబాద్ మహానగరవాసులు అదనంగా మరో రూ.3000 కోట్లు చెల్లించాల్సి వస్తుంది. ఆస్తి పన్ను పెంపుదల ఉండదని హైదరాబాద్‌ను దేశంలో రోల్‌మాడల్‌గా నిలిపేందుకే ఈ సర్వే జరుపుతున్నామని అధికారులు చెప్తున్నప్పటికీ, దాని మర్మం ఆస్తి పన్నుల వసూళ్లను › 8వ పేజీలో



జీహెచ్‌ఎంసీ ప్రైవేటు ఏజెన్సీ ద్వారా చేపట్టిన జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్) సర్వేలో భవనాల వారీగా ఇలా మ్యాపింగ్, మార్కింగ్ చేస్తారు. టెక్నాలజీ సాయంతో డ్రోన్ ద్వారా ప్రతి నిర్మాణాన్ని కొలతలతో సహా లెక్కిస్తారు. గూగుల్ స్ట్రీట్‌మ్యాప్ ద్వారా ఎన్ని అంతస్తులనేది నిర్ధారిస్తారు. తర్వాత అన్నింటికీ కలిపి ఆస్తిపన్ను లెక్కగట్టి బిల్లు పంపిస్తారు.



మా ఇంట్ల చెత్తనే తీసుకుపోతలేరు

ఇంటికి చెత్త బండి కూడా రావటం లేదు

రోజువారీ చెత్త సేకరణ సరిగా లేదు

మేమూ ఇబ్బందులు పడుతున్నం › 8


జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

గ్రేటర్ హైదరాబాద్‌లో ఇంటింటి చెత్త సేకరణ నిర్వహణ సరిగా లేదు. రోజూవారీగా చెత్తను సేకరించటం లేదు. మా ఇంటికి సైతం చెత్తబండి రావటం లేదు. దాంతో మేమూ ఇబ్బందులు పడుతున్నాం.

- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

వక్ఫ్ ఆస్తుల్లో కేంద్రం జోక్యం!

- వివాదాస్పద భూముల్లో కలెక్టర్‌దే నిర్ణయం
- బోర్డుల్లో మహిళలు, ముస్లిమేతరులకు ప్రాతినిధ్యం
- వక్ఫ్ చట్టానికి సవరణలు ప్రతిపాదించిన కేంద్రం
- ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమన్న ప్రతిపక్ష పార్టీలు
- బిల్లును జేపీసీకి పంపేందుకు అంగీకరించిన కేంద్రం



లోక్‌సభలో మాట్లాడుతున్న ఒవైసీ, అఖిలేశ్ యాదవ్

న్యూఢిల్లీ, ఆగస్టు 8: మోదీ ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి సవరణలు ప్రతిపాదించడం ద్వారా మరో వివాదానికి తెరలేపింది. దేశవ్యాప్తంగా ఉన్న వక్ఫ్ బోర్డుల అధికారాలు, వాటి పనితీరులో మార్పులు చేస్తూ వక్ఫ్ చట్టం 1995కు ప్రభుత్వం సవరణలు ప్రతిపాదించింది. లోక్‌సభలో గురువారం మైనార్టీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు ఈ సవరణలను ప్రతిపాదించారు. వక్ఫ్ పాలకవర్గాల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచుతూ, పాలనలో మహిళల భాగస్వామ్యాన్ని తప్పనిసరి చేస్తూ కొత్త బిల్లును తెచ్చారు. 1995 నాటి వక్ఫ్ చట్టానికి దాదాపు 40 సవరణలను ప్రతిపాదించారు. వక్ఫ్ యాక్ట్, 1995 పేరును 'యునిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫికసీ అండ్ డెవలప్‌మెంట్ యాక్ట్, 1995'గా మార్చుతున్నట్టు బిల్లులో పేర్కొన్నారు. వక్ఫ్ ఆస్తులను నియంత్రించే అధికారాలను కేంద్ర ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్లకు దఖలుపరిచే విధంగా సవరణలు ప్రతిపాదించడం వివాదాస్పదమైంది. అంతేకాకుండా మహిళలతోపాటు, ముస్లిమేతరులకు వక్ఫ్‌బోర్డుల్లో ప్రాతినిధ్యం కల్పించే ప్రతిపాదనపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ బిల్లును ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దీంతో కొంత వెనక్కు తగ్గిన కేంద్ర ప్రభుత్వం బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపేందుకు అంగీకరించింది. కాగా, ముసల్మాన్ వక్ఫ్ చట్టం-1923ను రద్దు చేస్తూ, కేంద్రం మరో బిల్లును సభ ముందుకు తీసుకొచ్చింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ, 'వక్ఫ్ చట్టం-1995 వచ్చాక, ముసల్మాన్ వక్ఫ్ యాక్ట్-1923 దాని ఉనికిని కోల్పోయింది. ఈ చట్టం అవసరం లేదు' అని అన్నారు.

క్రూరమైన చట్టం: విపక్షాలు

వక్ఫ్ బిల్లును తీసుకురావటంపై లోక్‌సభలో విపక్షాలు మండిపడ్డాయి. ప్రతిపాదిత చట్టాన్ని క్రూరమైందిగా పేర్కొన్నాయి. రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించాయి. ఆర్టికల్ 14, 15, 25ను ఈ బిల్లు ఉల్లంఘిస్తున్నదని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. ఇది వివక్షాపూరితమైనదని, రాజ్యాంగ మౌలిక స్వరూపంపై దాడిచేయడమేనని పేర్కొన్నారు. బీజేపీ మద్దతుదారులను సంతోషపరిచేందుకు వక్ఫ్ బిల్లును తీసుకొచ్చారని సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ అన్నారు. వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులకు చోటు కల్పించటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. బిల్లును వ్యతిరేకిస్తున్నట్టు సమాజ్‌వాదీ, ఎన్సీపీ (శరద్‌పవార్ పార్టీ), ఏఐఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలు ప్రకటించాయి. మోదీ సర్కార్ మత స్వేచ్ఛను ఉల్లంఘిస్తున్నదని కాంగ్రెస్ ఆరోపించింది. వివిధ రాష్ర్టాల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వక్ఫ్ బిల్లును తీసుకొచ్చారని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ ఆరోపించారు.

రాజకీయాల కోసమే వ్యతిరేకిస్తున్నాయి : కిరణ్ రిజిజు

విపక్ష సభ్యుల ఆందోళనపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ, వక్ఫ్ బిల్లుతో ఏ మత సంస్థ స్వేచ్ఛకూ భంగం వాటిల్లదని చెప్పారు. వక్ఫ్ సవరణ బిల్లుపై పునఃపరిశీలన కోసం సంయుక్త పార్లమెంట్ కమిటీకి పంపుతూ సిఫారసు చేస్తున్నామని, కేవలం రాజకీయాల కోసమే విపక్షాలు బిల్లును వ్యతిరేకిస్తున్నాయని కేంద్ర మంత్రి అన్నారు. కేవలం పార్టీ నుంచి వస్తున్న ఒత్తిడితోనే కొంతమంది ఎంపీలు బిల్లును వ్యతిరేకిస్తున్నారని అన్నారు. వక్ఫ్ బోర్డులు మాఫియా చేతిలోకి వెళ్లిపోయాయని చాలామంది ఎంపీలు తనకు వ్యక్తిగతంగా తెలియజేశారని అన్నారు.

వక్ఫ్ అంటే ఏమిటి?

ఇస్లామిక్ చట్టం ప్రకారం కేవలం మతపరమైన లేదా స్వచ్ఛంద సేవాపరమైన కార్యక్రమాల కోసం కేటాయించిన ఆస్తిని వక్ఫ్ అని అంటారు. ఒకసారి ఏదైనా ఆస్తిని వక్ఫ్‌గా ప్రకటించిన తరువాత ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకొనే అవకాశం ఉండదు. దేశవ్యాప్తంగా ఉన్న 30 వక్ఫ్ బోర్డుల పరిధిలో రూ.1.2 లక్షల కోట్ల విలువైన తొమ్మిది లక్షల ఎకరాల భూములు ఉన్నాయి. రైల్వేలు, రక్షణశాఖ అనంతరం దేశంలో అత్యధిక స్థాయిలో భూములున్న మూడో సంస్థగా వక్ఫ్‌బోర్డు నిలుస్తున్నది.



వక్ఫ్ చట్టానికి కేంద్రం ప్రతిపాదించిన సవరణల్లో ముఖ్యమైనవి..


1. **వక్ఫ్ చట్టంలోని వివాదాస్పద సెక్షన్ 40 తొలగింపు:** ఏవైనా ఆస్తులు వక్ఫ్ ఆస్తులా కాదా అని నిర్ధారించేందుకు బోర్డుకు అధికారాలు కల్పిస్తున్న సెక్షన్ 40ని తొలగించాలని కేంద్రం ప్రతిపాదించింది. 1995 నాటి వక్ఫ్ చట్టానికి 2013లో చేసిన సవరణ ప్రకారం.. ఏదైనా ఆస్తి వక్ఫ్ బోర్డుకు చెందుతుందా లేదా?, ఏదైనా ఆస్తి సున్నీ వక్ఫ్‌కు చెందుతుందా లేక షియా వక్ఫ్‌కు చెందుతుందా అని నిర్ణయించే అధికారాన్ని వక్ఫ్‌బోర్డుకు దఖలుపరిచారు. ఇటువంటి కేసులో బోర్డు ముందుగా నోటీసులు జారీచేసి, విచారణ జరిపి, ఆపై సరైన నిర్ణయం తీసుకుంటుంది. ఈ నిర్ణయంతో విభేదించే వారు ట్రిబ్యునల్‌కు వెళ్లవచ్చు. అక్కడి నుంచి వచ్చేదే తుది తీర్పు.
2. **మధ్యవర్తిగా జిల్లా కలెక్టర్:** ఈ బిల్లు చట్ట రూపం దాలిస్తే వక్ఫ్ ఆస్తుల ధ్రువీకరణ తప్పనిసరి అవుతుంది. దేశంలోని వక్ఫ్‌బోర్డులన్నీ తమ పరిధిలోని ఆస్తుల ధ్రువీకరణ, పర్యవేక్షణ కోసం వాటిని జిల్లా అధికార యంత్రాంగం వద్ద రిజిస్టర్ చేయాలి. ఏదైనా వివాదం ఏర్పడినప్పుడు సదరు భూమి ప్రభుత్వానిదా లేక వక్ఫ్‌బోర్డుదా అన్న విషయాన్ని తేల్చేందుకు జిల్లా కలెక్టర్ మధ్యవర్తిగా వ్యవహరిస్తారు. 1995 నాటి చట్టం ప్రకారం ఇటువంటి వివాదాలపై వక్ఫ్ ట్రిబ్యునల్ నిర్ణయం తీసుకునేది. జిల్లా కలెక్టర్/ మేజిస్ట్రేట్ వక్ఫ్‌బోర్డుల ఆదాయాన్ని పర్యవేక్షిస్తారు.
3. **వివాదాస్పద భూముల పునఃధ్రువీకరణ:** వివాదాస్పద భూముల యాజమాన్యం, నిర్వహణపై స్పష్టత వచ్చే విధంగా.. వాటిపై తప్పనిసరిగా పునఃధ్రువీకరణ జరగాలి. ప్రతిపాదిత సవరణ ద్వారా ఏదైనా వక్ఫ్ ఆస్తిపై ఆడిట్ చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి దక్కుతుంది. కాగ్ నియమించే ఆడిటర్ ద్వారా సదరు ఆస్తిని తనిఖీ చేయవచ్చు.
4. **వక్ఫ్‌బోర్డులో మహిళలు, ముస్లిమేతరులు:** కేంద్ర వక్ఫ్ మండలి, రాష్ట్రాల వక్ఫ్‌బోర్డుల్లో మహిళలకు, ముస్లిమేతరులకు భాగస్వామ్యం. స్టేట్ బోర్డులతోపాటు సెంట్రల్ కౌన్సిల్లో ఇద్దరు మహిళలకు చోటు కల్పించాల్సి ఉంటుంది.
5. **బోహ్రాలు, ఆగాఖనీలకు ప్రత్యేకంగా ఔఖాఫ్ బోర్డు:** ముస్లింలలోని షియా, సున్నీ, బోహ్రా, ఆగాఖని, ఇతర వెనుకబడిన వర్గాల వారికి కూడా బోర్డుల్లో ప్రాతినిధ్యం కల్పించాలి. బోహ్రాలు, ఆగాఖనీలకు ప్రత్యేకంగా ఔఖాఫ్ బోర్డును ఏర్పాటుచేయాలి.

లోక్‌సభలో రాహుల్ కునుకు

- వక్ఫ్ బిల్లుపై వాడీవేడిగా చర్చ జరుగుతుండగా ఎంచక్కా నిద్రపోయిన ప్రతిపక్ష నేత
- ఎగతాళి చేసిన కేంద్ర మంత్రి, ఎంపీలు



న్యూఢిల్లీ, ఆగస్టు 8: పార్లమెంట్ సమావేశాల సందర్భంగా గురువారం లోక్‌సభలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. వక్ఫ్ సవరణ బిల్లుకు సంబంధించి లోక్‌సభలో ఒక పక్క వాడీవేడిగా చర్చలు జరుగుతుండగా, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కునుకు తీస్తూ కన్పించారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. చర్చ సందర్భంగా రాహుల్ అలా నిద్రపోవడాన్ని పార్లమెంటరీ వ్యవహారాలు, మైనారిటీ శాఖ మంత్రి కిరణ్ రిజిజు, బీజేపీ ఎంపీ గిరిరాజ్‌సింగ్ ఎగతాళి చేశారు. పదేపదే మాట్లాడుతూ తోటి సభ్యుని నిద్రకు భంగం కలిగించకండి అంటూ రిజిజు చమత్కరించారు. మైనారిటీలకు సంబంధించిన ముఖ్యమైన సవరణ బిల్లుపై చర్చ జరుగుతుంటే బాధ్యత గల విపక్ష నేతకు ఇది తగునా? అని పలువురు సామాజిక మాధ్యమాల్లో ప్రశ్నించారు. ప్రజల కోసం సభలో నిద్రపోతూ కష్టపడుతున్న మన ప్రియతమ రాహుల్ గాంధీని చూడండి అంటూ ఒకరు, రాహుల్ గాంధీ శక్తి సామర్థ్యాలు ఏంటో ప్రజలకు తెలియాలంటే ఈ వీడియోను తప్పక షేర్ చేయాల్సిందేనని మరొకరు వ్యాఖ్యానించారు.



రాజ్యసభ చైర్మన్ వాకౌట్!

న్యూఢిల్లీ: గురువారం రాజ్యసభలో విపక్ష సభ్యులకు, సభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్‌కు మధ్య మాటల యుద్ధం కొనసాగింది. టీఎంసీ, ఇతర విపక్ష ఎంపీల తీరుపై చైర్మన్ ధన్‌కర్ మండిపడ్డారు. సభను నడుపలేనంటూ తన సీట్లో నుంచి లేచి వెళ్లిపోయారు. భారత రెజ్లర్ వినేశ్ ఒలింపిక్స్‌లో అనర్హత వేటుకు గురైన అంశాన్ని విపక్ష నాయకుడు మల్లిఖార్జున్ ఖర్గే లేవనెత్తగా, ధన్‌కర్ చర్చకు అనుమతించలేదు. టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్, చైర్మన్ ధన్‌కర్ మధ్య కొంతసేపు మాటల యుద్ధం నడిచింది. సభ నుంచి బయటకు పంపుతానంటూ ఒబ్రెయిన్‌ను చైర్మన్ హెచ్చరించారు. దీంతో విపక్ష సభ్యులంతా లేచి నిలబడి గట్టిగా నినాదాలు చేయటంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడింది.



స్పీకర్ హక్కులపై అఖిలేశ్, షా మధ్య వాగ్వాదం

న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ హక్కులపై గురువారం సభలో సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మధ్య వాగ్వాదం జరిగింది. వక్ఫ్ బిల్లుపై చర్చ సందర్భంగా అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ, 'లోక్‌సభ స్పీకర్ హక్కులు, మా హక్కుల్ని ఇక్కడ కాలరాస్తున్నారు. ప్రజాస్వామ్యానికి న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్న మీ (లోక్‌సభ స్పీకర్) హక్కుల్ని హరిస్తుంటే, మేం మీ తరపున పోరాడాల్సి వస్తున్నది' అని అన్నారు. ఆ వెంటనే అమిత్ షా కలుగజేసుకొని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సభాపతిని కించపరుస్తున్నారంటూ అఖిలేశ్‌పై మండిపడ్డారు. డొంకతిరుగుడుగా మాట్లాడొద్దని అన్నారు. స్పీకర్ హక్కులకు విపక్షాలు పరిరక్షకులు కారంటూ వ్యాఖ్యానించారు.

'పంటలకు ఎమ్మెస్పీ అమలుచేయాలి'

న్యూఢిల్లీ, ఆగస్టు 8: రైతుల పంటలను ఎమ్మెస్పీ రేట్లకు కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టాలని, రైతులకు న్యాయం చేయాలని విపక్ష ఎంపీలు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. టీఎంసీ, ఆర్జేడీ, ఎన్సీపీ (శరద్‌పవార్), శివసేన (యుబీటీ), ఇతర ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో గురువారం నిరసనకు దిగారు. కూరగాయలతో కూర్చిన దండను మెడలో వేసుకున్న విపక్ష ఎంపీలు పార్లమెంట్ మకర ద్వారం మెట్ల వద్ద ఆందోళన చేపట్టారు. 'ఎన్డీయే మిత్ర పక్షాలు టీడీపీ, జేడీయూలకు కేంద్రం ఎలాగైతే కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) ఇచ్చిందో, దేశంలోని రైతులకు కూడా ఎమ్మెస్పీ అమలుజేయాలి' అని శివసేన (యుబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది డిమాండ్ చేశారు.

తెలంగాణలో పెరిగిన అటవీ విస్తీర్ణం

దేశంలో గత పదేండ్లలో 1,700 చ.కి.మీ తగ్గిన అటవీ భూమి

న్యూఢిల్లీ, ఆగస్టు 8: దేశంలో గత 10 ఏండ్లలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు 1,700 చదరపు కిలోమీటర్లకు పైగా అటవీ ప్రాంత భూమిని కోల్పోయామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అయితే తెలంగాణ, మరికొన్ని రాష్ర్టాల్లో అటవీ ప్రాంత విస్తీర్ణం పెరిగినట్టు పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ వెల్లడించారు. అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, నాగాలాండ్, మిజోరాం, మేఘాలయ రాష్ర్టాల్లో అటవీ విస్తీర్ణం తగ్గిందని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం ఫలితంగానే రాష్ట్రంలో పచ్చదనం భారీగా పెరిగినట్టు కేంద్రం ప్రకటన ద్వారా స్పష్టమవుతున్నది.



చంద్రుడిపై లైఫ్ బ్యాంక్

ఫ్లోరిడా, ఆగస్టు 8: అంతరించిపోతున్న దశలో ఉన్న 10 లక్షల జాతులు జీవరాశులను బతికించాలన్న ఉద్దేశంతో శాస్త్రవేత్తలు చంద్రుడిపై లైఫ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని సంకల్పించారు. చంద్రుడిపై ఆవాసం ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో.. భూమిపై ప్రమాదంలో ఉన్న జీవాల కణాలను చంద్రుడిపైకి తరలించి, వాటిని రక్షించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా డీఎన్‌ఏ, విత్తనాలు, కణాలు, కణజాలాలను ద్రవ నైట్రోజన్‌ను ఉపయోగించి ఘనీభవింపజేసి.. చంద్రుడిపైకి తరలిస్తారు. చంద్రుడి ఉపరితలంపై ఎలాగూ ఉష్ణోగ్రత -180 డిగ్రీల నుంచి -230 డిగ్రీలు ఉంటుంది. కాబట్టి జీవ పదార్థాలు భద్రంగా ఉంటాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

ఫిబ్రవరి వరకు ఐఎస్‌ఎస్‌లోనే సునీతా విలియమ్స్!

వాషింగ్టన్, ఆగస్టు 8: అమెరికా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌ల అంతరిక్ష ప్రయాణం.. అనుకోని ఆటంకాలను ఎదుర్కొంటున్నది. తొలుత 8 రోజులు అనుకున్న ఈ మిషన్.. చివరికి 8 నెలలకు దాకా ఎటూ తేలేట్టు కనపడటం లేదు. ఇద్దరు వ్యోమగాముల్ని 2025 ఫిబ్రవరిలో భూమి మీదకు తీసుకొచ్చేందుకు రకరకాల ఆప్షన్లను నాసా ఆలోచిస్తున్నదట! ఈ ఏడాది జూన్‌లో బోయింగ్ కంపెనీకి చెందిన 'స్టార్ లైనర్' రాకెట్ ద్వారా వ్యోమగాములను అంతరిక్షంలోని అంతర్జాతీయ స్పేస్ స్టేషన్ (ఐఎస్‌ఎస్)కు పంపింది. . అయితే స్టార్ లైనర్‌లో హీలియం లీకేజ్ కారణంగా ప్రొపెల్షన్ సిస్టంలో సమస్యలు తలెత్తాయి. దీంతో వారి తిరుగు ప్రయాణం నిలిచిపోయింది.

26న స్పేస్ ఎక్స్ 'పోలారిస్ డాన్' ప్రయోగం

వాషింగ్టన్, ఆగస్టు 8: ప్రైవేట్ రంగ అంతరిక్ష సంస్థ 'స్పేస్-ఎక్స్' ఆగస్టు 26న చరిత్రాత్మక ప్రయోగాన్ని చేపట్టబోతున్నది. పొలారిస్ డాన్‌గా పేర్కొంటున్న ఈ మిషన్‌లోని వ్యోమగాములు అంతరిక్షంలో 'స్పేస్ వాక్' చేయనున్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని దాటి.. భూమికి దాదాపు 700 కిలోమీటర్ల ఎత్తులోకి వ్యోమగాముల్ని తీసుకెళ్తారు. అపోలో మిషన్ తర్వాత మరే ప్రాజెక్ట్‌లోనూ మానవులను ఇంత ఎత్తుకు తీసుకెళ్లలేదు. అంతేగాక, అపోలో తర్వాత ఓ ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్పేస్ వాక్ చేపట్టనుండటం ఇదే తొలిసారి. ఈ విషయాన్ని ఆ ప్రాజెక్ట్ బృందం సోషల్ మీడియా 'ఎక్స్'లో తాజాగా వెల్లడించింది.

నానమ్మ ఇంటినే కూల్చేసిన కిమ్

ప్యాంగ్యాంగ్: ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ తన సవతి బామ్మ కిమ్ సోంగ్ ఆయే నివసించిన భారీ భవంతిని నేలమట్టం చేయించారు. ఈ రాజ భవనాన్ని నిర్వహించేందుకు అవసరమైనంత సొమ్ము లేకపోవడమే దీనికి కారణమని చెప్తున్నారు. అయితే వీరిద్దరికీ పొసగేది కాదని కూడా అంటున్నారు. ఆమె భర్త 1994లో మరణించిన తర్వాత ఆమెను గృహ నిర్బంధంలో 2014లో మరణించారు. ఆమె నివసించిన రాజప్రాసాదాన్ని కిమ్ జోంగ్ ఉన్ నేలమట్టం చేయడంలోని ఆంతర్యమేమిటో తెలియడం లేదని పరిశీలకులు అంటున్నారు. విల్లాలను కూల్చేయడం ఈ రాజ వంశానికి కొత్త కాదని వారు పేర్కొంటున్నారు.

కర్ణాటక సీఎం, డిప్యూటీ సీఎంలకు సమన్లు

బెంగళూరు, ఆగస్టు 8: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్‌లకు బెంగళూరు కోర్టు గురువారం సమన్లు జారీ చేసింది. ఈ నెల 29న వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని ఆదేశించింది. జూన్ 2022లో కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాకు సంబంధించిన కేసులో కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. రాహుల్ గాంధీని ఈడీ మాటిమాటికీ ప్రశ్నిస్తున్నదని.. ఇది అనవసరంగా వేధించడమేనని ఆరోపిస్తూ జరిగిన ఆనాటి ధర్నాలో సిద్ధరామయ్య, శివకుమార్ పాల్గొన్నారు. ఈ ధర్నాపై నిషేధం ఉన్నా కాంగ్రెస్ నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. దీని వల్ల ప్రజల శాంతికి భంగం కలిగిందన్న ఆరోపణలపై విల్సన్ గార్డెన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

సుప్రీంకోర్టులో నేడు సినిమా ప్రదర్శన

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, ఇతర సిబ్బంది కుటుంబాల కోసం శుక్రవారం 'లాపతా లేడీస్' సినిమాను సుప్రీంకోర్టులో ప్రదర్శిస్తారు. స్త్రీ, పురుష సమానత్వాన్ని చాటి చెప్పే ఈ చిత్రాన్ని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ సహ ఇతర న్యాయమూర్తులు, రిజిస్ట్రీ అధికారులు, బాలీవుడ్ ప్రముఖులు అమీర్ ఖాన్, కిరణ్ రావు కూడా వీక్షిస్తారు.




యూట్యూబ్ చూసి బాంబు తయారుచేసిన పిల్లలు

పేలడంతో ఐదుగురికి గాయాలు

పాట్నా: బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలో ఐదుగురు బాలలు యూట్యూబ్ చూసి బాంబు తయారు చేయడం నేర్చుకున్నారు. అగ్గిపుల్లల నుంచి గన్‌పౌడర్‌ను సేకరించి, ఓ టార్చిలైట్‌లో పోశారు. అనంతరం ఓ బ్యాటరీని అనుసంధానం చేసి, టార్చిలైట్‌ను స్విచాన్ చేశారు. దీంతో అది వెంటనే పేలింది. ఈ దుర్ఘటనలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడగా, నలుగురు బాలలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరందరికీ గయాఘాట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయిస్తున్నారు..

బుద్ధదేవ్ కన్నుమూత

- వృద్ధాప్య సమస్యలతో తుదిశ్వాస విడిచిన బెంగాల్ మాజీ సీఎం
- బెంగాల్‌లో పరిశ్రమలకు బాటలుపరిచిన వామపక్ష నేత



కోల్‌కతా, ఆగస్టు 8: బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం సీనియర్ నేత బుద్ధదేవ్ భట్టాచార్య (80) కన్నుమూశారు. కొంతకాలంగా అస్వస్థతతో ఉన్న ఆయన వృద్ధాప్య కారణాలతో గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, లింగమార్పిడి చేసుకున్న కుమార్తె (ప్రస్తుతం కుమారుడు) సుచేతన ఉన్నారు. భట్టాచార్య తన మృతదేహాన్ని వైద్య పరిశోధనలకు దానం చేశారు. దీంతో ఆయనకు అభిమానులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు నివాళి అర్పించిన అనంతరం శుక్రవారం ఆయన పార్థివ దేహాన్ని దవాఖానకు అప్పగిస్తామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీమ్ తెలిపారు. సుదీర్ఘ కాలం బెంగాల్ ముఖ్యమంత్రిగా చేసిన జ్యోతిబసు అనంతరం 2000లో ఆయన నుంచి పార్టీ పగ్గాలు చేపట్టిన బుద్ధదేవ్ పార్టీని ఎన్నికల్లో గెలిపించి రెండు సార్లు ముఖ్యమంత్రిగా చేశారు. పరిశ్రమల స్థాపనకు వ్యతిరేకి అని పార్టీపై పడిన ముద్రను చెరిపేయడానికి ఆయన అనేక సంస్కరణలు చేపట్టి పారిశ్రామికీకరణను ప్రోత్సహించారు. పదవిలో ఉన్నప్పుడు, లేనప్పుడు కూడా ఆయన అత్యంత నిరాడంబర జీవితం గడిపారు. బెంగాల్‌లో 34 ఏండ్ల వామపక్ష శకం ముగిసి 2011 అసెంబ్లీ ఎన్నికల్లో మమతా బెనర్జీ అధికారం చేపట్టిన తర్వాత ఆయన చిన్న అపార్ట్‌మెంట్‌కే పరిమితం అయ్యారు. చాలా అరుదుగా ప్రజలకు దర్శనమిచ్చేవారు. కాగా, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆయన గృహానికి వెళ్లి మృతదేహానికి నివాళి అర్పించారు. రాజకీయ రంగంలో అవిశ్రాంతంగా పోరాడారని, పార్టీకి, ప్రజలకు ఆయన చేసిన సేవలు మరువరానివని అన్నారు. అలాగే భట్టాచార్య మృతికి ప్రధాని నరేంద్ర మోదీ, గవర్నర్ సీవీ ఆనంద్ బోస్, బీజేపీ నేత సువేందు అధికారి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

బుద్ధదేవ్ మృతి పట్ల హరీశ్ రావు సంతాపం

హైదరాబాద్, ఆగస్టు 8 (నమస్తే తెలంగాణ): బుద్ధదేవ్ భట్టాచార్య మృతి పట్ల మాజీ మంత్రి టీ హరీశ్ రావు విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి, పశ్చిమ బెంగాల్ ప్రజలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బెంగాల్ రాష్ర్టానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఎంతో అంకితభావంతో కృషి చేశారని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

సీపీఎం రాష్ట్ర కమిటీ నివాళి

బుద్ధదేవ్ భట్టాచార్య(80) మృతి పట్ల సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సంతాపం ప్రకటించింది. గురువారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో ఆయన చిత్రపటానికి సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. 2000 నుంచి 2011 వరకు ముఖ్యమంత్రిగా పశ్చిమబెంగాల్‌కు సేవలందించారని వివరించారు. యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడానికి, పరిశ్రమలను నెలకొల్పడానికి కృషి చేశారన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నరసింహారావు, జాన్‌వెస్లీ, టి సాగర్, పి ప్రభాకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు జె బాబురావు, ప్రజా సంఘాల నాయకులు కోట రమేష్, మూడ్ శోభన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బంగ్లా ప్రభుత్వాధినేతగా యూనస్ ప్రమాణం

- 16 మందితో సలహామండలి
- విద్యార్థి నేత నహీద్‌కు చోటు



ఢాకా, ఆగస్టు 8: బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ అడ్వయిజర్‌గా నోబెల్ బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇది ప్రధాని పదవితో సమానమని అధికారులు ప్రకటించారు. అధ్యక్షుడు మహమ్మద్ షాబుద్దీన్ ఆయనతో ప్రమాణం చేయించారు. ప్రభుత్వ వ్యవహారాలను నిర్వహించడానికి 16 మంది సభ్యులతో సలహా మండలిని ప్రకటించారు. ఇందులో విద్యార్థి ఉద్యమానికి నేతృత్వం వహించిన మహ్మద్ నహీద్ ఇస్లామ్, ఆసిఫ్ మహమ్మద్‌లకు కూడా స్థానం కల్పించారు. ప్రస్తుతం దేశంలో శాంతిని నెలకొల్పి పౌరులకు రక్షణ కల్పించడమే తమ తొలి ప్రాధాన్యమని 84 ఏండ్ల యూనస్ తెలిపారు.

హసీనా తిరిగి బంగ్లాదేశ్‌కు వస్తారు: కుమారుడు సజీబ్

అల్లర్లు, అస్థిరతతో అట్టుడుకుతున్న బంగ్లాదేశ్‌లో పరిస్థితులు సద్దుమణిగి, ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరిగిన తర్వాత మాజీ ప్రధాని షేక్ హసీనా తిరిగి స్వదేశానికి చేరుకుంటారని ఆమె కుమారుడు సజీబ్ వాజీద్ జాయ్ పేర్కొన్నారు. ప్రస్తుతం చోటుచేసుకున్న హింసను మరింత రెచ్చగొట్టడానికి పాకిస్థాన్ నిఘా వ్యవస్థ ఐఎస్‌ఐ మరింత ఆజ్యం పోస్తున్నదని ఆయన మండిపడ్డారు. ఆయన గురువారం పీటీఐతో మాట్లాడుతూ తన తల్లి హసీనా తప్పక బంగ్లాదేశ్‌కు తిరిగి వస్తారని పేర్కొన్నారు. అయితే ఆమె రాజకీయాల నుంచి నిష్క్రమించిన నేతగా వస్తారో, క్రియాశీలక నేతగా వస్తారో ఇంకా నిర్ణయించలేదని అన్నారు. షేక్ ముజీబ్ కుటుంబం ఎన్నడూ దేశ ప్రజలను వదిలి వెళ్లదని, ప్రస్తుత పరిస్థితులతో అవాక్కయి ఉన్న అవామీ లీగ్ పార్టీని అనాథలా వదిలేయరని ఆయన స్పష్టం చేశారు. బంగ్లాపై అంతర్జాతీయ సమాజ అభిప్రాయాన్ని సేకరించడమే కాక, బంగ్లాలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు భారత ప్రధాని మోదీ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. బంగ్లాదేశ్ మరో అఫ్ఘనిస్థాన్‌లా అరాచక దేశంగా మారకుండా చూడాలని మధ్యంతర ప్రభుత్వాన్ని నిర్వహిస్తున్న మహమ్మద్ యూనస్‌ను కోరారు.

కోర్టుకెక్కిన దెయ్యం!

తలపట్టుకున్న జడ్జి!

లక్నో: అవును, నిజం! ఓ భూ వివాదంలో దెయ్యం కోర్టుకెక్కింది. ఓ కుటుంబంలోని ఐదుగురిని న్యాయస్థానానికి లాగింది. ఉత్తర ప్రదేశ్‌లోని కుషీనగర్‌లో జరిగిన ఈ ఘటన అటు న్యాయ వ్యవస్థను, ఇటు పోలీసు వ్యవస్థను అయోమయానికి గురిచేసింది. ఓ భూ తగాదా విషయంలో 2011లోనే చనిపోయిన శబ్ద్‌ప్రకాశ్ 2014లో ఓ కుటుంబంలోని ఐదుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ప్రకాశ్ వాంగ్మూలం కూడా రికార్డు చేశారు. అనంతరం కేసు అలహాబాద్ హైకోర్టుకు చేరింది. పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నిందితులుగా ఉన్న పురుషోత్తం సింగ్, ఆయన ఇద్దరు సోదరులు, ఇద్దరు కుమారులు ఈ చార్జ్‌షీట్‌ను సవాలు చేశారు. కేసు విచారణ సందర్భంగా వారి తరపు న్యాయవాది.. శబ్ద్ ప్రకాశ్ 2011లోనే చనిపోయాడంటూ డెత్ సర్టిఫికెట్‌ను కోర్టుకు సమర్పించాడు. తన భర్త చనిపోయిన విషయాన్ని ప్రకాశ్ భార్య మమత కూడా నిర్ధారించింది. దీంతో ఆశ్చర్యపోయిన న్యాయమూర్తి జస్టిస్ సౌరభ్ శ్యామ్ షంషే చనిపోయిన వ్యక్తి ఎలా ఫిర్యాదు చేశాడని కుషీనగర్ ఎస్పీని ప్రశ్నించారు. మరణించిన వ్యక్తి వాంగ్మూలాన్ని కూడా రికార్డు చేశారని, హైకోర్టులో అఫిడవిట్‌ను వ్యతిరేకిస్తూ సమర్పించిన పిటిషన్‌పైనా చనిపోయిన వ్యక్తి సంతకం చేసినట్టు తెలిసి అవాక్కయ్యారు. కేసును సమీక్షించిన న్యాయస్థానం కేసును కొట్టివేసింది. దీనిపై విచారణ చేయాలని కుషీనగర్ ఎస్పీని ఆదేశించింది. చనిపోయిన వ్యక్తి పేరున అఫిడవిట్ దాఖలు చేసిన న్యాయవాదిని హెచ్చరించింది.





కోర్టు ప్రాంగణంలో మహిళపై లైంగిక దాడి!

న్యాయవాదిపై బాధితురాలు ఫిర్యాదు

న్యూఢిల్లీ, ఆగస్టు 8: అందరికీ న్యాయం చెప్పే న్యాయస్థానం ప్రాంగణంలోనే ఒక న్యాయవాది తనపై లైంగిక దాడికి పాల్పడినట్టు 21 ఏండ్ల మహిళ సబ్జీ మండీ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసింది. ఉద్యోగం ఇప్పిస్తానని ఉత్తర ఢిల్లీలోని తీస్ హజారీ కోర్టులోని తన చాంబర్‌కు పిలిపించిన ఒక న్యాయవాది తనపై లైంగిక దాడికి పాల్పడినట్టు ఆ మహిళ తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించి 1500 రూపాయలు ఇచ్చి పంపించివేశాడని, దీంతో తాను పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



నిందితుల ఊహాచిత్రాలు

బరేలీలో సీరియల్ కిల్లర్!

14 నెలల్లో 9 మంది మహిళల హత్య

న్యూఢిల్లీ, ఆగస్టు 8: యూపీలోని బరేలీ జిల్లా గ్రామీణ ప్రాంతంలో గత 14 నెలల్లో తొమ్మిది మంది మహిళలు ఒకే తరహాలో హత్యకు గురి కావడం పోలీసులకు సవాల్‌గా మారింది. 25 కి.మీ పరిధిలో ఈ హత్యలు జరగడం గ్రామస్థుల్ని ఆందోళనకు గురి చేస్తున్నది. మృతులంతా 45-55 ఏండ్ల వయస్కులని, అందరినీ పొలాల్లో గొంతు నులిమి చంపారని.. వారి దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయని పోలీసులు తెలిపారు. అయితే వారిపై లైంగిక దాడి జరిపిన దాఖలాలేవీ కనిపించలేదన్నారు. సీరియల్ కిల్లర్ ఈ హత్యలకు పాల్పడి ఉండొచ్చన్న విషయాన్ని కొట్టి పారేయలేమని యూపీ డీజీపీ ప్రశాంత్ కుమార్ తెలిపారు. 90 గ్రామాల రైతుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ముగ్గురు నిందితుల ఊహా చిత్రాలను పోలీసులు విడుదల చేశారు. కేసును ఛేదించడం కోసం ఇటీవల బెయిల్ లేదా జైలు నుంచి విడుదలైన వారి వివరాలను సీనియర్ అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు.